అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 14-4-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 103 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 14 పేజీలు + (టాబ్లాయిడ్ 12 పేజీలు) | వెల : 6.50



సమున్నత విజ్ఞాన మూర్తి
సామాజిక సమానత్వ స్ఫూర్తి

సామాజిక ఉద్యమ నిర్మాత, రాజ్యంగ రూపశిల్పి భారతరత్న

డా. బాబా సాహెబ్ అంబేడ్కర్
125 అడుగుల
కాంస్య విగ్రహావిష్కరణ



సమున్నత విజ్ఞాన మూర్తి
సామాజిక సమానత్వ స్ఫూర్తి

సామాజిక ఉద్యమ నిర్మాత, రాజ్యంగ రూపశిల్పి భారతరత్న

డా. బాబా సాహెబ్ అంబేడ్కర్
125 అడుగుల
కాంస్య విగ్రహావిష్కరణ

శుక్రవారం, 14 ఏప్రిల్ 2023

మధ్యాహ్నం 2 గంటలకు..

గౌరవ ముఖ్యమంత్రి

శ్రీ కె. చంద్రశేఖరరావు గారి చేతుల మీదుగా

ప్రపంచంలో కెల్లా ఎత్తయిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకుందాం.

విశ్వ విజ్ఞాన మూర్తికి వినమ్ర నివాళులు అర్పించుకుందాం

షెడ్యూల్డ్ కులాల
సంక్షేమంలో దేశానికి
ఆదర్శం తెలంగాణ



గౌరవ అతిథి

శ్రీ ప్రకాశ్ అంబేడ్కర్ గారు
మాజీ లోక్ సభ సభ్యులు,
బాబాసాహెబ్ అంబేడ్కర్
గారి మనుమడు

దేశానికి దిక్సూచి తెలంగాణ దళితబంధు

దళితుల స్వావలంబన కోసం వినూత్న విప్లవాత్మక పథకం.
దేశంలోనే కాదు ప్రపంచంలోనే మరెక్కడా లేని అతిపెద్ద నగదు బదిలీ పథకం.

- దళితకుటుంబం తమకు వచ్చిన, నచ్చిన ఉపాధి లేక వ్యాపారం ప్రారంభించడానికి 10 లక్షల రూపాయల భారీ మొత్తాన్ని ఉచిత గ్రాంటు రూపంలో ప్రభుత్వం అందిస్తున్నది.
- తిరిగి చెల్లించవలసిన అవసరం లేదు, బ్యాంకు లింకేజీ లేదు. • ఇప్పటి వరకు దళితబంధు పథకం ద్వారా రూ. 3,832 కోట్ల ఖర్చుతో 38,323 దళిత కుటుంబాలకు లబ్ది చేకూరింది. మేలైన ఉపాధి మార్గాన్ని ఎంచుకొని మెరుగైన జీవితాన్ని పొందారు. • ఈ ఆర్థిక సంవత్సరంలో దళితబంధు ద్వారా 1,77,000 మందికి లబ్ది చేకూర్చేందుకు బడ్జెట్‌లోరూ.17,700 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. దశల వారీగా రాష్ట్రంలోని అన్ని దళిత కుటుంబాలకూ ప్రభుత్వం దళితబంధు ప్రయోజనాలు అందించనుంది.

ఎస్.సి. సబ్ ప్లాన్ : దళిత సామాజిక వర్గ సంక్షేమం కోసం ఏడేండ్లలో చేసిన మొత్తం ఖర్చు రూ.1,13,192 కోట్లు

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల ప్రజల జనాభా దామాషాకు అనుగుణంగా నిధుల కేటాయింపు జరిగే విధంగా ఎస్.సి. ప్రత్యేక ప్రగతి నిధి చట్టాన్ని ప్రవేశపెట్టింది.

- ఒక ఆర్థిక సంవత్సరంలో ఎస్.సి. వర్గాలకు కేటాయించిన నిధులు ఖర్చు చేయకపోతే వాటిని తరువాతి ఆర్థిక సంవత్స రానికి బదిలీ చేయాలనే నిబంధనను చట్టంలో పొందు పరిచిన ఏకైక ప్రభుత్వం మన తెలంగాణ ప్రభుత్వం.
- 2004 నుండి 2014 వరకు దశాబ్ద కాలంలో ఆనాటి ప్రభుత్వం ఎస్.సి. సామాజిక వర్గ ప్రజల సంక్షేమానికి ఖర్చు చేసిన నిధుల మొత్తం 16,000 కోట్ల రూపాయలు మాత్రమే.
- తెలంగాణ ప్రభుత్వం ఏడేండ్లలో ఎస్.సి. సామాజిక వర్గ ప్రజల సంక్షేమానికి ఖర్చు చేసిన నిధుల మొత్తం 1,13,192 కోట్ల రూపాయలు.
- ఇది తెలంగాణ ప్రభుత్వానికి ఎస్.సి. సామాజిక వర్గ ప్రజల సంక్షేమం పట్ల ఉన్న చిత్తశుద్ధికి బలమైన నిదర్శనం.

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వ్యాపారాల్లో దళితులకు 15% రిజర్వేషన్

దేశంలో ఎక్కడా లేని విధంగా లాభసాటి వ్యాపారాలైన ఫెర్టిలైజర్ షాపులు, మెడికల్ షాపులు, మద్యం షాపుల లైసెన్సుల కేటాయింపుల్లో షెడ్యూల్ కులాల వారికి 15 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించిన ఏకైక ప్రభుత్వం.

విదేశాలలో ఉన్నత విద్యకు రూ. 20 లక్షల స్కాలర్ షిప్

విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీ విద్యార్థులకు 20 లక్షల రూపాయల అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్‌ను తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్నది
దేశంలో ఇంత పెద్ద మొత్తంలో స్కాలర్ షిప్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

తెలంగాణ ఆచరిస్తున్నది..
దేశం అనుసరిస్తున్నది

1001 గురుకుల విద్యాలయాలు

- బలహీన వర్గాల విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం 1001 గురుకుల విద్యాలయాలను అందుబాటులోకి తెచ్చింది.
- మేలైన వసతులతో పాటూ ఇంగ్లీష్ మీడియంలో ప్రామాణిక విద్యను అందిస్తున్నది. అంత ర్జాతీయ స్థాయిలో పోటీని తట్టుకునే విధంగా విద్యార్థులకు శిక్షణనిస్తున్నది.
- గురుకుల విద్యాలయాలలో చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలలో ప్రవేశాలను సాధిస్తున్నారు.

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

సాగదీతనే

ఫలించని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చర్చలు

- డిమాండ్లను నోట్ చేసుకున్న జేసీఎల్
- 24న తదుపరి చర్చలుంటాయని ప్రకటన
- 17 నుంచి సమ్మె ఉంటే 24న చర్చలేంటంటూ జేఏసీ ఆగ్రహం
- ముందే జరపాలని కోరినా పట్టించుకోని కార్మిక శాఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీ అమలు విషయంపై రాష్ట్ర సర్కారు ఎటూ తేల్చకుండా సాగదీస్తూ పోతున్నది. ఈ నెల 17 లోపలే పీఆర్సీని ఫైనల్ చేయాలన్న అంశాన్ని పట్టించుకోలేదు. గురువారం హైదరాబాద్‌లోని అంజయ్య భవన్ (కార్మికశాఖ రాష్ట్ర కార్యాలయం)లో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డి.శ్యామ్‌సుందర్‌రెడ్డి సమక్షంలో విద్యుత్ శాఖ మేనేజ్‌మెంట్‌కు, జేఏసీ మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో మేనేజ్‌మెంట్ తరపున ట్రాన్స్‌కో జేఎమ్‌డీ శ్రీనివాసరావు, జెన్కో డైరెక్టర్(హెచ్ఆర్) అశోక్ కుమార్, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్(హెచ్ఆర్) వెంకటేశ్వర్ రావు, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్(హెచ్ఆర్) పర్వతం పాల్గొ న్నారు. జేఏసీ నుంచి 14 మంది హాజరు కాగా.. వారిలో సాయిబాబు, ప్రభాకర్‌రెడ్డి, బీసీరెడ్డి, గోవర్ధన్, వజీర్, వెంకన్నగౌడ్, నాగరాజు, తదితరులు న్నారు. పీఆర్సీ అమలు, ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చటం, విద్యుత్ శాఖలోని ఇతర ఉద్యోగుల మాదిరిగానే ఆర్టిజన్ ఉద్యోగులకు సమాన స్కేల్, రూల్స్ వర్తింపజేసి రెగ్యులర్ క్యాడర్(జేఎల్ఎమ్)గా గుర్తించాలి అంశాలను జేఏసీ నేతలు ప్రధాన అజెండాగా కార్మిక శాఖ ముందు ఉంచారు.

ఈ అంశాలను జేసీఎల్ నోట్ చేసుకున్నారు. తదుపరి చర్చలు ఈ నెల 24న ఉంటాయని ప్రకటించారు. దీనిపై జేఏసీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నెల 17 నుంచి తాము సమ్మెలోకి వెళ్తుంటే 24న చర్చలకు పిలవడమేంటి అని ప్రశ్నించారు. సమ్మె తేదీ కంటే ముందే చర్చలు జరపాలని కోరారు. దీన్ని కార్మిక శాఖ పట్టించుకోలేదు. 24నే చర్చలుంటాయని స్పష్టం చేసింది. ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఈ నెల 17 నుంచి విద్యుత్ శాఖ ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లడం ఖాయమని జేఏసీ నేతలు తెలిపారు.

అంబేద్కర్ వారసత్వాన్ని కబ్జా కానివ్వం

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు అధ్యక్షతన నిర్వహించిన 'అంబేద్కర్-రాజ్యాంగం-సామాజికన్యాయం' సెమినార్‌లో రాఘవులు మాటాడారు. రాజ్యాంగానికి, అంబేద్కర్‌కు అవినాభావ సంబంధముందని అన్నారు. రాజ్యాంగాన్ని రచించాలనే గొప్ప ఆశయం కోసం ఆయన జీవితాన్నే అంకితం చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడానికి పోటీపడాలి తప్ప విగ్రహాలు పెట్టడానికి కాదని, కేసీఆర్ 125 అడుగుల విగ్రహం పెడితే మహారాష్ట్రలో మోడీ 350అడుగుల విగ్రహానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. సీఐటీయూ అధికారం కోసమో? ఓట్ల కోసమో కాకుండా దీర్ఘకాలిక లక్ష్యం కోసం కార్యక్రమాలు చేపడుతున్నదని చెప్పారు. సామాజిక న్యాయం సిద్ధిస్తేనే కార్మికులకు హక్కులు, కనీస వేతనాలు, ఇతర సౌకర్యాలు వస్తాయని వివరించారు. అంబేద్కర్ మార్గాన్ని అనుసరించని బీజేపీ-ఆర్ఎస్ఎస్, మనువాదులు ఆయన వారసులమని చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఆయన్ను హిందూ సంస్కరణవాదిగాను చిత్రీకరిస్తున్నారని, బౌద్ధమతం హిందూమతంలో భాగమేనంటూ అబద్దాలు, అభూత కల్పనలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అయితే అదే అంబేద్కర్ మనుధర్మ శాస్త్రాన్ని తగులబెట్టారని గుర్తుచేశారు. రాజ్యాంగంలోని మౌలిక అంశాల ప్రతిపాదనలతోపాటు వాటికి రూపాన్ని ఇవ్వడం, మార్గదర్శకానికి ప్రాధాన్యత ఉందని వివరించారు. జాతీయోద్యమ కాలంలో ప్రజలను ఒప్పించి, మెప్పించడానికి ముందుకొచ్చిన అంశాలైన ప్రజాస్వామ్య పరిపాలన, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం, లౌకికతత్వం, సమాఖ్య విధానం, భాషాప్రయుక్త రాష్ట్రాలు, సామాజిక న్యాయం వంటివాటిని రాజ్యాంగంలో చేర్చారని గుర్తుచేశారు. మహిళలకు ఆస్తిలో హక్కులు, నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించేందుకు అంబేద్కర్ ప్రవేశపెట్టిన హిందూకోడ్ బిల్లును అమలుకాకుండా ఆనాటి పాలకులు అడ్డుకున్నారని తెలిపారు. దానికి నిరసనగా మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం జాతీయోద్యమ నినాదాలకు, రాజ్యాంగ విలువలను ధ్వంసం చేయడానికి కంకణం కట్టుకుందని, ఫెడరల్ వ్యవస్థను నాశనం చేస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపర్చడానికి గవర్నర్లు పెత్తనం చెలాయిస్తున్నారని, ఇలాంటి చర్యలు దేశవిచ్ఛిన్నానికి దారితీస్తాయని హెచ్చరించారు. మహిళల వేషాధారణ శూర్పణఖల్లాగా ఉందని ఓ బీజేపీ నేత అనడం హస్యాస్పదంగా ఉందంటూ, అసలు శూర్పణలను తయారుచేసింది మనుధర్మశాస్త్రమే కదా అని విమర్శించారు. కేరళలో గతంలో రవికల పోరాటం నడిచిందని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్, మనువాదులను మహిళలను అనుమానిస్తున్నారని, ఏం తినాలో? ఏలాంటి దుస్తులు ధరించాలనే విషయంపై శాసిస్తున్నారని, సంస్కార భారతిపేరుతో వైద్య వృత్తిని హైజాక్ చేస్తున్నారని వివరించారు. కులవ్యవస్థ నాశనం అయితేనే సమాజంలో సమూల మార్పులు వస్తాయని తెలిపారు. కుల, మతవాదాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఆర్థిక దోపిడి, సామాజిక అణిచివేతపై పోరాటం చేయడానికి కార్మికవర్గం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయ సాధనకు సంఘటిత పోరాటాలు నిర్వహించాలని అన్నారు. కార్మికవర్గంలో సామాజిక న్యాయం కోసం రణదివే ఎంతో కృషిచేశారని గుర్తుచేశారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక దళితులపై దాడులు పెరిగాయని, కులదురంహాకార హత్యలు పెరిగాయని తెలిపారు. కర్ణాటకలో దళిత మహిళ బావిలో నీళ్లు తాగిందనే కారణంతో అగ్రవర్ణాలు ఆ బావిలో ఆడపేడ, మూత్రం కలిపారని గుర్తుచేశారు. దీనికి ప్రతిఘటనగా దళిత యువకులు అన్ని బావుల్లో నీళ్లు తాగి ఏం చేసుకుంటారో చేసుకోండని సవాల్ విసిరారని తెలిపారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లులక్ష్మి మాట్లాడుతూ మహిళలు మాంసం తింటే లైంగిక కోరికలు పెరుగుతాయని, నిబద్ధత లోపిస్తుందంటూ రాజస్థాన్‌లో బీజేపీ నేతలు అనడం అవమానకరంగా ఉందన్నారు. గోరక్షక దళాల దాడులు, కర్ణాటకలో హిజాబ్ అంశం పేరుతో మనువాదులు మహిళలను కించపరుస్తున్నారని తెలిపారు. అవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ అబ్బాస్ మాట్లాడుతూ వైవిధ్యాన్ని ధ్వంసం చేయడానికే ఆర్ఎస్ఎస్‌శక్తులు మనుధర్మశాస్త్రాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని విమర్శించారు. మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వడానికి బీజేపీ కుట్ర చేస్తోందని అన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్ మాట్లాడుతూ ఆదివాసీలు, గిరిజనులను మనువాదులు హిందువులుగా చిత్రీకరిస్తున్నారని అన్నారు. ఝార్ఖండ్‌లో గిరిజనులు హిందుమతానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. తాము ఏ మతంకాదు.. ప్రకృతి ఆరాధీకులమంటూ చెప్పకుంటున్నట్టు గుర్తుచేశారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయం క్యాంపెయిన్‌కు సంఘీభావ నిధిగా సంగారెడ్డిలోని శాండ్విక్ కంపెనీ కార్మికులు రూ.14,900, పశుమిత్రల సంఘం నుంచి రూ.5,200 విరాళంగా అందజేశారు. అందకార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కార్యదర్శులు ఎస్వీ.రమ, జె.వెంకటేష్, శ్రీకాంత్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మనాయక్, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షకార్యదర్శులు జె.కుమారస్వామి, ఎం.వెంకటేష్, గ్రేటర్ హైదరాబాద్ సౌత్ సిటీ అధ్యక్షులు శ్రావణ్‌కుమార్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకో హటావో... దేశ్‌కో బచావో

నేటి నుంచి ఇంటింటికీ సీపీఐ : కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, అదానీ వంటి కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజైన శుక్రవారం నుంచి వచ్చేనెల 15 వరకు "బీజేపీకో హటావో...దేశ్‌కో బచావో" అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ సీపీఐ యాత్రను నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. గ్రామ కార్యదర్శి నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు సుమారు నాలుగు నుంచి ఐదు లక్షల వరకు ఏదో ఒక ప్రాంతంలో జరిగే యాత్రలో పాల్గొంటారని వివరించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేశామన్నారు. కేంద్ర అంశాలతో పాటు రాష్ట్ర విభజన హామీలను తమ యాత్రలో ప్రస్తావించనున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అంశాలతో పాటు రాష్ట్రంలోని బయ్యారం, ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, నీటి పారుదల శాఖ అనుమతులు, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రాజెక్టుకు జాతీయ హోదా అనేక సమస్యలున్నాయని వివరించారు.

నేడు అంబేద్కర్ విగ్రహం నుంచి యాత్ర

"బీజేపీకో హటావో..దేశ్‌కో బచావో" 'ఇంటింటికీ సిపిఐ' యాత్రను హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాల వేసి అక్కడి నుంచి పాదయాత్రగా ఇందిరాపార్క్ వద్దకు చేరుకుంటామని కూనంనేని అన్నారు. అనంతరం ప్రారంభ సభను నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా తదితరులు హాజరవుతారన్నారు. పోడుభూములకు పట్టాలివ్వాల్సిన బాధ్యత సీఎం కేసీఆర్‌పైనే ఉందని చెప్పారు. గత అసెంబ్లీ సమావేశంలో ఆయన ప్రకటించినట్టుగా పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఏమైనా సాంకేతిక సమస్యలుంటే కేంద్రంతో పోరాటం చేయాలని సూచించారు. కానీ పోడు రైతులకు మాత్రం ఏదో ఒక రూపంలో గ్యారంటీ ఇవ్వాలన్నారు. విద్యుత్ కార్మికులకు 35 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీలో రెండో నిందితుడు ప్రశాంత్‌ను బీజేపీ నేతలు సన్మానాలు ఎందుకు చేస్తున్నారో బండి సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. తమ పార్టీ జాతీయ పార్టీ హోదాను ఎన్నికల కమిషన్ ఉపసంహరించడం బీజేపీ అనుసరించిన భావజాల దాడి అని కూనంనేని విమర్శించారు.

కొన్ని రోజుల్లో ఎన్నికలు రాబోతున్న తరుణంలో జాతీయ పార్టీ హోదా ఉపసంహరణ నిర్ణయం అవసరమే లేదని, ఇదొక కుటిల ప్రయత్నమని అన్నారు. చీమలపాడు ఘటనలో ముగ్గురు మరణించడం పట్ల కూనంనేని విచారం వ్యక్తం చేశారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆ ఘటనలో నిందితులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు. గవర్నర్ వ్యవస్థ పట్ల కేంద్రం అనుసరిస్తున్న విధానాలు అప్రజాస్వామికంగా ఉన్నాయని విమర్శించారు. బిల్లుల ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసిన తర్వాత గవర్నర్ ఏ బిల్లు ఎందుకు ఆపారో తెలియజేశారని అన్నారు. ఇది గవర్నర్ వ్యవస్థ నిరంకుశ విధానాలకు నిదర్శనమని అన్నారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన తర్వాతనే కొన్ని బిల్లులను అక్కడ ఆమోదించారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య దేశం కాకుండా, నిరంకుశ, అప్రజాస్వామిక దేశంగా ముందుకెళ్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

డిజిటల్ అక్షరాస్యతపై పిఎన్‌బి క్యాంపెయిన్



హైదరాబాద్:పంజాబ్ నేషనల్ బ్యాంక్ 129వ వ్యవ స్థాపక దినోత్సవం సందర్భంగా డిజిటల్ లిటరసీ, సైబర్ ఆవర్ నెస్ క్యాంపెయిన్ నిర్వహించింది. సికింద్రాబాద్ సర్కిల్, ఆ పరిధిలో ని శాఖల్లో బుధవారం అనేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బి వెంకట నరేష్ ఆధ్వర్యంలో హెల్త్ చెకఅఫ్ క్యాంప్‌లు, డిజిటల్ లిటరసీ, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆ బ్యాంక్ ఓ ప్రకటనలో తెలిపింది. అదే విధంగా మరింత గొప్పగా ఖాతాదారులకు సేవలు అందించాలని ఉద్యోగులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 14-4-2023 సమగ్ర తెలుగు దినపత్రిక www.navatelangana.com

సంపుటి : 9 సంచిక : 103 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + (టాబ్లాయిడ్ 12 పేజీలు) వెల : 6.50

సంపాదకీయం


సజీవుడు అంబేద్కర్!

ఆయన పుట్టి నూటాముప్పయి మూడేండ్లు, మరణించి ఏడు దశాబ్దాలు గడిచాయి. కానీ సామాజిక రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ ఆయనింకా సజీవంగానే సంచరిస్తున్నాడు. ఈ దేశంలోని అశేష ప్రజానీకపు సమస్యలపై జీవిత పర్యంతమూ పనిచేసిన అమరుడాయన. జ్యోతిబాపూలే

గత ఏడు దశాబ్దాలుగా అంబేద్కర్ తీవ్ర కృషి ఫలితంగా ఏర్పడిన రాజ్యాంగం ఇచ్చిన అవకాశాలతో, చదువునూ, విజ్ఞానాన్ని, బతుకు దెరువునూ కొంతలో కొంతయినా పొందిన బడుగులు నేడు ప్రశ్నించే స్థాయికి ఎదిగారు. అయితే అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలన లక్ష్యం ఇంకా చేరువకాలేదు. గత ఆరుదశాబ్దాలుగా రిజర్వేషన్లు అమలువుతున్నా దళితుల, ఆదివాసీల, వెనకబడిన తరగతుల సామాజిక పరిస్థితులు తగినంతగా మెరుగుపడలేదు.

లాంటి సామాజిక విప్లవకారుల అడుగుజాడలో మరింత వేగంగా అడుగులు వేసి, పీడితుల తాడితుల గుండెల్లో వెలుగుదీపమై నేటికీ నిలిచివున్నాడు బాబాసాహెబ్ అంబేద్కర్. నిజంగా అతనో గొప్ప మేధావి. న్యాయశాస్త్ర కోవిదుడు. భారతదేశం గర్వించదగిన నాయకుడు. మన రాజ్యాంగ రూపకల్పన చేసిన మార్గనిర్దేశకుడు.

చిన్నతనంలోనూ, చదువుకునే రోజుల్లోనూ అంబేద్కర్ అంటరానివారు అనుభవించే అవమానాలను తానూ అనుభవించాడు. ఆ అనుభవాలే ఆయనలో మరింత పట్టుదల పెంచాయి. కుల వ్యవస్థ నిర్మూలన కోసం నిరంతరం శ్రమింప జేశాయి. సాహు మహరాజ్ మొదలైనవారి సహకారంతో లండన్, కొలంబియాలలో ఆర్థిక, రాజకీయ, న్యాయశాస్త్రాలను అధ్యయనం చేసి మేధస్సుకు పదునుపెట్టాడు. గాంధీజీ నాయకత్వంలో దేశంలో అంటరానితనం నిర్మూలన కోసం తీవ్రంగా కృషిచేసినప్పటికీ, ఆ సమస్యకు మూలమైన హిందూ చాతుర్వర్ణ వ్యవస్థ వర్ణాశ్రమ ధర్మాన్ని పవిత్రంగానే చూడటాన్ని అంబేద్కర్ వ్యతిరేకించాడు. 1927లోనే మనుస్మృతిని వేలాది మంది దళితుల సమక్షంలో దహనం చేశారు. అస్పృశ్యులలో చైతన్యాన్ని పెంపొందించి, వారిలో గల బానిస ప్రవృత్తిని నిర్మూలించేందుకు, మానవ హక్కుల కోసం, సమానత్వం కోసం వారు పోరాడేటట్లు నిర్విరామంగా కృషి చేశారు. ఛాందసవాదులను ధిక్కరించాడు. మహద్ చెరువులో నీరు తాగే హక్కు కోసం, దేవాలయ ప్రవేశం కోసం నాసిక్‌లో పోరాటానికి అంబేద్కర్ నాయకత్వం వహించాడు. గుడిలోకి ప్రవేశాన్ని, చెరువులో నీళ్ల తాగే స్వేచ్ఛనూ నిరాకరిస్తున్న హిందూమతంపై విశ్వాసాన్ని కోల్పోయాడు. 'మతబోధకులూ, మతావలంబకులు కేవలం దేవుడికి మనుష్యులకు ఉండే సంబంధాలను గురించి మాత్రమే ప్రస్తావిస్తారు. కానీ మనుష్యుల మధ్య ఉండవలసిన సంబంధాలను గురించి వారు చెప్పరు' అని నిలదీస్తాడు. హిందూ మతంలోని వివక్షతలను, మూఢ విశ్వాసాలను, అన్యాయా లను బహిరంగ పరచి ఎండగట్టారు. మనుధర్మ శాస్త్రాన్ని, మన రాజ్యాంగానికి మారుగా నేడు ప్రచారంలోకి తెస్తున్న హిందూత్వవాదుల కుటిల పన్నాగాలను అంబేద్కర్ స్ఫూర్తితో నేడు మనం తిప్పికొట్టాల్సివుంది.



ఇక రెండో విషయం నేటి పాలకులు ఆర్థికపరంగా, సామాజికపరంగా అంబేద్కర్ ఆలోచనలకు, రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ఆనాడు అంబేద్కర్ 'రాష్ట్రాలు- మైనార్టీలు' అన్న రచనలో ఇలా చెబుతారు... "మౌలికమైన, కీలకమైన పరిశ్రమలన్నింటినీ, ఇన్సూరెన్స్‌ను, సాగుకు అనుకూలంగా ఉన్న భూములను ప్రభుత్వం వశం చేసుకోవాలి. పేదరైతులకు, భూమిలేని వ్యవసాయ కార్మికులకు పంచాలి, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు నెలకొల్పాలి. సవర్ణ హిందువుల నుండి మైనార్టీలకు తగు రక్షణలను కల్పించాలని" కోరారు. అందువల్లనే ప్రముఖ దళిత మేధావి రావు సాహెబ్ కాస్బే అంబేద్కర్ గురించి చెబుతూ... 'ప్రపంచ చరిత్ర అంతా వర్గ సమాజ చరిత్రే. ఇందుకు ఇండియా మినహాయింపు ఏమీకాదు." అయితే "వర్గంలోనే కులం కూడా ఇమిడివున్నది" అని అంబేద్కర్ దేశంలోని వర్గ వ్యవస్థ మూలాన్ని గురించిన వివరణలో పేర్కొనడాన్ని కాస్బే వివరిస్తారు. అంటే బుద్ధుని "దుఃఖం" అన్నదానిని దోపిడీతో సమాన అర్థంగా భావించారు. మన దేశంలో గ్రామీణ ప్రాంతాలలోని అత్యధిక పేదలు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, అస్పృశ్యకులాలుగానే ఉన్నారు. దోపిడీ పీడనకు గురవుతున్న వారూవారే. అందుకనే ఇప్పుడు దోపిడీ, కుల పీడనలకు వ్యతిరేకంగా జమిలిగా పోరాడవలసిన అవసరం ఉందని, నేడు వామపక్షాలు భావిస్తున్నాయి. ఆచరణలోను అడుగులేస్తున్నాయి.

గత ఏడు దశాబ్దాలుగా అంబేద్కర్ తీవ్ర కృషి ఫలితంగా ఏర్పడిన రాజ్యాంగం ఇచ్చిన అవకాశాలతో, చదువునూ, విజ్ఞానాన్ని, బతుకు దెరువునూ కొంతలో కొంతయినా పొందిన బడుగులు నేడు ప్రశ్నించే స్థాయికి ఎదిగారు. అయితే అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలన లక్ష్యం ఇంకా చేరువకాలేదు. గత ఆరుదశాబ్దాలుగా రిజర్వేషన్లు అమలువుతున్నా దళితుల, ఆదివాసీల, వెనకబడిన తరగతుల సామాజిక పరిస్థితులు తగినంతగా మెరుగుపడలేదు. కుల పీడనకు ఆధారంగా ఉన్న దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కులనిర్మూలనా పోరాటాన్ని మిళితం చేయవలసి ఉన్నది. ఇది మనం అంబేద్కర్ జయంతి రోజున పొందాల్సిన స్ఫూర్తి.



హిందూ రాష్ట్రం ఏర్పడితే దేశ సమైక్యతకు గొడ్డలిపెట్టు అని అంబేద్కర్ ఆనాడే చెప్పారు. కుల నిర్మూలన కోసం అంబేద్కర్ పనిచేస్తే అందుకు భిన్నంగా ఆర్ఎస్ఎస్ మతోన్మాద బీజేపీ చాతుర్వర్ణ వ్యవస్థను కోరుతున్నది. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఫాసిస్టు సిద్ధాంతం. వారి లక్ష్యం విభజనవాదం, హిందూ రాజ్యస్థాపన, ఏక సంస్కృతి, మధ్యయుగాల నాటి విధానాలను పునరుద్ధరణే వారి ధ్యేయం. నేడు అధికారంలో ఉన్న ఆర్ఎస్ఎస్- బీజేపీ, సంఘ్ పరివార్ శక్తులు అంబేద్కర్ భావజాలం, ఆచరణకు పెద్ద ఆటంకంగా, సవాల్‌గా మారాయి.

అంబేద్కర్ ఆశయాలను సమాధి చేస్తున్న ఆరెస్సెస్-బీజేపీ

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రముఖ భారతీయ న్యాయ కోవిదుడు. ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త, సామాజికోద్యమ నాయకుడు. కుల నిర్మూలన కోసం ఎంతగానో కృషిచేసిన మహానుభావుడు. స్వతంత్ర భారతదేశపు మొదటి కేంద్ర న్యాయ శాఖామంత్రి, రాజ్యాంగ శిల్పి. కొలంబియా విశ్వ విద్యా లయం నుండి పీహెచ్‌డీ, లండన్ విశ్వవిద్యాలయం నుండి డీఎస్‌సీ డాక్టరేట్ పట్టాలను పొంది చాలా అరుదైన గౌరవాన్ని సంపాదించిన విజ్ఞాన వేత్త. న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాల్లో పరిశోధనలు చేసిన మేధావి. ఆయన 1891 ఏప్రిల్ 14న మహారాష్ట్రలో జన్మించారు. చిన్నతనం నుంచే కుల అసమానతలను చవిచూశారు. చదువుకోవాలన్నా, మంచినీళ్ళు తాగాలన్నా ఆయనకు కులమే అడ్డుగా నిల బడింది. ఆయన జీవితాంతం ఎన్నో అవమానాలను, అవహేళనలను ఎదుర్కొన్నారు. తన స్వ అను భవాలను దృష్టిలో పెట్టుకుని సమాజంలో వర్ణ, వర్గ బేధాలు ఉండొద్దని రాజ్యాంగాన్ని ప్రత్యేకంగా రూపొందించారు. అంబేద్కర్ విభిన్న అంశాలపై విస్తృతంగా రచనలు చేశారు. ప్రజాస్వామ్యం, అంటరానితనం, మత మార్పిడులు, బౌద్ధమతం, హిందూ మతంలోని చిక్కుముడులు, సంస్కరణలు, దళితులు, భారతదేశ చరిత్రలోని వివిధ అంశాలపై కూడా రచనలు చేశారు. కుల వ్యవస్థ రద్దు చేయడానికి కుల నిర్మూలనను ప్రతిపాదించాడు. స్వతంత్ర భారతావనిలో తొలి న్యాయ శాఖామంత్రిగా అంబేద్కర్ పనిచేశారు. కుల వ్యవస్థను సవాల్ చేసిన సామాజిక విప్లవకారుడు అంబేద్కర్. సమానత్వం, ఒక మనిషికి ఒక విలువను ఆయన ముందుకు తీసుకొచ్చారు. కుల వ్యవస్థ, అంటరానితనం, మానవ, కార్మిక, స్త్రీల హక్కుల కోసం నిరంతరం కృషి చేశారు. సమాజాన్ని సమానత్వం, హేతుబద్ధమైన పద్ధతుల్లో పునర్ వ్యవస్థీకరించాలని కోరుకున్నారు. నిచ్చెనమెట్ల సామాజిక నిర్మాణంపై ఆధారపడిన కులాన్ని ఆయన వ్యతిరేకించారు. సమానత్వం, సౌభ్రాతృత్వం ఆధారంగా సమాజాన్ని నిర్మించబడాలని ఆయన దృఢంగా విశ్వసించారు. కానీ నేడు దేశంలో జరుగు తున్నది అంబేద్కర్ ఆలోచనలకు భిన్నం. స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు దాటినా, అంబేద్కర్ ఏ వివక్షలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారో, ఆ వివక్ష నేటికీ కొనసాగుతున్నది. జనాభాలో 70శాతం మందికి పైగా ఉన్న దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వారు అనాగరికమైన కుల వివక్షకు, అణిచివేత, లైంగికదాడులకు గురౌతున్నారు.



పాలడుగు భాస్కర్

కుల నిర్మూలన, వివక్షపై పోరాడాలన్న అంబేద్కర్

అణగారిన వర్గాలు-ముఖ్యంగా కార్మికవర్గాలు ఆర్థిక, సామాజిక దోపిడీకి గురౌతుండటంపై అంబేద్కర్ ఆవేదన చెందారు. వైస్రాయి కార్యనిర్వాహక కౌన్సిల్‌లో 1942 జూన్ వరకు అంబేద్కర్ సభ్యుడిగా ఉన్నప్పుడు కార్మికుల ప్రయోజనాల కోసం కీలకచర్యలు ప్రతిపాదించారు. కార్మికులందరికీ సరైన వేతనాలు, పని పరిస్థితులు హక్కుగా ఉండేందుకు కృషిచేశారు. పరిశ్రమల్లో రోజుకు 12గంటల పని విధానాన్ని వ్యతిరేకించారు. పని గంటలు ఎనిమిది గంటలకు తగ్గింపు, సమాన పనికి - సమాన వేతనం చట్టాల కోసం పోరాడారు. పని గంటలపై 1942 నవంబర్ 27న ఢిల్లీలో అంబేద్కర్ అధ్యక్షతన నిర్వహించిన 4వ భారత కార్మిక సదస్సులో ఆయన తొలిసారి ప్రతిపాదించాడు. 1945 నవంబర్ 27, 28 తేదీల్లో జరిగిన 7వ భారత కార్మిక సదస్సు వారానికి 48గంటల పని విధానానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సదస్సులో కేంద్ర, ప్రొవిన్షియల్ ప్రభుత్వాలు, యాజమాన్య సంఘాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. మనదేశంలో వర్గంలోనే కులం ఇమిడి ఉందని ఆయన నమ్మారు. కుల నిర్మూలన, వివక్ష, సామాజిక న్యాయం కోసం పోరాడకుండా భారతదేశంలో వర్గ ఐక్యతను సాధించలేమన్నారు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే మనం ఎటు వెళ్ళినా కులం దారికి ముళ్ళ కంచెలా అడ్డం నిలుస్తుందని హెచ్చరించారు. రాజ్యాంగ నిర్మాణ సభకు షెడ్యూల్డ్ కులాల ఫెడరేషన్ తరఫున సమర్పించిన "రాష్ట్రాలు - మైనార్టీలు" అనే డాక్యుమెంట్‌లో అంబేద్కర్ ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానాన్ని కోరారు. మౌలికమైన కీలక పరిశ్రమలు, ఇన్సూరెన్స్ ప్రభుత్వ ఆధీనంలో ఉండాలనీ, సాగుకు అనువైన భూములకు పరిహారం చెల్లించి పేద రైతులకు, భూమిలేని వ్యవసాయ కూలీలకు పంచాలన్నారు. సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు నెలకొల్పాలని, మైనార్టీలకు తగు రక్షణ కల్పించాలని కోరారు. 1937 సెప్టెంబర్‌లో మైసూరులో జరిగిన దళిత మహాసభలో అధ్యక్షోపన్యాస మిస్తూ సాంఘిక, ఆర్థిక సమానత్వం అనే లక్ష్యాల ద్వారా మాత్రమే సామాన్య మానవునికి తన అభిమతానుసారంగా స్వేచ్ఛగా పురోగమించడానికి అవకాశాలేర్పడుతాయని, ఉత్పత్తి సాధనాలు కొద్ది మంది చేతుల్లో ఉండి దోపిడీ చేయడానికి వీలున్నంత కాలం సామాన్య ప్రజలు అభివృద్ధి చెందడానికి ఏ మాత్రం అవకాశం ఉండదని ఆయన పేర్కొన్నారు. 1938లో కొంకన్ ప్రాంతంలో కౌలు రైతుల హక్కుల కోసం జరిగిన పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశంలో ఆయన న్యాయశాఖా మంత్రిగా ఉన్న సమయంలో హిందూ కోడ్ బిల్లు ద్వారా స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించేందుకు ఆయన చేసిన కృషికి ఆనాటి నెహ్రూ ప్రభుత్వం ఆటంకాలు కల్పించడంతో 1957లో తన పదవికి రాజీనామా చేశారు.

మనువాద రాజ్యాంగం అమలుకు ఆరెస్సెస్-బీజేపీ కుట్రలు

హిందూ రాష్ట్రం ఏర్పడితే దేశ సమైక్యతకు గొడ్డలి పెట్టు అని అంబేద్కర్ ఆనాడే చెప్పారు. కుల నిర్మూలన కోసం అంబేద్కర్ పనిచేస్తే అందుకు భిన్నంగా ఆర్ఎస్ఎస్ మతోన్మాద బీజేపీ చాతుర్వర్ణ వ్యవస్థను కోరుతున్నది. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఫాసిస్టు సిద్ధాంతం. వారి లక్ష్యం విభజనవాదం, హిందూ రాజ్యస్థాపన, ఏక సంస్కృతి, మధ్యయుగాల నాటి విధానాలను పునరుద్ధరణే వారి ధ్యేయం. నేడు అధికారంలో ఉన్న ఆర్ఎస్ఎస్- బీజేపీ, సంఘ్ పరివార్ శక్తులు అంబేద్కర్ భావజాలం, ఆచరణకు పెద్ద ఆటంకంగా, సవాల్‌గా మారాయి. ఒకే మతం అంటూ హిందూయేతర ముస్లిం - క్రిస్టియన్, మైనార్టీ మతస్తులపై దాడులు సాగిస్తున్నారు. అణగారిన కులాలకు చెందిన దళిత, గిరిజన, మహిళ, వెనుకబడిన తరగతులపై నిరంతరం దాడులు జరుగుతూనే ఉన్నాయి. కులాల పేరుతో, మతాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారు. తినే తిండిపై, కట్టే బట్టలపై ఆధిపత్యం చేస్తున్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని లౌకిక విలువలకు తూట్లు పొడిచి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కుట్రలు చేస్తున్నారు. ఓట్ల కోసం, సీట్ల కోసం అంబేద్కర్‌ను తనవాడంటూ బీజేపీ స్వంతం చేసుకుంటున్నది. ప్రజల్ని నమ్మించడానికి నాటకాలాడుతున్నది. మరోవైపు అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి మూల స్తంభాలైన సమానత్వం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయాన్ని పునాదులతో సహా ధ్వంసం చేసేందుకు ఆర్ఎస్ఎస్-మతోన్మాద బీజేపీ బుల్డోజర్ రాజకీయాలను నడిపిస్తున్నాయి. అంబేద్కర్ కార్మిక చట్టాల కోసం పోరాడితే, అదే స్ఫూర్తితో కార్మికవర్గం పోరాడి, అనేక త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దుచేసింది. పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల్ని బానిసలుగా మార్చేందుకు నిర్ణయం తీసుకున్నది. మౌలిక వసతులు, సహజ వనరులు జాతీయం కావాలని అంబేద్కర్ కాంక్షిస్తే, బీజేపీ ప్రభుత్వం వ్యూహాత్మక అమ్మకాల పేరుతో ప్రభుత్వరంగ సంస్థల్లో 100శాతం వాటాలను తెగనమ్ము తున్నారు. దీంతో రాజ్యాంగంలో అంబేద్కర్ ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన రిజర్వేషన్లు కనుమరుగైపోతున్నాయి. ఉద్యోగుల కష్టార్జితమైన పీఎఫ్, పెన్షన్ నిధులను ప్రయివేటు ఇన్సూరెన్స్, మ్యూచ్యువల్ ఫండ్ సంస్థలకు అప్పజెప్తు న్నారు. ఎల్ఐసిలో కోట్లరూపాయల వాటాలను ఐపిఓ ద్వారా విక్రయిస్తున్నారు.

ఆరెస్సెస్-బీజేపీ విధానాలను ప్రతిఘటించాలి...

అంబేద్కర్ విగ్రహారాధనకు వ్యతిరేకం. 'ఎక్కడా నా విగ్రహాలు పెట్టొద్దు' అనే ఆయనే హెచ్చరించారు. నేను తలపెట్టిన లక్ష్యసాధనకు, ఆశయాల అమలుకు చిత్తశుద్ధితో అంకితమవ్వాలని పిలుపునిచ్చారు. కానీ నేడు పాలక వర్గాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు సామాజిక న్యాయానికి భంగం కలిగిస్తున్నాయి. అంబేద్కర్ కోరుకున్న ప్రణాళికాబద్ధ ఆర్థిక విధాన స్థానంలో బహుళజాతి సంస్థలు, ఆదానీ, అంబానీల నమూనా ఆర్థిక వ్యవస్థ నడుస్తున్నది. అంబేద్కర్ ఆశించినట్లు భూమిలేని పేదలకు భూమి పంపిణీ చేసే కార్యక్రమాన్ని అటకెక్కించారు. కార్పొరేట్ సంస్థలకు వేల ఎకరాల భూములను కట్టబెడుతున్నారు. కార్మికుల, పేద ప్రజల జీవన ప్రమాణాలను దిగజారుస్తున్న బీజేపీ విధానాలను అర్థం చేసుకోవాలి. దానికి వ్యతిరేకంగా పేదలను, కార్మికులను సమీకరించాలి. అంబేద్కర్ ఆశయాలను సమాధి చేస్తున్న ఆర్ఎస్ఎస్, మతో న్మాద బీజేపీ విధానాలను ప్రతిఘటించేందుకుత పోరాటాలను ఉధృతం చేయాలి. అందుకు సామాజిక - వర్గ పోరాటాలను మమేకం చేయాలి. అదే అంబేద్కర్‌కి మనమిచ్చే నిజమైన నివాళి.

అంబేద్కర్ బాటలో గుజరాత్‌లో బౌద్ధం

ఏప్రిల్ 14 బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పుట్టిన రోజు. హైదరాబాద్‌లో నిర్మాణంలో ఉన్న తెలంగాణ సెక్రటేరియట్ నూతన భవన సమీపంలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం ఈరోజు ఆవిష్కరణకు సిద్ధమైంది. ఆయన పట్ల దేశ ప్రజల ప్రేమాభిమానాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఆ రకంగా భారత రాజ్యాంగ నిర్మాతకు దక్కాల్సిన గౌరవం దక్కుతోంది. 'లైట్ ఆఫ్ ఆసియా'గా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గౌతమ బుద్ధుణ్ణి; ఆయన బోధించిన ధర్మాన్ని ప్రచారం చేసిన అశోక చక్రవర్తిని ఈ ఆధునిక కాలంలో కూడా ప్రజలు స్మరించుకుం టున్నారు. అంతేకాదు, హిందూ మతాన్ని త్యజించి ఆరులక్షల మందితో అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించడం కూడా ఆధునికులకు స్ఫూర్తినందిస్తోంది. తెలంగాణ టూరిజంశాఖ నాగార్జున సాగర్‌లో బుద్ధవనాన్ని ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ స్థాయిలో దాన్ని నిలబెట్టడానికి ఇంకా కృషి చేస్తోంది. ఇక భారతదేశం బయట జరిగే విషయాలు చెప్పు కోవాలంటే... ఉత్తర అమెరికాలో అంబేద్కర్ జయంతిని... "డా॥బి.ఆర్. అంబేద్కర్ సమానత్వపు రోజు (DAY OF EQUALITY) గా గుర్తించి జరుపుతున్నారు. అంతేకాదు, నెల పొడవునా 'దళిత్ర చరిత్రమాసం'గా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



డాక్టర్ దేవరాజు మహారాజు

ఈ విషయాలు ఇలా ఉంటే, ఇదే రోజు 2023 ఏప్రిల్ 14న, గుజరాత్‌లో మరో మహాద్భుతం జరుగుతోంది. గుజరాత్ రాష్ట్ర రాజధాని గాంధీనగర్‌లో యాభైవేల మంది దళితులు బౌద్ధం స్వీకరిస్తున్నారు. ఆ రాష్ట్రంలోని పలు గ్రామాల్లోంచి, పట్టణాల్లోంచి, నగరాల్లోంచి, అటవీ ప్రాంతాల్లోంచి దళితులూ, ఆదివాసీలు అక్కడి రమాకాంతా మైదానంలో సమావేశమవుతున్నారు. హిందూ మతాన్ని త్యజించి, బాబాసాహెబ్ అంబేద్కర్ నడిచిన దారిలో నడవాలని అనుకుంటున్నారు. అక్కడి దళితులు, ఆదివాసీలు, వెనకబడిన జాతుల వారు అందరూ కలిసి పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహించుకుంటున్నారు. దంగాపూర్ ఆదివాసీలు కుటుంబాలకు కుటుంబాలు తరలివచ్చి బుద్ధ దీక్ష తీసుకుంటున్నారు. కార్యక్రమం చూడటానికి మరికొన్ని లక్షల మంది అక్కడికి చేరుతున్నారు. ఈ కార్యక్రమాన్ని స్వయం సైనిక్ దళ్ (ఎస్ఎస్‌డి) అనే స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తోంది! ఇప్పుడు ఈ ఏప్రిల్ 14న జరగబోయే కార్యక్రమం బౌద్ధ భిక్షు ప్రజ్ఞారత్న ఆధ్వర్యంలో జరుగుతుంది. వీరు పోరుబందర్‌లోని గ్రేట్ అశోకా బౌద్ధ విహార్ నుండి వచ్చి ఆ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు. అక్కడి వారందరితో బుద్ధదీక్ష ఇప్పిస్తారు. కార్యక్రమాలు ఈ విధంగా కొనసాగితే, రాబోయే రెండేండ్లలో అంటే 2025 నాటికి ఒక కోటి మంది దీక్ష తీసుకుంటారని దీని వెనక కృషి చేస్తున్న స్వయం సైనిక్ దళ్ ఆశిస్తోంది.

ప్రభుత్వం వివిధ మతాల మధ్య విద్వేషాలు రగిలించడం మాత్రమే కాదు, హిందూ మతస్థుల మధ్య కూడా కలహాలు సృష్టిస్తోంది. బలవంతంగా హిందూత్వను ప్రజల మీద రుద్దడం వల్ల ఫలితాలు వ్యతిరేకంగా వస్తున్నాయి. హిందూ మతంలోని ఎగుడు దిగుళ్ళని, నిచ్చెన మెట్ల కుల సంస్కృతిని బలపర్చడం, మహిళల హక్కులు, మానవ హక్కులు హరించడం ఈ దేశ ప్రజలు భరించలేకపోతున్నారు. మనుధర్మ శాస్త్రాన్ని మన ప్రాచీన రాజ్యాంగం అంటూ నెత్తికెత్తుకోవడం, దేశ ద్రోహులైన గాడ్సే, సావర్కర్‌ల స్థాయి అనూహ్యంగా పెంచడం - ఈ దేశ ప్రజలకు నచ్చడం లేదు. నీతిలేని, చదువులేని ప్రబుద్ధులంతా మహా నాయకులై వెలిగిపోవడం - అధర్మమే ధర్మంగా చలామణి అవుతూ ఉండటం - ఈ దేశ ప్రజలకు కష్టంగా ఉంది. అందుకే వేల సంఖ్యలో జనం బుద్ధ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. దీన్ని హిందూ దేశంగా మార్చాలని కలలు కంటున్న నేటి పాలకులకు, లక్షల మంది హిందూ మతాన్ని త్యజించడం - ఒక చెంప పెట్టుకాబోతోంది!

అధికారంలో ఉన్న వారు ఉగ్రమార్గాన్ని వెతుక్కుంటూ ఉంటే దానికి ధీటైన సమాధానం చెప్పగల సమతా మార్గాన్ని, నైతిక రుజుమార్గాన్ని సామాన్య ప్రజలు వెతుక్కుంటున్నారు. దేవుడనే రాముడి బూచీ చూపించి పాలకులు రాజకీయాలు చేస్తుంటే... అసలు దేవుడనేవాడే లేడన్న బుద్ధ మార్గాన్ని ప్రజలు ఇష్టపడుతున్నారు. శోభాయాత్రల పేరుతో పాలకులు అల్లర్లు, కల్లోలాలు ప్రోత్సహిస్తుంటే... మనసు ప్రశాంతంగా ఉంచుకుని సర్వ జనాభ్యుదయాన్ని కాంక్షించే బుద్ధమార్గాన్ని జనం కోరుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని ముఖ్య నాయకులంతా ఆ రాష్ట్రం వారే. బ్యాంకులు దోపిడీ చేసి పారిపోయిన దొంగలంతా అక్కడివారే. అలాంటి గుజరాత్ రాష్ట్రంలో సామాన్యుల ఆలోచనలు ఎలా ఉన్నాయో ఈ కార్యక్రమం తేటతెల్లం చేస్తుంది. అబద్ధాలతో అధికారంలో ఉందామనుకున్న వారికి బదులుగా - అబద్ధం ఆడరాదనీ, దొంగతనాలు చేయకూడదని చెప్పిన బుద్ధ మార్గాన్ని గుజరాత్ ప్రజలు కావాలనుకుంటున్నారు. ఇది ఎంతో ఆహ్వానించతగిన పరిణామం. మనం బతుకుదాం. మరొకరిని బతకనిద్దాం. మొత్తానికి మొత్తంగా మనిషిని బతికించుకుందాం - అనే సూత్రానికి కట్టుబడ్డ సామాన్యుల చైతన్యం చాలా గొప్పది. వెలుగు వెంట నీడలుండటం కాదు, నీడల్ని మాయం చేయగల వెలుగులు అక్కడ దేదీప్యంగా ప్రసరిస్తున్నాయి.



అధికారంలో ఉన్న వారు ఉగ్రమార్గాన్ని వెతుక్కుంటూ ఉంటే దానికి ధీటైన సమాధానం చెప్పగల సమతా మార్గాన్ని, నైతిక రుజుమార్గాన్ని సామాన్య ప్రజలు వెతుక్కుంటున్నారు. దేవుడనే రాముడి బూచీ చూపించి పాలకులు రాజకీయాలు చేస్తుంటే... అసలు దేవుడనేవాడే లేడన్న బుద్ధ మార్గాన్ని ప్రజలు ఇష్టపడుతున్నారు. శోభాయాత్రల పేరుతో పాలకులు అల్లర్లు, కల్లోలాలు ప్రోత్సహిస్తుంటే... మనసు ప్రశాంతంగా ఉంచుకుని సర్వ జనాభ్యుదయాన్ని కాంక్షించే బుద్ధమార్గాన్ని జనం కోరుకుంటున్నారు.

హిందూమతంలోని పూజలు, భజనలు, పాపాలు, పుణ్యాలు, ఆత్మలు, పునర్జన్మలు, ఆచారాలు, సంప్రదాయాలు వీటన్నిటి కంటే ముఖ్యంగా ఉన్నతులు, నిమ్నవర్గాలు - వంటివన్నీ మూఢనమ్మకాల పుట్టలు. వీటిలో వేటికీ ఆధారాలు లేవు. నిరూపణలు లేవు. కేవలం విశ్వాసాల ఆధారంగా శతాబ్దాలుగా కొనసాగుతూ మానవుల జీవితాలు దుర్భరం చేస్తున్నాయి. అందుకే, వాటన్నింటినీ వదిలి స్వేచ్ఛాలోచనకు, మానవ వాదానికి, విశ్వ మానవ సౌభ్రాతృత్వానికి విలువనివ్వాలని స్వయం సైనిక్ దళ్ ప్రచారం చేస్తుంది. మనుషుల్ని ఎగుడు దిగుడు స్థాయిలో ఉంచి, వివక్ష చూపుతున్న హిందూ ధర్మాన్ని తిరస్కరించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశం. ఆనాడు అంబేద్కర్ చేసిందే ఆదర్శంగా తీసుకుని, ఈ రోజు దేశంలో లక్షల మంది బౌద్ధం స్వీకరిస్తున్నారు. మనుషులందరిదీ ఒకే స్థాయి అని నినదిస్తున్నారు. ఎవరి జ్ఞానాన్ని వారు ఎవరి వివేకాన్ని వారు తట్టిలేపుకోవాలని, నిర్ణయం తీసుకునే ముందు బాగా ఆలోచించాలని, బుద్ధిని ఉపయోగించాలని స్వయం సైనిక్ దళ్ జనానికి బోధిస్తోంది. దీక్ష తీసుకునే విషయంలో ఎవరూ ఎవరినీ బలవంతం చేయడం లేదు. ఎవరూ ఎవరినీ ప్రభావితం చేయడం లేదు. ఎలక్షన్లలో మాదిరిగా ఎవరూ ఎవరినీ డబ్బుతో లొంగదీసుకోవడం లేదు. స్వచ్ఛందంగా ఇలాంటి పని ఆలోచనా పరులే చేస్తారు. అదీగాక, ఇది - పూజలో మంత్రాలు వల్లెవేసి మతమార్పిడి చేసేతంతు కాదు. అసలు బౌద్ధం-మతేమే కాదు! అదొక జీవన విధానం!! బుద్ధుడి బోధనలు పూర్తిగా స్వీకరించి, అందుకు అనుగుణంగా తమజీవన విధానం మార్చుకుంటారు. అంతే - ఇది న్యాయ సమ్మతంగా, చట్టబద్ధంగా, మనస్ఫూర్తిగా చేయవల్సిన పని! దీక్ష తీసుకునే వారు వారి వారి కలెక్టర్ ఆఫీసుల్లో అప్లికేషన్‌లు నింపాలి. ఆ తర్వాత అందులో ప్రకటించినవన్నీ నిజాలా కాదా - అనేది పోలీసు ఎంక్వయిరీ జరుగుతుంది. దీక్ష తీసుకున్న వారి వివరాలన్నీ గజిట్‌లో అచ్చేస్తారు. ఇదంతా అధికారికంగా జరిగే కార్యక్రమం.

ఈ స్వయం సేవక్ దళ్ ఎప్పుడు ఏర్పడింది? ఏయేం పనులు చేస్తుందో చూద్దాం... తొలుత 2006లో ఇది యాభైమందితో ఏర్పడింది. ఒకే ఆలోచనా విధానం గల మిత్రులయిన దళిత కార్యకర్తలతో మొదలైంది. ఆ సంఖ్య క్రమంగా ఊహించని రీతిలో పెరుగుతూ పోయింది. ఈ స్వయం సైనిక్ దళ్‌లో ఎవరు చేరవచ్చు? అంటే - నిచ్చెనమెట్ల సంస్కృతిని తిరస్కరించే వారంతా చేరొచ్చు. అందరికీ సమానమైన స్థాయి, హక్కులు, బాధ్యతలు కావాలనుకునే వారు చేరొచ్చు. మనుషులంతా ఒక్కటే అన్న భావన గలవారే ఈ స్వయం సైనిక్ దళ్ సభ్యులవుతారు. వీరిలో కొందరు నాయకులు, మరికొందరు కార్యకర్తలు అనే హెచ్చుతగ్గులుండవు. కలిసి మాట్లాడుకోవడానికి, చర్చించుకోవడానికి చింతన శిబిరాలు ఉంటాయి. అందులో అందరూ సమానమే. కొందరు వేదిక మీద ఉండి ఉపన్యసించడం, మరికొందరు వేదికముందుండి వినడం ఉండదు. ఏదో ఒక మైదానంలో అందరూ నేల మీద కూర్చుంటారు. ఎక్కడి వారు అక్కడే నిలబడి మాట్లాడుతారు. అందరూ సమానమనే భావన - బాధ్యత అందరిదీ అనే భావన - అక్కడ ఉన్నవారందరిలో కలుగుతుంది. స్వయం సైనిక్ దళ్ సభ్యులు ఆకుపచ్చ దుస్తులు ధరిస్తారు. ట్రాఫిక్, రవాణా, వైద్య రంగాలకు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం కలిగి ఉంటారు. సామాన్య పౌరులకు ఏ ఇబ్బంది కలగకుండా ఇదే రోజు ఒక మహార్యాలీ కూడా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి వచ్చేవారి కోసం 800ల బస్సులు, 5వేల కార్లు ఏర్పాటు చేసుకున్నారు. గాంధీనగర్ విధాన సభ ముందున్న అంబేద్కర్ విగ్రహం దగ్గర 22 ప్రతిజ్ఞలు చేస్తారు. ఈ ర్యాలీ ఉద్దేశమే మంటే... సామాన్య పౌరుల్లో చేతనత్వాన్ని కలిగించడం. బుద్ధమార్గంలోకి రావాలనుకునే వారిని ఆహ్వానించడం ఏ నిర్ణయమూ తీసుకోలేక కొట్టుమిట్టాడు తున్న వారికి ఒక ఉత్తేజాన్ని కలిగించడం. దిశానిర్దేశం చేయడం.

ప్రతి సంవత్సరం అంబేద్కర్ జయంతి రోజున ఇలాంటి దీక్షలు ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగుళూర్, భోపాల్, ముంబాయి, హైదరాబాద్, లక్నో వంటి పెద్ద పెద్ద నగరాలలో జరపాలని స్వయం సైనిక్ దళ్ పథకాలు వేసుకుంది. రాబోయే కాలంలో బుద్ధ దీక్ష కార్యక్రమాలు దేశంలో ఇంకా పెద్ద ఎత్తున జరిగే అవకాశాలు కనబడుతున్నాయి. మోసం, దగా నిత్యకృత్యాలై జీవితాలు దుర్భరమై పోతున్న ఈ రోజుల్లో... కేవలం బౌద్ధమే నైతిక మార్గం చూపగలదని, ప్రజల మానసిక ఆరోగ్యం కాపాడగలదని, మానవ జాతిని రక్షించగలదని మానవ ప్రేమికులంతా భావిస్తున్నారు. మానవవాదులంతా ఆశిస్తున్నారు. ఈ దేశ ప్రజలు మానవీయ విలువల పరిరక్షణ కోరుకుంటున్నారని - ఈ సంఘటన చెప్పకనే - బలంగా చెపుతోంది!!

వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

అభినవ బుద్ధుడా!

అభినవ బుద్ధుడా!
మానవాళి మిత్రుడా!
క్రూరకుటిల కులతత్త్వపు కోరల
పెకలించి - సకలజనులకు
సుఖశాంతుల నొసగినవాడా!


మనిషన్నవాడు చదువుకోవాలని
తానెవరన్నది తెలుసుకోవాలని
విషయం సత్ ప్రవర్తనల దిద్ది తీర్చుకోవాలని
అజ్ఞానం వదిలించుకోవాలని
ఆత్మబలం, విశ్వాసం పెంచుకొని
అద్భుత విజయాలు అందుకోవాలని
బోధించినవాడా!

చరిత్ర పొడుగున కొనసాగిన
కౌటిల్యుని అర్థశాస్త్రాలకు భిన్నంగా
కొనసాగిన బుద్ధిస్ట్ అర్థశాస్త్రజ్ఞుడా!
పెద్దపీటవేసిన అర్థశాస్త్రజ్ఞుడా
సాంఘిక విప్లవరణ దుంధుభి
మ్రోగించినవాడా!

సుపరిపాలనకు
చిన్న రాష్ట్రాలు మేలన్నావుకదా!
నవభారత రాజ్యాంగం అందించినవాడా!
కర్షక కార్మిక జనులను
మహిళలను ఉద్ధరించినవాడా!
సమతావైతాళికుడా! అభినవ బుద్ధుడా!

నీ సమున్నత వ్యక్తిత్వానికి
ఈ నీ ఉన్నత విగ్రహరూపం
చంద్రునికో నూలుపోగు
జ్ఞానభాండాగార సాగరాన్ని
మథించిన నీ విశాల హృదయానికి
ఇది గ్రంథాలయాలు చేస్తున్నవి అక్షరార్చనం
సజీవ ఆదర్శానికి నిదర్శనం
సమున్నత మేధాసంపదను
మేల్కొల్పే చైతన్య దీపం
స్వయం కృషిని ప్రబోధించే మౌన సందేశం.

- కడియం సోమన్న, 784299964



రాజ్యాంగ దీప ధారి

పుట్టిన నాటి నుంచీ
పుట్టిన గడ్డకోసమే
రక్త బిందువులన్నీ
అక్షరాలుగా మార్చిన
నిజమైన దేశభక్తుడు

దేశమంటే
ఒక్క కులమే కాదని
కులాల పుట్టుకను
స్కానింగ్ చేసి చూపించిన
సామాజిక శాస్త్రవేత్త

చీకట్లో ఎటువైపు నడవాలో
తెలియని స్వతంత్ర దేశానికి
రాజ్యాంగ దీపాన్ని వెలిగించి
చేతిలో పెట్టిన మార్గదర్శి

ఈ దేశంలో పుట్టిన
ప్రతి మనిషికి సమానంగా
హక్కులను పంచి పెట్టిన
నికార్సైన మహాత్ముడు

ఆయన లేకపోతే
ఈ దేశాన్ని ఏ రాహువు
మింగేసేదో?
కింది జాతుల జీవితాలు
ఎంతగా 'తలకిందు'లయ్యేవో??

ఏ నాటికైనా
నా దేశాన్ని దేశంగా నిలబెట్టేది
ఆయన చూపుడు వేలే!

-తోకల రాజేశం, 9676761415

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 14-4-2023 | సమగ్ర తెలుగు దినపత్రిక | www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 103 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + (టాబ్లాయిడ్ 12 పేజీలు) | వెల : 6.50



విద్యాలయాల అప్పులు

మోడీ సర్కారు తీరుపై విద్యావేత్తలు, నిపుణులు ఆగ్రహం


విద్యార్థులకు తిప్పలు

- ఫీజుల పెంపుతో స్టూడెంట్స్ నుంచి పిండుడే
- ఎస్సీ,ఎస్టీ,ఓబీసీ స్టూడెంట్స్‌కు ఇబ్బందులు

మోడీ పాలనలో దేశంలోని ప్రభుత్వ యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. సరిపడ సిబ్బంది లేక ఇప్పటికే కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఫలితంగా.. స్టూడెంట్స్ తీవ్రంగా నష్టపోతున్నారు. వారు చదువుపై దృష్టి పెట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులకు తోడు సదరు విద్యాసంస్థలు వివిధ అవసరాల కోసం తీసుకునే రుణాలు కూడా అందులో చదువుకునే విద్యార్థుల మెడకే చుట్టుకుంటున్నాయి. ఈ రుణాలను తీర్చడానికే విద్యాసంస్థలు ఫీజులను పెంచుతున్నాయి. దీంతో రుణభారం ఫీజుల రూపంలో విద్యార్థుల పైనే పడుతున్నదని విద్యావేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.



న్యూఢిల్లీ : హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్సింగ్ ఏజెన్సీ (హెచ్‌ఈఎఫ్‌ఏ) 2017లో కొత్తగా ఏర్పాటు చేశారు. కెనరా బ్యాంకు, విద్యా మంత్రిత్వ శాఖ జాయింట్ వెంచర్ ఇది. ఇందులో కెనరా బ్యాంకు వాటా 90.91 శాతం కాగా.. విద్యా మంత్రిత్వ శాఖది 9.09శాతంగా ఉన్నది. అదే ఏడాది దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐటీ బాంబే హెచ్‌ఈఎఫ్‌ఏ నుంచి రూ. 520 కోట్లను రుణంగా తీసుకున్నది. అయితే, సదరు విద్యాసంస్థ విద్యార్థుల చదువులకు, హాస్టళ్లకు అయ్యే ఫీజులను భారీగా పెంచింది. ఉదాహరణకు.. ఎంటెక్ కోర్సు ఫీజులను (హాస్టల్ మరియు ఇతర ఫీజులు) సెమిస్టర్‌కు రూ. 19 వేల నుంచి రూ. 26,450 కి పెంచింది. ఈ పెరుగుదల దాదాపు 40 శాతం. అలాగే, రాబోయే ఎంటెక్ విద్యార్థుల ఫీజులనురూ. 32,450కి పెంచింది. ఈ పెరుగుదల ఏకంగా 70 శాతంగా ఉన్నది. అదే విధంగా పీహెచ్‌డీ రెండో సంవత్సరం విద్యార్థుల సెమిస్టర్ ఫీజును రూ. 16,500 నుంచి రూ.23,950కి పెంచింది. ఈ పెరుగుదల 40 శాతం కంటే ఎక్కువే.. పీహెచ్‌డీ మొదటి సంవత్సరం విద్యార్థుల ఫీజును 60 శాతం కంటే పైకి పెంచడం గమనార్హం. అయితే, ఫీజుల పెంపుపై యాజమాన్యం తీసుకున్న నిర్ణయం విద్యార్థుల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. దీంతో అది కాస్తా, నిరసనలు ఆందోళనలకు దారి తీసింది. పెంచిన ఫీజులకు వ్యతిరేకంగా గతేడాది జులైలో విద్యార్థులు ఐఐటీ బాంబేలో నిరసనలకు దిగారు. ఫీజులు తగ్గించాలంటూ ఉత్తరాలు రాశారు. ప్లకార్డులు, ...11లో



బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలకూడదు



లౌకిక, ప్రత్యామ్నాయం కోసం చర్చలు

- ఎన్నికల తరువాత ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి :ఏచూరి
- ఏచూరి, డి.రాజాతో నితీశ్ భేటీ

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాట్లు జరగాలనీ, ఎన్నికల తరువాతే ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి ఏర్పడుతుందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే ధ్యేయమని ...11లో



నింగినంటిన స్మరణం.. భారతరత్నావిష్కరణం

దేశంలోనే పెద్ద విగ్రహం 11లో..

- ఎత్తు 125 అడుగులు,45 అడుగుల వెడల్పు
- నేడే ఆవిష్కరణ
- సర్వాంగ సుందరంగా స్మృతి వనం
- స్ఫూర్తిదాయక సన్నివేశం

డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన మనవడు ప్రకాశ్ అంబేద్కర్ హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం కేసీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.. ఈ కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీలు,మంత్రులు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లు, జడ్పీ చైర్మెన్లు, నగర మేయర్, ఉన్నతాధి కారులు పాల్గొంటారు. సభావేదికపై నుంచి సీఎం కేసీఆర్, ప్రకాశ్ అంబేద్కర్, కొప్పుల ఈశ్వర్ ప్రసంగించనున్నారు.

అంబేద్కర్ వారసత్వాన్ని కబ్జా కానివ్వం

రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికవర్గానిదే

- సామాజిక న్యాయ సాధనకు సమైక్య పోరాటాలు
- జాతీయోద్యమ నినాదాలే మౌలికాంశాలు
- 'అంబేద్కర్-రాజ్యాంగం-సామాజిక న్యాయం' సెమినార్‌లో బీవీ.రాఘవులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'రాజ్యాంగం ఉంటేనే కార్మికులకు హక్కులు ఉంటాయి. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉంది. సామాజిక న్యాయ సాధనకు సమైఖ్య పోరాటాలు నిర్వహించాలి. అంబేద్కర్ వారసులం మేమే అంటూ బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు ప్రచారం చేస్తున్నాయి. ఎట్టి పరిస్థితిల్లోనూ అంబేద్కర్ వారసత్వాన్ని కబ్జా కానివ్వం. ఆయన వారసత్వాన్ని కార్మికులు పుణికిపుచ్చుకోవాలి. రాజ్యాంగంలో మౌలిక అంశాలను ప్రతిపాదించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుంది' అనిసీఐటీయూ ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బీవీ.రాఘవులు అన్నారు. అంతకుముందు లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి సీఐటీయూ రాష్ట్ర నాయకులు పూలమాలలేసి నివాళలర్పించారు. అక్కడి నుంచి బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు 'వాక్ ఫర్ సోషల్ జస్టిస్' పేరుతో 10కే రన్ నిర్వహించారు. అనంతరం కార్మికోద్యమ నిర్మాత బీటీ రణదివే వర్ధంతి సందర్భంగా ఈనెల 6 నుంచి అంబేద్కర్ జయంతి అయిన 14 వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ వారోత్సవాలను నిర్వహించాలని ...2లో

విశ్వమానవుడు అంబేద్కర్

అసమానతలు లేని సమాజం కోసం తపించిన మహోన్నతుడు

- దురాచారాలను ఎదురొడ్డిన ధీరోదాత్తుడు : సీఎం



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జీవితంలో ఎన్ని ఆటంకాలెదురైనా ఆత్మన్యూనతకు, దుర్భలత్వానికి గురికాకుండా గొప్ప ఆలోచనలతో గెలుపు శిఖరాలను చేరుకున్న విశ్వమానవుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కొనియాడారు. అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం పరితపించిన మహోన్నతుడు అని ప్రశంసించారు. అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని సీఎం ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజంలో నెలకొన్న అజ్ఞానాంధకారాలను చీల్చుకుంటూ జ్ఞానపు ...11లో



సంక్షోభంలో సమాజం..

- ఇప్పటికే మనుస్మృతి విధానాలు యూపీలో అమలు :నవతెలంగాణ ఇంటర్వ్యూలో ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

రాజ్యాంగ హక్కులకు భంగం వాటిల్లుతోంది

'కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విధానాల ఫలితంగా సమాజం సంక్షోభంలో కూరుకుపోయింది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే అంబేద్కర్ యాదికొస్తడు.. అందుకే ఇప్పుడు ఏ నోట విన్నా అంబేద్కరే.. నేడు ఆయన ఆశయాలకు పాలకులు నుంచే ప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి, ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాలన్న నినాదాల ప్రాముఖ్యత పెరుగుతున్నది..' అని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి వివరించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి ఎస్ వెంకన్నకు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

అంబేద్కర్ ఆశించిన సమాజం ఏంటి? ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ ఆచరణ అందుకు అనుగుణంగా ఉందా?

సమాజం సంక్షోభంలో ఉన్నప్పుడు.. ముందే ప్రమాదాన్ని పసిగట్టి, పరిష్కారం చూపించిన వారిని సహజంగానే ప్రజలు గుర్తుపెట్టుకుంటారు. అదే ఇప్పుడు అంబేద్కర్ విషయంలో జరుగుతున్నది. ఆయన అసమానతలు లేని సమాజం కోసం పరితపించిండు. అణగారిన తరగతుల అభ్యున్నతిని కోరుకున్నడు. ముఖ్యంగా అంటరాని తనం, వివక్షతకు వ్యతిరేకంగా జీవితాంతం పనిచేసిన దార్శనికుడు అంబేద్కర్.. అందుకే ఎప్పుడూ లేని విధంగా జేఎన్‌యూ విద్యార్థులు మొదలు..బాధిత మహిళలు, రైతులు, కార్మికులు, విద్యార్థుల వరకు సకల రంగాలు, సంఘాలు ఆయన్ను గుర్తుచేసుకుంటున్నాయి. అయితే ఆయన ఆశించిన విధంగా, నిర్దేశించిన దశ, దిశలో ప్రభుత్వాలు పాలించటం లేదు. రాజ్యాన్ని రక్షించాల్సిన ...11లో

ము లా ఖా త్

బిజినెస్

అదానీ డిమాండ్ తిరస్కరణ

- ఫైనాన్సియల్ టైమ్స్ వ్యతిరేక కథనం



లండన్: అదానీ గ్రూపునకు వ్యతిరేకంగా ప్రచురించిన ఓ కథనాన్ని తొలగించాలని ఫైనాన్సీయల్ టైమ్స్‌పై ఒత్తిడి తీసుకురాగా.. ఆ సంస్థ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. లండన్ కేంద్రంగా పని చేస్తున్న వ్యాపార వార పత్రిక ఫైనాన్సియల్ టైమ్స్ (ఎఫ్‌టి) మార్చి 22న అదానీ అక్రమ విదేశీ నిధులపై ఓ కథనాన్ని ప్రచురించింది. దీన్ని వెబ్‌సైట్ నుంచి తొలగించా లనీ అదానీ గ్రూపు ఏప్రిల్ 10న ఆ సంస్థకు లేఖ రాసింది. "మా కథనం కచ్చితమైనది. జాగ్రత్తగా తయారు చేశాం. మేము మా రిపోర్టింగ్‌కు కట్టుబడి ఉన్నాము." అని ఎఫ్‌టి ప్రతినిధి టెలిగ్రాఫ్‌తో పేర్కొన్నారు. "గౌతం అదానీ కంపెనీల్లోకి ఇటీవలి సంవత్సరాలలో దాదాపు సగం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అతని కుటుంబానికి అనుసంధానించబడిన విదేశాల్లోని సంస్థల నుండి వచ్చాయి. ఈ నగదు ప్రవాహాన్ని పరిశీలించడం కష్టంగా ఉంది. అదానీలతో సంబంధమున్న విదేశీ కంపెనీలు 2017 నుంచి 2022 మధ్య కనీసం 2.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.21వేల కోట్లు) పెట్టుబడి పెట్టాయి. ఆ సమయంలో వచ్చిన మొత్తం 5.7 బిలియన్ డాలర్లలో దాదాపు సగం (45.4%)గా నమోదయ్యాయి. ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి ఎజెండాతో తనను తాను కలుపుకుంటూనే అదానీ ట్రేడింగ్, ప్లాస్టిక్ కార్యకలాపాలను మౌలిక సదుపాయాల దిగ్గజంగా విస్త రించుకోవడానికి అస్పష్టమైన నిధులు సహాయపడ్డాయి. అదానీ గ్రూపులోకి కనెక్ట్ చేయబడిన ఆఫ్‌షోర్ సంస్థల నుండి పూర్తి స్థాయిలో డబ్బు ప్రవహిస్తుంది. విదేశీ పెట్టుబడిలో కొంత భాగాన్ని మాత్రమే ఎఫ్‌డిఐ డేటా బహిరంగం చేస్తుంది. సెప్టెంబర్ 2022 వరకు అధికారికంగా ఎఫ్‌డిఐగా నమోదు చేయబడిన సొమ్ములో అత్యధికంగా 6 శాతం డబ్బును స్వీకరించిన వాటిలో అదానీ గ్రూప్ ఒకటి." అని ఎఫ్‌టి తన కథనంలో పేర్కొంది. ఇది అదానీ గ్రూపును ఆందోళనకు గురి చేసింది. దీంతో ఎఫ్‌టి వెబ్‌సైట్ నుంచి ఆ కథనాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తుంది.

ఇన్ఫోసిస్‌లో తగ్గిన ఉద్యోగులు

బెంగళూరు : దేశంలో రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ 2023 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఏడాదికేడాదితో పోల్చితే కంపెనీ లాభాలు 8 శాతం పెరిగి రూ.6,128 కోట్ల లాభాలు సాధించింది. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ 16 శాతం పెరిగి రూ.37,441 కోట్లకు చేరింది. క్యూ4లో టిసివికి చెందిన 2.1 బిలియన్ డాలర్ల కొత్త ప్రాజెక్టును దక్కించుకున్నట్లు ఇన్ఫోసిస్ తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.17.50 డివిడెండ్‌ను ప్రకటించింది. 2023 డిసెంబర్ 31 నాటికి కంపెనీలో మొత్తం ఉద్యోగులు 3,43,234గా ఉన్నారు. ఇంతక్రితం ఏడాది ఇదే కాలం నాటికి 3,46,845 మంది ఉద్యోగులున్నారు. దీంతో పోల్చితే నికరంగా 3,611 మంది తగ్గిపోయారు. గురువారం బిఎస్ఇలో ఇన్ఫోసిస్ షేర్ 2.79 శాతం తగ్గి రూ.1,388 వద్ద ముగిసింది.

గూగుల్‌లో మళ్లీ కోతలు..!

వాషింగ్టన్ : ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ మరోసారి ఉద్యోగులకు ఉద్వాసన పలకనుందని తెలుస్తోంది. కొత్త ఏడాది జనవరిలో ఓ దఫా 12వేల మంది లేదా మొత్తం ఉద్యోగుల్లో 6 శాతం మందిపై వేటు వేస్తున్నట్లు ప్రకటించింది. తాజాగా మరో రౌండ్‌లోనూ సిబ్బందిని పీకెయ్యాలని యోచిస్తోందని రిపోర్టులు వస్తున్నాయి. మరో దఫా ఉద్వాసనలు ఉండొచ్చని గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ స్వయంగా వాల్‌స్ట్రీట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కాగా.. ఎంత మందిని, ఏ విభాగాల్లో తొలగించేది ఆయన స్పష్టం చేయలేదు. ఎఐ చాట్‌బాట్ బార్డ్, జీమెయిల్, గూగుల్ డాక్స్‌పై కీలక ప్రాజెక్టులు కొనసాగుతున్నాయన్నారు. కంపెనీలో జరుగుతున్న ప్రతీ పనిని పరిశీలిస్తున్నామన్నారు. తద్వారా ఖర్చులను పున్ణసమీక్షించడం ద్వారా కంపెనీ సామర్థ్యాన్ని 20 శాతం పెంచాలని భావిస్తున్నామన్నారు.

పరిమ్యాచ్ స్పోర్ట్స్ ప్రచారకర్తగా శివమ్ దూబే



హైదరాబాద్: ప్రముఖ స్పోర్ట్స్ వేర్ బ్రాండ్ పరిమ్యాచ్ స్పోర్ట్స్ బ్రాండ్ అంబాసీడర్‌గా క్రికెటర్ శివమ్ దూబేను నియమించుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం శివమ్ ఐపిఎల్ 2023లో చెన్నయ్ సూపర్ కింగ్స్ తరపున ఆడుతున్నాడు. పరిమ్యాచ్ స్పోర్ట్స్‌కు ప్రచారకర్తగా వ్యవహరించడం సంతోషంగా ఉందని శివమ్ పేర్కొన్నారు.

ఐడిఎఫ్‌సి బ్యాంక్‌తో మారుతి సుజుకి భాగస్వామ్యం



హైదరాబాద్: ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్‌తో దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా కొత్త కార్లు, ప్రీ ఓన్డ్ కార్లు, వాణిజ్య వాహనాలు కొనుగోలు చేసే వారికి సులభంగా రుణాలు అందుతాయని ఇరు సంస్థలు పేర్కొన్నాయి. ఈ ఒప్పందంపై ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ ఎండి వి వైద్యనాథన్, మారుతి సుజుకి మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవా సంతకాలు చేశారు.

ఐడిబిఐ బ్యాంక్ పోటీలో ఐదు సంస్థలు

- ప్రయివేటీకరణ ప్రక్రియ వేగవంతం

న్యూఢిల్లీ : ఐడిబిఐ బ్యాంక్‌ను స్వాధీనం చేసుకోవడానికి ఐదు ప్రయివేటు రంగ సంస్థలు పోటీలో నిలిచాయి. ఐదు సంస్థల బిడ్డింగ్‌ల ప్రక్రియను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మూల్యాంకనం చేస్తుందని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఐడిబిఐ చేజిక్కించుకోవడానికి కొటాక్ మహీంద్రా బ్యాంక్, ప్రేమ్ వాట్సానకు చెందిన సిఎస్‌బి బ్యాంక్, ఎమరైట్స్ ఎన్‌బిడి తదితర సంస్థలు ఆసక్తి కనబర్చుతూ బిడ్డింగ్ వేశాయని సమాచారం. దీనికి సంబంధించిన చర్చలు రహస్యంగా జరుగుతున్నాయని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఐడిబిఐ బ్యాంక్‌లో కేంద్రానికి 45.48 శాతం వాటా ఉండగా.. ఇందులో 30.48 శాతం వాటాను అమ్మకానికి పెట్టింది. అదే విధంగా ఎల్ఐసికి 49.24 శాతం వాటా ఉండగా... 30.24 శాతం వాటాను విక్రయించనుంది. దీంతో మెజారిటీ వాటాలు ప్రయివేటు శక్తులకు చెందనున్నాయి.

హైదరాబాద్‌లో రాడిసన్ కలెక్షన్ ఏర్పాటు..!

హైదరాబాద్ : రాడిసన్ హోటల్ గ్రూపు తన లగ్జరీ లైఫ్‌స్టైల్ బ్రాండ్ రాడిసన్ కలెక్షన్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. 300 గదులతో నగరంలోని వ్యాపార కేంద్రాలు, ఐటి పార్కులు ప్రత్యేక ఆర్థిక మండలాలు ఉన్న ఫైనాన్స్ డిస్ట్రిక్ సమీపంలో ఉందని పేర్కొంది. 2026 జూన్ త్రైమాసికంలో వినియోగదారులకు అందుబాటులోకి రానుందని తెలిపింది. పలు దేశాల్లో 150కిపైగా హోటళ్ల నిర్వహణను కలిగుంది.

నిరంతర స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్ : చైతన్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల ఎత్తులో నిర్మించిన విగ్రహం నిరంత స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తుందని బహుజన టీచర్ల సంఘం (బీటీఏ) అధ్యక్షుడు కల్పదర్శి చైతన్య, ప్రధాన కార్యదర్శి మార్వాడీ గంగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి, విజ్ఞానం దిశగా నేటి బాలలు ముందుకు నడవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో అసమానతలు తొలగిపోవాలని కోరారు. అణగారిన వర్గాల ప్రాధాన్యతకు సూచికగా నిలువెత్తు విగ్రహం ఉంటుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టి భవిష్యత్ తరాలకు దిక్సూచిగా ఉంటుందని తెలిపారు.

అంతా డొల్లే !


పేదరికంపై సర్వేలలో అవాస్తవాలు...వక్రీకరణలు



- అరకొర సమాచారం....దాటవేతలు

న్యూఢిల్లీ : భారత్‌లో పేదరికం వేగవంతంగా తగ్గిపోతోందంటూ వెలువడుతున్న సర్వేలు నిజమేనని మీరు నమ్ముతున్నారా ? అయితే మరోసారి ఆలోచించండి. ఎందుకంటే ఈ సర్వేల గణాంకాలన్నీ అవాస్తవాలే. వక్రీకరణలే. సర్వేలలో అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోకపోవడం, ఒకవేళ తీసుకున్నా అరకొర సమాచారంతో నింపడం, వాస్తవాలను మరుగుపరచడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

దేశంలో పేదరికం ఏ స్థాయిలో ఉన్నదో తెలుసుకునేందుకు వినియోగ వ్యయ సర్వేలపై (సీఈఎస్‌లు) ఆధారపడుతుంటాము. ప్రజల తలసరి వ్యయం పేదరిక స్థాయి కంటే తక్కువగా ఉన్నదా లేదా అని ఈ సర్వేలు అంచనా వేస్తాయి. అయితే కేంద్రప్రభుత్వ అలసత్వం కారణంగా ఇలాంటి సర్వే నిర్వహించి దాదాపు దశాబ్దం పైనే అయింది. అంటే గడచిన దశాబ్ద కాలంలో దేశంలో పేదరికం ఎలా ఉన్నదో తెలుసుకునే అవకాశమే లేకుండా పోయిందన్న మాట. ఇదిలావుంటే ఈ కాలంలో భారత ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తున్న సీఎంఐఈ అనే సంస్థ పలు రకాల సర్వేలు చేపట్టింది. వినియోగ వ్యయ గణాంకాలను తెలుసుకునేందుకు ఇవి ఉపకరిస్తాయి. ఈ సమాచారం ఆదారంగా పేదరికం పైన కూడా అంచనాకు రావచ్చు. అయితే ఇలాంటి సర్వేలలో పేదల అభిప్రాయాలకు పెద్దగా చోటు దక్కదు. ఉదాహరణకు దేశంలో అత్యంత పేద రాష్ట్రమైన బీహార్ లోని ఇళ్లలో తాగునీరు, మరుగు దొడ్లు, టెలివిజన్ వంటి సౌకర్యాలు బాగానే ఉన్నాయని ఓ సర్వే కట్టుకథలు అల్లింది.



అంతేకాదు... ఈ సర్వేల ఫలితాలలో వివక్ష కూడా కన్పిస్తుంది. ఒక సర్వే ఏం చెప్పిందంటే 2018లో ప్రాథమిక స్థాయి విద్య కూడా చదవని వయోజనుల సంఖ్య కేవలం రెండు శాతమేనట !. మరో సర్వే ఈ సంఖ్యను 17 శాతంగా చూపింది. ఎంత తేడా ఉన్నదో గమనించండి. ప్రపంచబ్యాంక్‌కు చెందిన ఆర్థికవేత్తలు సిన్హా రాయ్, రాయ్ వందర్ వెయిడ్‌లు సర్వేలు వివక్షాపూరితంగా ఉంటున్నాయని అంగీకరించారు. దీనిని నివారించేందుకు వారు కొన్ని పద్ధతులను కూడా సూచించారు.



వీటి ప్రకారం ముందుగా సర్వేలు పరిగణనలోకి తీసుకునే సామాజిక, ఆర్థిక అంశాలను గుర్తిస్తారు. అంటే విద్య, వృత్తి, ఆస్థి వంటివి. వీటిపై ఆయా సర్వే సంస్థలు నిర్ధారణకు వచ్చిన అంశాలను క్రోడీకరిస్తారు. వాటి ఆధారంగా పేదరిక అంచనాలు రూపొందిస్తారు. ముఖ్యంగా నెలసరి తలసరి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. విద్య, వృత్తి వంటి అంశాలనూ పరిశీలిస్తారు. కొన్ని సంస్థలు తీసుకునే అంశాలు విశ్వసించదగినవే అయినప్పటికీ అంతా వాస్తవమేనని భావించడానికి లేదు. సర్వేలు నిర్వహించే సంస్థలు కొన్ని విషయాలను దాటవేయవచ్చు. ఉదాహరణకు అనారోగ్యం, పంట నష్టాలు వంటివి. వీటిని విస్మరించి పేదరికాన్ని ఎలా అంచనా వేయగలం ? నిరుపేదలైన ప్రజలను విస్మరించి నమూనాలు సేకరించడం వాస్తవ పరిస్థితిని వక్రీకరించడమే అవుతుంది.

వాస్తవ చిత్రాన్ని ఎలా వక్రీకరిస్తారో చూద్దాం. నిరుపేదలైన ముస్లింలు, ఎస్సీలు, ఎస్టీలను పరిగణనలోకి తీసుకోకుండా సర్వేలు రూపొందిస్తారు. దినసరి కార్మికులను, విద్య తక్కువగా ఉన్న వారిని ఉద్దేశపూర్వకంగానే వదిలేస్తారు. దీనివల్ల వాస్తవాలు ఎలా బయటపడతాయి ? కొన్ని సర్వేలలో మాత్రం తక్కువ సంఖ్యలో ఎస్సీలు, ఎస్టీలను గమనంలోకి తీసుకొని 'మమ' అనిపిస్తున్నారు.

దీనిని బట్టి చూస్తే చాలా సర్వేలు అవాస్తవాలతో, కట్టుకథలతో కూడి ఉంటున్నాయి. 2011-2019 మధ్యకాలంలో పేదరికం తగ్గిదంటూ కొన్ని సర్వేలు వక్రీకరణలతో కూడిన గణాంకాలు విడుదల చేశాయి. ఈ సర్వేలు అందిస్తున్న వివరాలను చూస్తుంటే వాటి విశ్వసనీయత పైన అనుమానాలు వ్యక్తం కావడం సహజమే.

అందరికి సమాన ఓటు హక్కు అంబేద్కర్ చలువే

దళిత పారిశ్రామికవేత్తలు మరింత ఎదగాలి-మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అందరికి సమాన ఓటు హక్కు అనేది బాబాసాహెబ్ అంబేద్కర్ వల్లే సాధ్యమైందని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కె.తారకరామారావు తెలిపారు. ఆ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అంబేద్కర్ ముందు చూపుతో పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించారని చెప్పారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని బోధించే మతమే తనకు ఆదర్శమని ఆయన చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. మతం, కులం మనిషి తన స్వార్థం కోసం సృష్టించుకున్నవేననీ, మనుషులంతా సమానమని వ్యాఖ్యానించారు. ఎవరి జీవితం శాశ్వతం కాదని తెలిపారు. పరిమితమైందంటూ అందులో అధికారం మరింత పరిమితమైందని అన్నారు. అధికారం అసలు శాశ్వతమేమి కాదని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో రెండు సార్లు అధికారంలోకి వచ్చామనీ, మరోసారి ఆశీర్వదిస్తే అధికారంలోకి వస్తామని తెలిపారు. అయితే ప్రజలకు మేలు చేసే క్రమంలో ప్రతి విషయం ఓట్లతో ముడిపెట్టి చేయలేమనీ, శాశ్వతంగా ప్రజలకు మేలు చేసేవి కూడా ఉంటాయని చెప్పారు. అందుకే తెలంగాణ ఆచరిస్తున్నదాన్ని....దేశం అనుసరించే స్థాయికి ఎదిగగలిగామని వివరించారు. రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలను కేంద్రం కాపీ కొట్టిందని ఉదహరించారు.



తెలంగాణ దళిత పారిశ్రామికవేత్తలు దేశానికే ఆదర్శంగా ఎదగాలని కేటీఆర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దళితులు ఆర్థికంగా ఎదుగుతుంటే ఎన్నో అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఓటమికి నిరాశ చెందవద్దని చెబుతూ.. సీఎం కేసీఆర్ తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఓడిపోయిన సంగతిని గుర్తుచేశారు. విజయం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. కొత్త ఆలోచనలను సమాజం వెంటనే అంగీకరించదనీ, హేళన చేసే వారు కూడా ఎక్కువగా ఉంటారని చెప్పారు. అయితే ఒకసారి విజయం సాధించిన తర్వాత అలాంటి వారంతా మార్పు కోరిన వారిని అనుసరిస్తారని తెలిపారు.. ఈ సందర్భంగా మంత్రి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు టీ ప్రైడ్ ద్వారా ప్రోత్సాహకాలు, అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నిజ నిర్ధారణ అవసరమా ?

- ఐటి నిబంధనల సవరణలపై ఐఎన్ఎస్

న్యూఢిల్లీ : కేంద్రప్రభుత్వం రూపొందించిన ఐటీ నిబంధనల సవరణపై ది ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిబంధన ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ప్రచురితమైన ఏ విషయమైనా అవాస్తవమైనదా లేక తప్పుడుదా లేక తప్పుదోవ పట్టించేదా అని నిర్ధారించేందుకు నిజనిర్ధారణ విభాగాన్ని ఏర్పాటు చేసే అధికారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖకు దఖలు పడుతుంది. అలాంటి సమాచారాన్ని ప్రచురించడం లేదా ప్రసారం చేయడం వంటి పనులు చేయవద్దని, ఒకవేళ చేసి ఉంటే దానిని తొలగించాలని సోషల్ మీడియా వేదికలు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు, ఇతర సర్వీస్ ప్రొవైడర్లను శాసించే అధికారం కూడా ఈ విభాగానికి ఉంటుంది. దీనిపై ఈ నెల 6న జారీ చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని కేంద్రాన్ని ఐఎన్ఎస్ కోరింది. పాత్రికేయ వృత్తి పైన, దాని విశ్వసనీయత పైన తీవ్ర ప్రభావం చూపే ఇలాంటి నోటిఫికేషన్‌ను జారీ చేసే ముందు మీడియా సంస్థలు, పత్రికా యాజమాన్యాలతో కేంద్రం విస్తృతమైన, అర్థవంతమైన చర్చలు జరపాలని సూచించింది. ప్రభుత్వ 'నిజ నిర్ధారణ' నిబంధనలపై ఐఎన్ఎస్ తీవ్ర స్థాయిలో మండిపడింది. సంబంధిత మీడియా సంస్థల వాదనలు వినకుండా తీసుకునే ఏ నిర్ణయమైనా సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని అభిప్రాయపడింది. అధికారిక గెజిట్‌లో నోటిపై చేయడం ద్వారా అలాంటి విభాగాన్ని ఏర్పాటు చేయవచ్చునని పేర్కొంది. ఇలాంటి చర్య పత్రికలపై సెన్సార్‌షిప్ విధించడమే అవుతుందని, భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగకరమని ఐఎన్ఎస్ తెలిపింది.

న్యాయవ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలా ?

- బేషరతుగా క్షమాపణ చెప్పండి : లలిత్ మోడీకి సుప్రీంకోర్టు హుకుం



న్యూఢిల్లీ : సోషల్ మీడియాలో న్యాయవ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోడీపై సుప్రీంకోర్టు గురువారం ఆగ్రహం వ్యక్తం చేసింది. బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయనను ఆదేశించింది. సోషల్ మీడియా లోనూ, ప్రముఖ వార్తాపత్రికల లోనూ క్షమాపణ ప్రకటనలు చేయాలని సూచించింది. క్షమాపణ కోరుతూ తన ముందు కూడా అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొంది.

భవిష్యత్తులో భారత న్యాయవ్యవస్థ ప్రతిష్టను దిగ జార్చేలా ఎలాంటి పోస్టులు పెట్టబోనని అందు లో పేర్కొనాలని నిర్దేశించింది. లలిత్ మోడీ చట్టానికి, సంస్థలకు అతీతుడేమీ కాదని జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి. రవికుమార్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆయన దాఖలు చేసిన అఫిడవిట్‌పై తాను సంతృప్తి చెందడం లేదని తెలిపింది.

అంబేద్కర్ అందరివాడు : దాముక కమలాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందరివాడు, కొందరివాడు కాదని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం అధ్యక్షులు దాముక కమలాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మేధావుల్లో ఆయన మేటివారని పేర్కొన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున నెక్లెస్‌రోడ్డులో 125 అడుగుల ఎత్తులో అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించి శుక్రవారం ఆవిష్కరించడం జాతి గర్వించదగ్గ అపురూప ఘట్టమని వివరించారు.

విజయవాడ రూట్‌లో 10 శాతం రాయితీ

- సూపర్ లగ్జరీ, రాజధాని సర్వీసుల్లో వర్తింపు
- ఈ నెల 30 వరకు అమల్లో 10 శాతం డిస్కౌంట్ : టీఎస్ఆర్టీసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు వీలుగా హైదరాబాద్-విజయవాడ రూట్‌లో పది శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) నిర్ణయించింది. ఆ రూట్‌లో నడిచే సూపర్ లగ్జరీ, రాజధాని ఏసీ సర్వీసుల్లో రాను పోనూ ఈ రాయితీ వర్తించనుంది. ఈ నెల 30 వరకు 10 శాతం డిస్కౌంట్ అమల్లో ఉంటుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ, విజయవాడ నుంచి హైదరాబాద్ మార్గాల్లో వెళ్లే ప్రయాణికులకు మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది.

గురువారం ఈ మేరకు టీఎస్ ఆర్టీసీ చైర్మెన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్, ఎమ్‌డీ వీసీ సజ్జనార్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'విజయవాడ మార్గంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వారికి ఆర్థిక భారం తగ్గించాలనే ఉద్దేశంతో సూపర్ లగ్జరీ, రాజధాని ఏసీ సర్వీసుల్లో పది శాతం రాయితీ కల్పించాలని సంస్థ నిర్ణయించింది. విజయవాడ మార్గం వరకు ఈ రాయితీ వర్తిస్తుంది. ఒక ప్రయాణికుడు రాజధాని ఏసీ సర్వీస్‌లో హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లాలనుకుంటే.. ఆయన టికెట్‌లో విజయవాడ వరకు 10 శాతం రాయితీ వర్తిస్తుంది. దీని వల్ల ఒక్కో ప్రయాణికుడికి రూ.40 నుంచి 50 వరకు ఆదా అవుతుంది. ఈ నెల 30 వరకు అందుబాటులో ఉండే ఈ రాయితీ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలి" అని కోరారు. రిజర్వేషన్ కోసం టీఎస్ ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ www. tsrtconline. comను సంప్రదించాలని వారు సూచించారు. ముందస్తు రిజర్వే షన్ చేసుకునే ప్రయాణి కులకు టీఎస్ ఆర్టీసీ రాయితీ కల్పిస్తోందని గుర్తు చేశారు. 31 నుంచి 44 రోజుల మధ్యలో అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటే ఐదు శాతం, 45 నుంచి 60 రోజుల మధ్యలో రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీని కల్పిస్తున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నెంబర్లు 040-69440000, 23450033ను సంప్రదించాలని సూచించారు.

అగ్ని ప్రమాదాల నివారణకు వ్యూహం రూపొందించాలి : సీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వ్యూహం రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ప్రజలను నిరంతరం సంసిద్ధం చేయాలన్నారు. గురువారం బీఆర్‌కే భవన్‌లో అగ్ని ప్రమాదాలపై సీఎస్ సమీక్షించారు. అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన పలు భద్రతా చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్‌లు, సినిమా హాళ్లు మొదలైనవాటికి ఎమర్జెన్సీ ఎగ్జిట్ పని చేస్తుందా? లేదా? అనే దానిపై జీహెచ్ఎంసీ విస్తృత తనిఖీలు నిర్వహించిందన్నారు. అగ్నిమాపక భద్రతా చర్యలపై అవగాహన కల్పించేందుకు నివాస సంక్షేమ సంఘాలను సంప్రదిస్తున్నామని చెప్పారు. నగరంలోని అన్ని పురాతన భవనాలను గుర్తించి, అగ్నిమాపక భద్రతా పరికరాలను ఏర్పాటు చేయాలని నోటీసులు జారీ చేశామని తెలిపారు. అన్ని షాపింగ్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్‌లు, ఆస్పత్రులు, ఇతర వాణిజ్య సంస్థలను సకాలంలో తనిఖీలు నిర్వహించి, వాటి ప్రాంగణాల్లో అగ్నిమాపక భద్రతా పరికరాలను ఏర్పాటు చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ, అగ్నిమాపక శాఖ అధికారులను సీఎస్ ఆదేశించారు. రెసిడెన్షియల్ జోన్లలో పనిచేస్తున్న రెడ్ కేటగిరీ సంస్థలను గుర్తించి, వాటిని తరలించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసర ముందన్నారు. మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, సీసీపీ దేవేందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీల్లో కేరళ నెంబర్ 1

గ్రామీణ 'ఉపాధి' పనుల్లో రికార్డు

- పెరుగుతున్న పని దినాలు
- ప్రజల భాగస్వామ్యంతో ముందుకు
- మరిన్ని పథకాలలోనూ తనిఖీలు
- ఆన్‌లైన్‌లో 900 ప్రభుత్వ పథకాలు : విజయన్



కొచ్చి : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం కింద చేపట్టిన పనులకు సంబంధించి పూర్తి స్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించిన మొదటి రాష్ట్రంగా కేరళ రికార్డు సాధించింది. రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థలలో గ్రామసభ సమావేశాలు నిర్వహించడం ద్వారా ఇది సాధ్యపడింది. 2022 అక్టోబర్ నుండి 2023 మార్చి వరకూ 941 స్థానిక సంస్థలలో (ఎల్ఎస్‌జీలు) 15,962 సామాజిక తనిఖీలు నిర్వహించారు. 2011వ సంవత్సరపు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి సామాజిక తనిఖీ నిబంధనల ప్రకారం నమోదైన ప్రైవేటు సంస్థ సోషల్ ఆడిట్ యూనిట్ (ఎస్ఏయూ) ఈ తనిఖీలు జరిపింది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో విధిగా రెండుసార్లు సామాజిక తనిఖీలు చేపట్టాల్సి ఉంటుంది. దీని ప్రకారం 2022 ఏప్రిల్, 2022 సెప్టెంబర్ మధ్యకాలంలో 683 స్థానిక సంస్థలలో 11,382 తనిఖీలు నిర్వహించారు. కేరళలో 941 స్థానిక సంస్థలు, 15,962 వార్డులు ఉన్నాయి.

ఉపాధి హామీ చట్టం కింద రాష్ట్రంలో రూ. 4,000 కోట్ల విలువైన పనులు చేశారు. వీటిలో కేవలం రూ. 1.03 కోట్ల (మొత్తం విలువలో 0.02 శాతం) పనులకు సంబంధించి మాత్రం అవకతవకలు జరిగాయని తనిఖీలో గుర్తించారు. వీటికి బాధ్యులైన వారిని గుర్తించి, వారి నుండి సొమ్మును రాబట్టేందుకు చర్యలు ప్రారంభించారు.

సామాజిక తనిఖీలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈ నెల 10న బహిరంగసభ నిర్వహించారు. ఇందులో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రసంగిస్తూ రాష్ట్రంలోని అన్ని పంచాయతీలకు సంబంధించి తనిఖీ నివేదికలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. 'చాలా మందికి సామాజిక తనిఖీ అనే పదం కొత్తగా అనిపిస్తుంది. కానీ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం పాతికేళ్ల క్రితమే ప్రజా ప్రణాళికల కింద ఇలాంటి పథకాలను ప్రారంభించింది' అని తెలిపారు. ఈ సంవత్సరం మే నాటికి ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఇందులో భాగంగా 900 ప్రభుత్వ పథకాలు ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటాయని ముఖ్యమంత్రి విజయన్ చెప్పారు. జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు కేరళపై ప్రశంసల జల్లు కురుస్తోంది. దీని కింద ప్రతి కుటుంబానికీ 53.8 పని దినాలు (జాతీయ సగటు 8 శాతం) లభిస్తున్నాయి. అర్హులైన 31 శాతం కుటుంబాలకు 100 (జాతీయ సగటు 50 శాతం) పని దినాలు దొరుకుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా సగటు పని దినాల సంఖ్య తగ్గిపోగా కేరళలో మాత్రం పెరిగింది. 2021-22లో 10.23 లక్షల నుండి 2022-23లో 10.58కి పెరిగింది. ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా కృషి చేస్తున్నామని విజయన్ తెలిపారు.

ప్రారంభంలో ఎస్ఏయూ తన పనిని నిదానంగా ప్రారంభించినప్పటికీ ఆ తర్వాత తనకు అప్పగించిన పనిలో వేగాన్ని పెంచింది. ఇందులో ప్రజల భాగస్వామ్యం చాలా కీలకం. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అసలైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు చేకూరాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. అనేక సవాళ్లు ఎదురవుతున్నా, కేంద్రం సరిగా నిధులు కేటాయించకపోయినా పథకాన్ని విజయవంతంగా ముందుకు తీసికెళుతున్నారు. 2018 వరకూ కేవలం కొన్ని పంచాయతీలలో మాత్రమే సామాజిక తనిఖీలు జరిగాయని, స్థానిక సంస్థల వ్యవహారాల మంత్రి జోక్యం చేసుకోవడంతో ఇప్పుడు రాష్ట్ర మంతటా ఆడిట్ పూర్తయిందని ఎస్ఏయూ డైరెక్టర్ రమాకాంతన్ చెప్పారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, పీఎంఏవై, ఆరోగ్య కేరళ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాజెక్టులకు కూడా ఇదే తరహాలో సామాజిక తనిఖీలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.

యువతి అదృశ్యం



నవతెలంగాణ-సంతోష్ నగర్

యువతి అదృశ్యమైన సంఘటన గురువారం సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా, ఆర్టీసీ కాలనీ, టికేఆర్ కమాన్ సమీపంలో గుడ్ లైఫ్ స్కూల్ వద్ద నివసిస్తున్న 20 ఏండ్ల యువతి ఈనెల 12న ఇంటి నుండి భోజిరెడ్డి కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికించడంతో పాటు తెలిసిన వారికి ఫోన్ లో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

అంతర్జాతీయ మానవ హక్కుల జాతీయ ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ ఆరిఫ్ ఖాన్



నవతెలంగాణ - సంతోష్‌నగర్

అంతర్జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయ సంస్థ జాతీయ ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ ఆరిఫ్ ఖాన్ ఎన్నిక య్యారు. అంతర్జాతీయ ఫౌండర్ అధ్యక్షులు నిరాజ్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. జైపూర్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో సంఘం నూతన కమిటీని ఎన్నుకొన్నారు. నూతన ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్దే లక్ష్యంగా పని చేస్తాన న్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడంతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. తనను ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు అధ్యక్షులకు, యూత్ వింగ్ నేషనల్ అధ్యక్షులు బ్రజేశ్ పతక్, నేషనల్ జనరల్ సెక్రెటరీ సుశీల్ కుమవత్, డైరెక్టర్ రూపేష్ జారీ, హెడ్ హెచ్ ఆర్ జాగృతి దుబే అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర సంఘం ప్రతినిధుల వాసులకు మహమ్మద్ ఆరిఫ్ ఖాన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రాచకొండ సీపీ డీ.ఎస్. చౌహాన్
- సైబర్ నేరాలపై క్రైమ్ విభాగ అధికారులు, సిబ్బందితో సీపీ సమీక్షా



నవతెలంగాణ-సిటీబ్యూరో

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సీపీ డిఎస్ చౌహన్ సూచించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో గురువారం సైబర్ నేరాలపై క్రైమ్ విభాగ అధికారులు, సిబ్బందితో సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక కాలంలో, అందుబాటులోకి వస్తున్న కొత్త సాంకేతిక పరిజ్ఞానం, పరికరాల వల్ల సైబర్ నేరాల శాతం పెరుగుతోందని తెలిపారు. వివిధ రకాల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరికరాలు ఉపయోగించక తప్పదన్నారు. అదే సమయంలో ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెరిగేలా యువత భాగస్వామ్యంతో కళాశాలలతోపాటు ఇతర ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. నకిలీ లాటరీలు, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, బ్యాంకు లింక్‌లు, గిఫ్టులు తదితర పేర్లతో సైబర్ నేరస్తులు ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని వారిని కఠినంగా శిక్షిస్తామని కమిషనర్ హెచ్చరించారు. సోషల్ మీడియాలో యువతులను వేధించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచి పెట్టకూడదని అధికారులకు సూచించారు. చైన్ స్నాచింగ్ వంటి నేరాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు. నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టేలా అధికారులు సిబ్బంది కలసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సైబర్ క్రైమ్స్ అనురాధ, డీసీపీ క్రైమ్ మధుకర్ స్వామి, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశం, ఇన్‌స్పెక్టర్లతోపాటు తదితర అధికారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం



- సమీక్షా సమావేశంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి డబ్ల్యూ హెచ్ వో (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) సభ్యులతో టీబీ వ్యాధి మరియు నివారణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పరిధిలో టీబీని అంతంచేయడానికి క్షయ రహిత సమాజ నిర్మాణానికి తమవంతు బాధ్యతగా భావించి ప్రజలు సహకరించాలని ఇందుకు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, యువజన సంఘాలు సహకారం ఎంతో అవసరం ఉందన్నారు. డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధులు మాట్లాడుతూ..... క్షయ అంటువ్యాధి, క్షయ వ్యాధిగ్రస్తుడు దగ్గినప్పుడు తుమ్మినప్పుడు తుంపర్ల ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. రెండు వారాల పైబడి దగ్గు, సాయంత్రం పూట జ్వరము, ఆకలి మందగించడం, బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉన్నవారిని ప్రభుత్వ ఆస్పత్రికి పంపినట్లయితే తెమడ పరీక్షలో క్షయ నిర్ధారణ అయినట్లయితే ప్రభుత్వ ఆసుపత్రి నుండి డాట్స్ ద్వారా ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. డాక్టర్ రవీందర్ కుమార్,డాక్టర్ మాలిక్ ఫర్మాన్ ,డాక్టర్ సందీప్ చౌహన్,డాక్టర్ రాజేశం, డాక్టర్ మహేష్, డాక్టర్ శ్రీఘన,ప్రొఫెసర్ శ్రీనివాస్,మేనేజర్ జ్యోతి, శానిటరీ ఇన్స్పెక్టర్ జానకి, యూపీహెచ్ సీ డాక్టర్ ప్రతిభ, డాక్టర్ విక్టర్ ఇమ్మాన్యుయేల్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మురళి, నాయకులు బండారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో సమస్య తలెత్తకుండా చూడాలి

- కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్ రెడ్డి



నవతెలంగాణ- సంతోషనగర్

సైదాబాద్ డివిజన్ పరిధిలోని ప్రజలకు సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులేదని కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్ రెడ్డి అన్నారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఏపీఏయూ కాలనీ సామాజిక భవనంలో కల్యాణ్ నగర్, తిరుమల హిల్స్ కాలనీవాసులు, వివిధ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డివిజన్ పరిధిలోని రోడ్లు సక్రమంగా లేకపోవ టంతో కాలనీవాసులకు అసౌకర్యం కలుగుతుందని, వాటి పనులకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా విద్యుత్ వీధి దీపాలు రాత్రివేళల్లో వెలుగడం లేదని, పగటి పూట మాత్రం వీధిలైట్లు వెలుగుతున్నాయని, ఇందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ డీఈ బన్సీలాల్, ఏఈ వెంకన్న, విద్యుత్ ఏఈ వేణుగోపాల్, జలమండలి డీజీఎం షీలారాణి, మేనేజర్ శ్రావణ్ కుమార్, మలక్ పేట ఎస్సై నవీన్, రాజ్ కుమార్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడిగాల విజయ్ భాస్కర్‌రెడ్డి, వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు స్థానిక నాయకులు పార్టీ శ్రేణులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఏవి?



- బి.యన్.రెడ్డి డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి

నవతెలంగాణ- వనస్థలిపురం

హెచ్ఎండిఏ నిధులు కోటి నాలుగు లక్షల రూపాయలతో బి.యన్.రెడ్డి డివిజన్ ఫేస్ 3 లో చేపట్టిన పార్కు ప్రహరీ గోడల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించట్లేదనిబి.యన్.రెడ్డి డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి అన్నారు. గురువారం ఆయన ఆయా పనులను పరిశీలించారు. బి.యన్.రెడ్డిడివిజన్ ఫేస్ 3 లో నెలకొన్న పార్కు చుట్టూ కాంపౌండ్ వాల్, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ అభివృద్ధి పనుల లో నాణ్యత ప్రమాణాలు పాటించట్లేదని, ఈ పనులను ఆయన సంబంధిత అధికారులు డి జగన్ మోహన్ రావు, ఏ ఈ జీవన్ రెడ్డి లతో పరిశీలించారు. కాంపౌండ్ వాల్ కు సిమెంటు, ఇసుక, డస్ట్ సమ బాగాల్లో ఉపయోగించవలసిన కాంట్రాక్టర్ కేవలం డస్ట్ తోనే నిర్మాణాలు కొనసాగించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. నాణ్యత లోపంతో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ గోడకు ముందు ముందు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. వెంటనే ఈ కాంట్రాక్ట్ రద్దుచేసి నాణ్యత ప్రమాణాలు పాటించే కాంట్రాక్టర్కు పనులు అప్పగించాలని, లేకుంటే జిహెచ్ఎంసి అధికారులే నేరుగా నిర్మాణాలు చేపట్టాలని కార్పోరేటర్ లచ్చిరెడ్డి కోరారు. అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్న కాంట్రాక్టర్ భాష పై చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా అధికారులను డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఏ కార్యక్రమం

- అరవింద్ శర్మ



నవతెలంగాణ- సరూర్ నగర్

కాలనీలో నెలకొన్న సమస్యల సత్వర పరిష్కారం కోసం పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రాం విత్ కాలనీ అసోసియేషన్ (ఆర్డబ్ల్యూఏ) కార్యక్రమాన్ని మంత్రి కేటీఆర్ ఏర్పాటు చేశారని బీఆర్ఎస్ మహేశ్వరం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ అన్నారు. విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రా రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఆర్కేపురం డివిజన్లోని సౌభాగ్యపురం కాలనీ పార్కులో జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ, కాలనీ అసోసియేషన్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద శర్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఎలాంటి సమస్య అయినా వెంటనే పరిష్కారం అవుతుందన్నారు. డివిజన్లో దాదాపు 20 రోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. ముఖ్యంగా గార్బేజ్ క్లీనింగ్, కుక్కల బెడద, ఫాగింగ్, పార్కులో మెయింటెనెన్స్, కమ్యూనిటీ హాల్ లో ఎలక్ట్రిసిటీ వర్క్ లాంటి సమస్యలు ఉన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిజెపి సీనియర్ నాయకుడు ధీరజ్ రెడ్డి, రాములు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం



- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ -నాగోల్

అనారోగ్యాలకు గురై ఉన్నత వైద్యం అందుకోలేని పేదవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లాంటిదని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని అరుణోదయ కాలనీకి చెందిన లక్ష్మీనారాయణ వెన్నెముక సమస్యతో బాధపడుతున్నడంతో వారి యొక్క ఆర్థిక స్తోమత ఉన్నత వైద్యం పొందలేక పోవడంతో ఆయన కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్ రెడ్డి సహాయం కోసం సంప్రదించారు. దీంతో వెంటనే వెన్నెముకకు సంబంధించిన ఆపరేషన్ డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి ఎమ్మెల్యే దరఖాస్తు చేశారు. లక్ష్మీనారాయణ ఆపరేషన్ కు గాను 1,50,000 ఎల్ ఓ సీ చెక్కు మంజూరైంది. మంజూరైన లక్షా 50వేల రూపాయల ఎల్ఓసి చెక్కును గురువారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బాధితుడి కుమారుడు గోపికృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి ,నాగోల్ డివిజన్ బారాస అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

బలగం సినిమాతో పెరుగుతున్న బలగాలు

నవతెలంగాణ -ఘట్కేసర్



బలగం సినిమాతో గ్రామాలలో పట్టణాలలో బలగాలు పెరిగిపోతున్నాయి. వేణు దర్శకత్వం బలగం సినిమా ప్రతి ఒక్కరు చూసి కంటతడి పెట్టాల్సిం దే మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి వార్డు సభ్యుడు సుర్వి కృష్ణ గౌడ్ మాజీ వార్డు సభ్యుడు పిట్టల రాజు, వార్డు సభ్యుడు గంగి శంకర్ కో-ఆప్షన్ సభ్యుడు మేడపైన రాజు బద్దం కార్తీక్ రెడ్డి అర్ల కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని గాంధీ బొమ్మ విగ్రహం వద్ద బలగం సినిమాను గ్రామ ప్రజలకు చూపించారు గ్రామ ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని చిత్రాన్ని తిలకించారు

ఇద్దరు విద్యా వాలంటీర్లకు వేతనం అందజేత



నవతెలంగాణ -ఘట్కేసర్

జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ అనిత అభ్యర్థన మేరకు 6,7, 8వ తరగతిలో విద్యార్థినిలకు హిందీ తెలుగు టీచర్స్ కొరత ఉన్నందున ఇద్దరు విద్యావాలంటరీలను నియమించి వారికి ప్రతి నెల వేతనం ఇచ్చి వారిని నియమించాలని లిజన చైతన్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఘట్కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్‌ను కోరడం జరిగింది దానికి సానుకాలంగా స్పందించి వెంటనే ఇద్దరు విద్య వాలంటరీలను నియమించారు. వారికి ప్రతి నెల వేతనం ఒక్కరికి 7000 రూపాయల చొప్పున జన చైతన్య సేవా సమితి సభ్యులు ద్వారా అందజేస్తామని తెలిపారు. మార్చి నెల వేతనాన్ని 17 వ వార్డ్ కౌన్సిలర్ బేతాల నర్సింగ్ రావు , ఆనంద్ విద్యావాలం టరీలకు అందజేశారు. ప్రతీ నెల మా సేవా సమితి ద్వారా విద్య వాలంటరీలకు వేతనాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఉమా , విద్య వాలంటరీలు జావేద బేగం , సౌందర్య జ్యోతి , తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో కార్పొరేటర్ మార్నింగ్ వాక్

నవతెలంగాణ -సంతోష్‌నగర్



ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని కాల నీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్ రెడ్డి తెలిపారు. డివిజన్‌లోని ఆదర్శ నగర్ కాలనీలో మార్నింగ్ వాక్ లో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యల గురించి కార్పొరేటర్ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ. ఐఎస్ సదన్‌లో ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లోని అంతర్గత రహదారులను సైతం ఆధునీకరిస్తామని తెలిపారు. వేసవి కాలం ప్రారంభ మైనందున డివిజన్లోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నామన్నారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపా ధ్యక్షుడు జంగం మధుకర్రెడ్డి, అజయ్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు దశరథ్ రెడ్డి, రమేష్, శ్రీధర్ రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ 10వ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-హయత్ నగర్



యూటీఎఫ్(ఉపాధ్యాయ యూనియన్)10వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం హయత్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో రంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షుడు రాములయ్య జండా ఎగుర వేశారు. జిల్లా అధ్యక్షుడు రాములయ్య మాట్లాడుతూ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, పాఠశాల పరిశుభ్రంగా ఉంచాలంటే స్వీపర్లు, స్కావెంజర్ నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటప్ప, జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు కల్పన,కోశాధికారి జగన్నాథ్, బండి గణేష్,ఆర్యన్,శ్రీనివాస్, లక్ష్మీశ్రీనివాస్, జంగయ్య, బీరప్ప పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి



నవతెలంగాణ - సంతోష్‌నగర్

శంకేశ్వరబజార్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక సైదాబాద్ మండలం కన్వీనర్ షేక్ మహమూద్ కోరారు. ఆయన సంఘం ప్రతినిధులతో కలిసి సైదాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి రాధాకృషకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైదాబాద్ మండల పరిధిలోని జీపీఎస్, జీహెచ్ఎస్ శంకేశ్వరబజార్ పాఠశాలలు రెండూ ఒకే ప్రాంగణంలో నడుస్తున్నాయన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా కొంతకాలం క్రితం ప్రారంభించబడిన అదనపు తరగతి గదుల నిర్మా ణాలు ప్రస్తుతం నిలిచిపోయాయని తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పూర్తి చేయాలన్నారు. తమ వినతికి ఉప విద్యాశాఖాధికారి సానుకూలంగా స్పందించారన్నారు. సంఘం ప్రతినిధులు అలివేలు, రజియా, సల్మా పాల్గొన్నారు.

అంత్యక్రియలకు సర్పంచ్ ఆర్థిక సహాయం

నవతెలంగాణ -ఘట్కేసర్



కొర్రెముల గ్రామానికి చెందిన బొడ్డు. పాపయ్య అనారోగ్యంతో చనిపోతే కొర్రెముల సర్పంచ్ ఓరుగంటి. వెంకటేష్ గౌడ్ అంత్యక్రియలు నిమిత్తం 10,000 ఆర్థిక సహాయం చేశారు కొర్రెముల గ్రామ సర్పంచ్ ఓరుగంటి వెంకటే ష్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డి ఫౌండేషన్ ద్వారా బొడ్డు పాపయ్య కుటుంబ సభ్యులకు 5000 , మరియు మెట్టు. గంగమ్మ కుటుంబ సభ్యులకు 5000 చెప్పున మొత్తం 10,000 రూపాయలు కుటుంబసభ్యులకు అందించారు. ఫౌండేషన్ సభ్యులు వేణు, ఉప సర్పంచ్ కందుల. రాజు ,వార్డు సభ్యులు ఆంజనేయులు గ్రామ నాయకులు మాటూరి. రవి , బొడ్డు. నాగార్జున పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోరుతూ సీఐటీయూ పాదయాత్ర



నవతెలంగాణ-తుర్కయాంజల్

సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం కోరుతూ గురువారం బొంగులూరు నుండి తుర్కయంజాల్ లోని ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం వరకు సీఐటీయూ శ్రేణులు పాదయాత్ర నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ మాటాడుతూ కార్మిక ఉద్యమ నేత సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ బీటీ రణదీవే వర్ధంతి 6వ తేదీ నుండి భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా సామాజిక వారోత్సవం నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. ఈ సందర్భంగా కామ్రేడ్ రణధివే వర్ధంతి మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతులను కార్మిక వర్గం నిర్వహించడంతోపాటు కుల వివక్ష, అణిచివేత దోపిడీలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త క్యాంపియన్ చేయాలని భారత రాజ్యాంగాన్ని, సామాజిక న్యాయాన్ని కాపాడుకోవాలని, మతోన్మాదాన్ని మట్టు పెట్టాలని, కుల వివక్షను అంతం చేయాలని, మతోన్మాద విచ్ఛిన్నకర శక్తులను ప్రతిఘటించి కార్మిక వర్గం ఐక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం తీవ్ర సవాలును ఎదుర్కొంటున్నదని, వేల సంవత్సరాల నాటి బూజు పట్టిన మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలని ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. మతం పేరుతో దేశభక్తి ముసుగులో ప్రజలు, కార్మికుల్లో చిచ్చు పెడుతున్నదని దళితులు, గిరిజనులు, మహిళలపై విచ్చలవిడిగా దాడులు చేస్తూ జాతీయ వనరులను, దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను, కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని అన్నారు. సమాజంలోని అన్ని రకాల దోపిడీ పీడనల నుండి సంపూర్ణ విముక్తి కొరకు సిఐటియు నిలబడుతుందని అందుకు అనుగుణంగానే భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, సామాజిక న్యాయం అన్ని వర్గాలకు జరగాలని ఈరోజు పాదయాత్ర నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్, డి జగదీష్, జే రుద్రకుమార్, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ జి కవిత జిల్లా సహాయ కార్యదర్శులు బి సాయిబాబు, ఏ దేవేందర్, స్వప్న, మహిళా సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సుమలత, శారద, రోజారాని, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ బుగ్గ రాములు, సిహెచ్ ఎల్లేష్, కురుమయ్య ఎల్లయ్య, వీరయ్య, శేఖర్, సిఐటియు నాయకులు టీ నరసింహ, ఎం సత్యనారాయణ, డి ప్రేమాజీ, శివ ప్రసాద్, జంగయ్య, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంతో పార్టీ మరింత బలోపేతం

- గోడ పత్రిక ఆవిష్కరణలో బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

గత ఎనిమిది సంవత్సరాల పాలనలో తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలతో దేశానికే దిక్సూచిగా నిలిచిన కేసీఆర్ పాలనను ప్రజలకు వివరిస్తూ పార్టీ శ్రేణులు పార్టీని అన్ని విధాలుగా బలోపేతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ నగర అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి రెడ్డి అన్నారు.గురువారం బోడుప్పల్ బొమ్మకు గంగయ్య గార్డెన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివారం జరిగే బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్న కేసీఆర్ నాయకత్వంపై పూర్తి స్థాయిలో విశ్వాసంతో ఉన్న తెలంగాణ ప్రజలు వారి మాటలు నమ్మడం లేదని అన్నారు. ఆదివారం జరిగే ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఇంచార్జ్,శాసన మండలి సభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు శంభిపూర్ రాజు,శాసనమండలి సభ్యురాలు సురభి వాణిదేవి, బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి లోకసభ ఇంచార్జ్ మర్రి రాజశేఖరరెడ్డిలతో పాటు జిల్లా, నియోజకవర్గ, కార్పొరేషన్ స్థాయి నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, సహకార బ్యాంకు డైరెక్టర్ జడిగే రమేష్ యాదవ్, కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్,సింగిరెడ్డి పద్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కొత్త రవి గౌడ్, పులకండ్ల జంగారెడ్డి, దానగళ్ల యాదగిరి, మోదుగు శేఖర్ రెడ్డి, కాటపల్లి రాంచంద్రారెడ్డి,చంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ఉత్తమ డ్రైవర్, కండక్టర్లకు నగదు ప్రోత్సాహకాలు



నవతెలంగాణ -నాగోల్

నాగోల్ డివిజన్లోని బండ్లగూడ ఆర్టీసీ డిపోలో మార్చి నెలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన డ్రైవర్లు మరియు కండక్టర్లకు గురువారం డిపో మేనేజర్ ఎన్. రమేష్ నగదు ప్రోత్సాకాలను అందజేశారు. డ్రైవర్ల విభాగంలో కే ఎం పి ఎల్ లో జి వెంక టేశం ,పి ఎస్ రెడ్డి కండక్టర్ల విభాగంలో ఎం యాదలక్ష్మి, కే భారతి, టి మహేందర్ అదేవిధంగా మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల విభాగంలో జి నరేందర్ ,జి లక్ష్మారెడ్డి , ఇ ఏ రెడ్డిలకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. టి -24 టికెట్లను అత్యధికంగా అమ్మిన విభాగంలో జి అరుణ, జి విజయ దేవి ,తిరుపతమ్మలు నగదు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రమేష్ మాట్లాడుతూ మిగతా ఉద్యోగులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని సంస్థ పురోగమనానికి తోడ్పడాలని సూచించారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని తమ తమ ఆరోగ్యాల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో అధికారులు శాలిని ,రాజేశ్వరి, వెంకటేశ్వర్లు ,గోపాల్ ,మరియు డ్రైవర్లు, కండక్టర్లు, సెక్యూరిటీ సిబ్బంది ,మరియు ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో త్రీ ఫేస్ కరెంట్ ఏర్పాటు చేయిస్తా

నవతెలంగాణ - వనస్థలిపురం



బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని పాపిరెడ్డి కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు గురువారం బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు త్రీ ఫేస్ కరెంటు, విద్యుత్ స్తంభాలు, కృష్ణా మంచి నీటి పైప్ లైన్ తదితర సమస్యలను అరవింద్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సహకారంతో వచ్చే నెల రోజుల్లో త్రీఫేస్ కరెంటు, విద్యుత్ స్తంభాలు, కృష్ణా మంచి నీటి పైప్ లైన్ ఏర్పాటు చేయిస్తానని కాలనీ వాసులకు అరవింద్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రవికుమార్, సాంబయ్య, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-సంతోష్ నగర్

ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, డివిజన్ కార్పొరేటర్లు కలిసి 175 కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్, చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. సైదాబాద్ మండలం, అంబర్ పేట మండలం ఒల్డ్ మలక్ పేట నియోజకవర్గం పరిధిలోని ప్రెస్ కాలనీ, సపోటా బాగ్, కరణ్ భాగ్, ఎంఐఎం కాలనీ, సైదాబాద్ కాలనీ, ఫరక్ కాలనీ, గ్రీన్ ల్యాండ్ కాలనీ, ఫరాహ కాలనీ, దయానంద్ నగర్, ముసరాంబాగ్ అక్బర్ బాగ్ సైదాబాద్ మండల్ పరిధిలోని కాలనీకి చెందిన కుటుంబాలకు చెక్కులను అందజేశారు.

అమ్మ ఒడి అనాథాశ్రమంలో షార్ట్ సర్క్యూట్

- చిన్నారులకు తప్పిన పెను ప్రమాదం
- ఆహార ధాన్యాలు బుగ్గిపాలు
- సూమారు రూ. ఐదు లక్షల ఆస్తి నష్టం
- తక్షణ సహాయం కింద పది వేల రూపాయలు అందించిన కార్పొరేటర్



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్, మూడో డివిజన్ పరిధిలోని సాయి ఐశ్వర్య కాలనీ రోడ్ నంబర్ - 6 లో గత పదేండ్లుగా ఏ.మోహన్ అనాథ చిన్నారుల అక్కున చేర్చుకొని అమ్మ ఒడి చిల్డ్రన్స్ హోం లో వారికి ఆశ్రయం కల్పించి ఉచితంగా విద్యా, భోజనం, వసతి అందిస్తున్నారు. అయితే హోంలో బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ అయింది. గత ఆర్నేళ్లుగా వివిధ దాతల వద్ద సమకూర్చిన బియ్యం, పప్పులు, ఆయిల్‌తో పాటు స్కూల్ కు సంబంధించిన యూనిఫాం, పుస్తకాలు తదితర సామాగ్రి మొత్తం బుగ్గి పాలైంది. ప్రమాదం జరిగిన వెంటనే నిర్వాహకులు తక్షణమే అక్కడున్న పిల్లలను బయటకు తరలించారు. అగ్ని ప్రమాదం మూలంగా సూమారు ఐదు లక్షల నష్టం వాటిల్లిందని నిర్వహకులు ఎ.మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడు దయవలన పిల్లలను రక్షించుకోగలిగామని, నెలల తరబడి దాతలు అందించిన ఆహారం , వస్తువులు అన్ని ఆహుతి అయ్యావన్నారు. దయతలచి దాతలు పిల్లల కోసం తమను ఆదుకోవాలని వేడుకున్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ బైటేంటి శారదా ఈశ్వర్ రెడ్డి వెంటనే సంఘటన స్థలాన్ని సందర్శించి తక్షణ సహాయంగా పదివేల రూపాయలను అందజేశారు. డివిజన్ అధ్యక్షుడు వనంపల్లి గోపాల్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు ఎఎల్ ఎస్ రెడ్డి,కార్యదర్శి కోనేటి వెంకట్ కాలనీ అమ్మ ఒడి చిల్డ్రన్ హోంను పరిశీలించారు

'ప్రభుత్వ విధానాలను ఎండగడతాం'

నవతెలంగాణ-మల్కాజిగిరి



ప్రజా సమస్యలపై ప్రభుత్వ విధానాలను ఎండగడుతాం అని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. గురువారం 139 వ డివిజన్ లోని దుర్గా నగర్ చింతల్ బస్తి లో హత్ సే హత్ జూడో యాత్ర లో కరపత్రంను గడప గడపకు ఇస్తూ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి అని ప్రజలను కోరారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకుందాం... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలపరుద్దాం అన్నారు. కంటెస్టెడ్ కార్పొరేటర్ ఉమేష్ సింగ్, బీబ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, ఆంటోనీ, సూర్య ప్రకాష్, బుచ్చిబాబు, వేణు, మాజిద్, శ్యామ్ రావు, ముక్తర్, నూనె లక్ష్మణ్, గుత్తి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



ప్రభుత్వ ఉన్నత పాఠశాల జవహర్ నగర్ ఖైరతాబాద్‌ను గురువారం స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ రాజీవ్ ఆకస్మిక తనిఖీ చేశారు. 1-9వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న వార్షిక పరీక్షలు పర్యవేక్షించారు. కొద్దిసేపు పిల్లలతో ముచ్చటించి పరీక్షల్లో వస్తున్న మార్పులను వివరించారు. ముఖ్యంగా పదో తరగతికి వెళ్లనున్న 9వ తరగతి విద్యార్థులకు పరీక్ష విధానంలోను, టైం మేనేజ్‌మెంట్ లోను పలు సూచనలు సలహాలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరమేశ్వరమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు సింహాచలం ఉన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రజలను అప్రమత్తం చేయాలి



- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- అగ్నిమాపక దళ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-బేగంపేట్

అగ్నిప్రమాదాల నివారణకు ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ నెల 14 నుంచి 20 వ తేదీ వరకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ అగ్నిమాపక దళ వారోత్సవాల నేపథ్యంలో గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తో కలిసి పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో సరైన అవగాహన లేకపోవడం, ప్రమాదాల నివార ణకు తగు చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తున్నదని విచారం వ్యక్తం చేశారు. వారోత్సవాలలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలతో పాటు ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించే విధంగా పోస్టర్ లు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని అగ్నిమాపక శాఖ అధికారులు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు మధుసూదన్ రావు, అదనపు జిల్లా అధికారి ధనుంజయ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సికింద్రాబాద్ ఫైర్ అధికారి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో పైప్‌లైన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కాప్రా



మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో మంచినీటి సరఫరా మెరుగుకు నూతన పైప్ లైన్ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచినీటి సరఫరా శాశ్వత పరిష్కారానికి చేపట్టిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పైప్ లైన్‌లను ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని అధికారులకు సూచించారు. రాబోయే రోజుల్లో కూడా ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ శంకర్, ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఎంహెచ్ఓ స్వప్న రెడ్డి, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, వాటర్ మేనేజర్ వేణుగోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, కాలనీ అధ్యక్షులు రామ్మోహన్ రావు, ఉపాధ్యక్షులు కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి కోటిరెడ్డి, కోశాధికారి జి. రాంరెడ్డి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ్ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లక్ష్మీనగర్, కైలాసగిరి కాలనీలలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి పర్యటించి కాలనీవాసుల సమస్యల అడిగి తెలుసుకున్నారు. అనంతరం రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి సమస్యలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అలాగే డ్రయినేజీ, విద్యుత్‌కు సంబంధించిన, ఇతర స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులకు సమన్వయం చేసి, వెంటనే సమస్య పై చర్యలు తీసుకుని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ శంకర్, ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఎంహెచ్ఓ స్వప్న రెడ్డి, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, వాటర్ మేనేజర్ వేణుగోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సంక్షేమ సంఘ నాయకులు, స్థానిక నాయకులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక

- కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ- నేరేడ్‌మెట్



ఇఫ్తార్ విందు మత సామర స్యానికి ప్రతీక అని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 134 డివిజన్ అల్వాల్ బతుకమ్మ బాండ్ దగ్గర మజీద్ లో మైనార్టీ సోదరులు నమాజ్ అనంతరం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..మత సామర స్యతను కాపాడుతూ అందరూ అన్నదమ్ముల వలె కలిసి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆమె రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు చేపట్టిన కఠినమైన ఉపవాస దీక్షలు, పేదవాడి ఆకలి బాధను తెలుసుకునేలా చేస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మతాలకతీతంగా మెసలు కోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షురాలు కవిత, జ్యోతి యాదవ్, భబిత, గాయత్రి, శశికళ, అరవింద్, ఇసాక్ ఖా న్, అక్రమ పాష, స్థానిక ముస్లిం సోదరులు పాల్గొన్నారు

దేశానికి తలమానికంగా రాష్ట్రం అభివృద్ధి



- దాసోజు శ్రవణ్ కుమార్, మర్రి రాజశేఖర్‌రెడ్డి
- నళిని వెంకట్రావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు మాజీ మాజీ సభ్యురాలు నళిని వెంకట్రావు ఆధ్వర్యంలో గురువారం మారేడ్పల్లి పద్మశాలి కళ్యాణ మండపంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రావణ్, పార్టీ మల్కాజిగిరి పార్లమెంటరీ, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మెన్ గజ్జల నగేష్, ఎర్రోళ్ల శీను, శ్రీ గణేష్, మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె నివేదిత తో పాటు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు ఈ సందర్భంగా దాసోజు శ్రవణ్ కుమార్, మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులు బీఆర్ఎస్ శ్రేణులకు శ్రేణులకు వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశానికి తలమానికంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి చేశారని చెప్పారు. రాష్ట్ర సంక్షేమ పథకాలన్నింటిని దేశంలోని అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు, ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోడీ సీఎం కేసీఆర్ కుటుంబంపై విషం కక్కడమే ప్రధాన ఎజెండాగా ఎంచుకున్నారని మండిపడ్డారు. గులాబీ జెండానే ప్రజలకు అండ అని, సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని పలు కార్పొరేషన్ల చైర్మెన్లు గజ్జెల నాగేష్, మన్నె క్రిషాంక్, ఎర్రోళ్ల శ్రీనివాస్ లు అన్నారు. అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్, లోక్నాథం, భాగ్య ప్రభాకర్, నేతలు శ్రీ గణేష్, టీఎన్ శ్రీనివాస్, ముప్పిడి మధుకర్, కృష్ణయాదవ్, ప్రవీణ్ యాదవ్, సురేష్, శ్రీకాంత్, పెద్దాల నర్సింహ్మ సంతోషయాదవ్, సృజన్, శేఖర్ ముదిరాజ్, మురళీ యాదవ్, భాస్కర ముదిరాజ్, శ్యామ్‌రెడ్డి పాల్గొన్నారు..

జనగాము జిల్లా బచ్చన్నపేట మండలం నారాయణపురం కురుమ సంఘం వారు చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ని కలిసి వారు బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. కురుమ సంఘం ప్రతినిధులు ఒగ్గు ధర్మయ్య, ఒగ్గు సిద్ధులు, ఒగ్గు బిక్షపతి, పరదే సత్తయ్య, పరిధిరాజు, పరదే సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా



లక్ష్మీ నృసింహ్మా స్వామి ఆలయంలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

చీర్యాల లక్ష్మీ నృసింహ్మా స్వామి ఆలయం లో ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఆలయంలో శుక్రవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ చైర్మెన్ మల్లారపు లక్ష్మీ నారాయణ తెలిపారు. ఈ నెల 17 వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు.



14 న స్వామి వారి గ్రామోత్సవం తో వేడుకలు ప్రారంభం ,15 న గణపతి పూజ ,అఖండ జ్యోతి స్థాపన శ్రీ సుదర్శన నరసింహ యాగం, 16 న స్వామి వారి తిరు కల్యాణం ,సామూహిక శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రం పారాయణ , 17 న శాతా ఘటాభిషేకం ,పంచ హారతులు ,మహా పూర్ణాహుతి తదితర పూజ కార్యక్రమాలు వైభవంగా జరుగనున్నాయి.

భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి. : ఆలయ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ గౌడ్



చేర్యాల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మో త్సవాలు వైభవంగా నిర్వహించేందుకు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పా ట్లు పూర్తి చేసినట్టు ఆలయ చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ గౌడ్ తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు దర్శనానికి విచ్చే అవకాశం ఉండటంతో క్యూలైన్లు, మంచినీరు సౌకర్యం, చలువ పందిళ్లు, ప్రసాదాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు



అంబేద్కర్ ప్రపంచ మానవళి కి స్ఫూర్తి మూర్తి

నవతెలంగాణ-కల్చరల్

అంబేద్కర్ సాహిత్యం, సిద్ధాంతాలు కేవలం ఒక దేశం, వర్గం ప్రజలకు పరిమితం కాదని ప్రపంచ మానవాళి అంతటికీ స్ఫూర్తి మూర్తి అని రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ విశ్రాంత ముఖ్య కమిషనర్ బుద్ధ మురళి అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణ లో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా అంబెద్కర్ జయంతి నిర్వహించారు.ముఖ్య అతిథిగా బుద్ధ మురళి పాల్గొని మాట్లాడుతూ అంబెద్కర్ రాజ్యాంగంలో చిన్న రాష్ట్రాలు అవసరమైన గుర్తించిన నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని దానికి గుర్తుగా రాష్ట్ర సచివాలయంకు ఆయన పేరు ముఖ్యమంత్రి పెట్టారన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ 125 అడుగుల అంబెద్కర్ విగ్రహం ప్రపంచ పర్యాటకులకు ఆకర్షణ గా నిలుస్తుందని అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షతవహించిన సభలో వికలాంగుల జాతీయ నాయకుడు కొల్లి నాగేశ్వరరావు, మూలవా సీ ఉద్యమ కవి మాస్టర్జీ పాల్గొన్నారు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



కాలనీలు, బస్తీలలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుం టానని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ ,మారుతీనగర్ లలో ఆమె పర్యటించారు. ఆయా కాలనీలలో చేపడుతున్న త్రీ ఫేస్ విద్యుత్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..కాలనీలలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారిస్తానని చెప్పారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భాస్కర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు

డివిజన్‌ను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతా

- కార్పొరేటర్ ఏకే మురుగేష్



నవతెలంగాణ-జవహర్‌నగర్

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, డివిజను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ ఏకే మురుగేష్ అన్నారు. గురువారం కార్పొరేషన్ లోని 5వ డివిజన్ న్యూ అంబేద్కర్ నగర్ కాలనీలో భూగర్భ డ్రయినేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ లోని కాలనీలలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనులతో అందమైన పట్టణంగా మారుతుందన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో ప్రగతి పనులతో డివిజన్ రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. నాయకులు సింగన్న బాల్ రాజ్, ఆనంద్, లక్ష్మి, కృష్ణయాదవ్, బి.బాలరాజు, ఆంజనేయులు, రాజు, చంద్రమౌళి, నగేష్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-బేగంపేట్



ఐఎన్‌టీఎస్ఓ లెవెల్ 2 ఫలితాలలో ఈస్ట్ మారేడ్‌పల్లిలోని శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రమ్య మాట్లాడుతూ మొదటి ఐదు బహుమతులతో పాటు ఆరు స్పెషల్ బహుమతులు, 30 కన్సోలేషన్ బహుమతులు, 90 గోల్డ్ మెడల్స్ మొత్తం 211 మంది మెరిట్ సర్టిఫి కెట్లు పాఠశాలకు చెందిన విద్యార్థులు అందుకున్నరని తెలిపారు. మొదటి రెండు బహుమతులు సీ బ్యాచ్‌కు కు చెందిన విద్యార్థులు. సాదించారని చెప్పారు. ఈసందర్భంగా ఎజీఎం క్రిష్ణ, ఆర్ఐ హరికృష్ణ, జోనల్ ఎగ్జి క్యూటీవ్ డీన్ పల్లారావు, జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ రవి, జోనల్ డీన్ ప్రవీణ్ కుమార్, డీన్ బిక్షపతి సీ బ్యాచ్ ఇన్‌చార్జి స్వప్న, ఒలింపియాడ్ ఇన్‌చార్జి సురేష్ , ప్రైమెరీ ఇన్‌చార్జి ఉమాదేవి తదితరులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు పాల్గొన్నారు.



ఏఎస్ రావు నగర్ డివిజన్‌లోనిపల్లె ప్యారడైజ్ ఎక్స్టెన్షన్ కాలనీలో కాలనీ సమస్యలు డ్రయినేజీ ,సీసీ రోడ్లు, పార్కుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత నిర్వహణ ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేశారు. అదేవిధంగా కాలనీ పరిసరాలలో మొక్కలను నాటారు. ఏఈ కీర్తి,మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, బేతాళ బాల్రాజ్, కుమారస్వామి, ఏనుగు సీతారాం రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, వెంకటరాజు, ఎండి బాజీ భాష,మంజుల, సత్యనారాయణ, వెంకటేష్, చంద్రమౌళి, రమేష్, శివకుమార్, నరసింహ, కాలనీవాసులు మల్లేష్, శ్రీరాములు, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా

అధికారులు సమన్వయంతో పనిచేయాలని కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధి లోని మధుసూదన్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ మేకల సునిత రాముయాదవ్ వివిధ శాఖల అధికారులు, కాలని అసోసియేషన్ సభ్యుల తో కలిసి పబ్లిక్ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ను ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ 100 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం భాగంగా కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాముయాదవ్, ఏఈ దివ్యజ్యోతి,వాటర్ వర్క్స్ మేనేజర్ నవీన్ కుమార్,సానిటేషన్ సూపర్వైజర్ మనోహర్ రెడ్డి, మలేరియా విభాగం అబ్దుల్ రహీమ్,వర్క్ ఇన్స్పెక్టర్ నరేందర్,ఎలక్ట్రిసిటీ సాయిలు, మధుకర్, పోలీస్ డిపార్ట్ మెంట్ నుంచి బాలు పాల్గొన్నారు. నవతెలంగాణ-మల్కాజిగిరి

పల్లె పల్లెకి ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



కేసీఆర్ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు ఛీదరించుకుంటున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లాల రవి యాదవ్ అన్నారు. మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో మౌలాలి డివిజన్ లోని సంతోషిమా నగర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో పల్లె పల్లెకి ఓబీసీ ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పల్లె పల్లెకు ఓబీసీ – ఇంటి ఇంటికి బీజేపీ కార్యక్రమానికి మల్కాజిగిరి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే తమ జీవితాలు బాగుపడ తాయని, అందుకే కేసీఆర్‌కి ఓట్లు వేశామని కానీ డిగ్రీలు, పీజీలు చేసిన తమ పిల్లలు ఆటోడ్రైవర్లుగా, భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారని వారు చెబుతున్నారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే ఇంటికొక ఉద్యోగం ఇస్తా అని కేసీఆర్ అన్నారని.. కానీ వారి పిల్లలకు వాళ్ల చదువుకున్న స్థాయిలో ఉద్యోగాలు రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు వివరాలు తెలిపే కరపత్రాన్ని ఇంటింటికి పంచినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ విటోభ, డివిజన్ అధ్యక్షులు సాయి బాబా, వి.కే మహేష్, వెంటేష్ నేత, ఈగ లావణ్య కృష్ణ, కిరణ్, గున్నాల లక్ష్మణ్ గౌడ్, కన్నయ్య యాదవ్, సర్వేశ్ యాదవ్, ఆకారం సాయి రామ్, తుపాకుల జనార్దన్, రుద్ర ఆనంద్, గోపాలకృష్ణ, మంగేష్, కష్ణ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మల్కాజిగిరి



ఈస్ట్ అనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని ఏపీఐసీసీ కాలనీలో బస్తీ దవఖానాను ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంత రావు, కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చెల్ మల్కాజ్ గిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్,ఆనంద్, డిసి రాజు, డాక్టర్లు మయూరి,శుష్మా,హెల్త్ సూపర్వైజర్ ప్రకాష్, ఏఎన్ఎం సరోజ,శోభా,ఆశా,శేషికళ,నాయకులు డిసి రాజు, డీఈ లౌక్యఏఈ శ్రీకాంత్,డివిజన్ అధ్యక్షుడు, సత్యమూర్తి, జీఎన్‌వీ సతీష్ కుమార్,పిట్ల గుండా నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

బాక్స్‌డ్రైన్ పనులు ప్రారంభం

139 ఈస్ట్ ఆనంద్ భాగ్ దివిజన్ పరిధిలోని పీవీఎన్ కాలనీలో రూ.38 లక్షలతో బాక్స్ డ్రైన్ పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసి రాజు, డీఈ లౌక్యఏఈ శ్రీకాంత్,డివిజన్ అధ్యక్షుడు,సత్యమూర్తి,అధికార ప్రతినిధి, జీఎన్‌వీ సతీష్ కుమార్,సర్కిల్ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్,రాముయాదవ్,మీడియా కన్వీనర్ గుండా నిరంజన్, బాబు తదితరులు పాల్గొన్నారు

ఐహెచ్‌ఎం శ్రీ శక్తి నేతృత్వంలో క్విజ్ పోటీలు



- విజేతలకు రూ.1లక్ష అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

'ఐహెచ్‌ఎం శ్రీ శక్తి' నేతృత్వంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి రూ.లక్షను అందజేశారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, ఎన్‌సీహెచ్‌ఎంసీటీకి అనుబంధంగా 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ శ్రీ శక్తి' హాస్పిటాలిటీ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తింపు పొందింది. 'ఐహెచ్‌ఎం' శ్రీ శక్తి హోటల్ మేనేజ్‌మెంట్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 30ఏండ్లుగా ఏకైక ప్రయివేటు ఇన్‌స్టిట్యూట్‌గా పేరు ప్రతిష్టలు సంపాదించింది. 'ఐహెచ్‌ఎం' శ్రీ శక్తి సుశిక్షితులైన ఎంతో మంది నిపుణులను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించిందని ప్రిన్స్‌పాల్ అనితా చంద్రన్ తెలిపారు. 'ఐహెచ్‌ఎం' శ్రీ శక్తి సంస్థ అనేక సార్లు రాష్ట్రం ప్రభుత్వం చేత అత్యుత్తమ సంస్థగా అవార్డు పొందిందని గుర్తు చేశారు. హోటల్ మేనేజ్‌మెంట్‌ను మంచి కెరీర్ ఆప్షన్‌గా తీసుకునేలా ఎక్కువ మంది యువతను ప్రోత్సహించడానికి ఈ నెల 12న జనరల్ నాలెడ్జ్ క్విజ్ 'ఇన్‌క్విజిటివ్' అనే మెగా క్విజ్‌ని నిర్వహించామని చైర్మెన్ డీ.వీ. మనోహర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్య పింజల తెలిపారు. 'ఇన్‌క్విజిటివ్' భారతదేశంలో మొదటిసారిగా 12వ తరగతికి హాజరైన విద్యార్థుల కోసం క్విజ్ నిర్వహించామన్నారు. ముఖ్య అతిథిగా సౌత్, లెమన్ ట్రీ హోటల్స్ రీజనల్ మేనేజర్ అరుణ్ కుమార్ గుప్తాతోపాటు గౌరవ అతిథులుగా ది మారియట్స్, మల్టీ ప్రాపర్టీ డైరెక్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ కిరణ్ ప్రీత్ కౌర్, రెడ్ ఫాక్స్ హోటల్ జనరల్ మేనేజర్ జిల్లిక్ పాల్గొన్నారని తెలిపారు. క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన రీమా డెస్లేకు లక్షరూపాయలతోపాటు రన్నరప్‌గా నిలిచిన అక్షిత్‌కు రూ.50వేలను అందజేసినట్టు తెలిపారు. ఇందుకుగాను అమెరికన్ స్కిల్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్విజ్ మాస్టర్ ప్రణీత వొంటేల స్పాన్సర్ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఐహెచ్‌ఎం శ్రీ శక్తి సంస్థ ఉద్యోగులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకలు అందజేత

నవతెలంగాణ-నాచారం



ముస్లిం మైనారిటీ ప్రజలకు రంజాన్ ఎంతో పవిత్రమైనదని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం దుర్గా నగర్ లోని ముస్లిం కుటుంబాలను కలిసి తెలంగాణ ప్రభుత్వం రంజాన్ కానుక అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం మైనారిటీ సోదరులకు పవిత్ర దినాలుగా భావించి భక్తిశ్రద్ధలతో అల్లాని కొలుచుకుంటారన్నారు. తమ తమ స్తోమతను బట్టి పేదలకు దానధర్మాలు, నూతన వస్త్రాలను అందించి అంతా సమానమని భావనను కలిగిస్తారని చెప్పారు.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నూతన వస్త్రాలను అందించి పవిత్ర రంజాన్ వేడుకలను కుటుంబ సభ్యులు మైనార్టీ సోదరులు ఐక్యతగా నిర్వహించుకునే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ జరుపుకునే విధంగా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ప్రతీ ముస్లిం కుటుంబానికి రంజాన్ కానుకను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు పల్లా కిరణ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుదేవ్ గౌడ్, నాయకులు పొన్నాల మహేందర్, జబ్బర్, నయీమ్, జయరాజ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు వీరాభిమానిగా కార్పొరేటర్ బాలాజీ నాయక్

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ కార్పొరేటర్ బాలాజీ నాయక్ తన గుండెల మీద ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు చిత్రపటాన్ని గురువారం పచ్చబొట్టుతో వేయించుకుని తన వీరాభిమానాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభిమానం అనేది కొంటె రాదని, రాజన్నలాంటి నాయకుడి నీడలో నడిచే వరం లభించదన్నారు. రాజన్న అనే ఆ పేరు ఆ పదం మా గుండెల్లో గల గల పారె సెలయేరులా, పేరుకే శరీరం మాదని, పీల్చే ఊపిరి రాజన్నదంటూ భావేద్వేగం వ్యక్తం చేశారు. రాజన్న అంటే మా ప్రాణమని, మాకు దేవుడు ఇచ్చిన వరమని, జై రాజన్న జై జై రాజన్న అంటూ తెలియజేశాడు.



అంబేద్కర్ ఆశయాలకు పునాదులేస్తున్న కేసీఆర్

ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

అంబేద్కర్ ఆశయాలకు కేసీఆర్ పునాదులేస్తున్నారని ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్ గురువారం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడడమే కాదు, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని స్థాపించడం రాబోయే తరాలకు అంబేద్కర్ స్ఫూర్తినందించడమేనని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రేఖరరావు పునాదులు వేస్తున్నారన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రజలతో పాటు, యావత్ భారతదేశం హర్షిస్తోందన్నారు.



43వ రోజుకు ఎమ్మెల్యే 'ప్రగతి యాత్ర'

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

"ప్రగతి యాత్ర"లో భాగంగా 43వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలో శ్రీనివాస్ నగర్, సాయి నగర్ కాలనీల్లో పాదయాత్ర చేస్తూ పర్యటించారు. ఈ సందర్భంగా 90 శాతం పూర్తి చేసిన అభివద్ధి పనులు పరిశీలించారు. ఇప్పటి వరకు కోట్ల రూపాయల నిధులతో పూర్తయిన పనులపై హర్షం వ్యక్తం చేస్తూ ఇంకా మిగిలిన ఉన్న కాలనీల్లోని మెయిన్ రోడ్డు, వరద సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. అక్కడే ఉన్న అధికారులతో పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.



దళితుల సంక్షేమానికి కృషి : యుగంధర్‌రెడ్డి



నవతెలంగాణ-బాలానగర్

దళితుల సంక్షేమానికి కృషి చేస్తానని కూకట్‌పల్లి ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి అన్నారు. దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాజు కాలనీ కమాన్ వద్ద బాబా సాహెబ్ భీంరావు అంబేద్కర్132వ జయంతిని పురస్కరించుకుని నూతన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ దళిత సంక్షేమ నిధికి తన వంతు సహాయంగా రూ.50 వేలను సంఘం అధ్యక్షుడు ఆధిముళ్ల రాము, చీఫ్ అడ్వైజర్ విల్సన్ సమక్షంలో అందజేశారు. అనంతరం మాట్లాడుతూ తాను దళితుల అభ్యున్నతికి పాటు పడతానని, వారి సమస్యలపై కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు కల్మూరి శ్రీనివాస్ రావు, జెర్రిపోతుల రవీందర్, ఎడ్ల ప్రభాకర్, ఎస్.కె. శ్రీనివాస్, సుంకే సరోజ, దీప్తి, రామన్, శంకర్, మధు మోహన్, ఆకుల నరేందర్, ప్రసన్న, ఎడ్ల సతీష్, గజానంద్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈసీలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థి సంఘం స్థాపన



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు "యంతరోయిడ్స్" పేరిట విద్యార్థి సంఘాన్ని కళాశాల చైర్మన్ జక్కుల నరసింహారెడ్డి చేతుల మీదుగా స్థాపించారు. ఈ సంఘానికి అధ్యక్షులుగా షేక్ జాకీర్, ఉపాధ్యక్షులుగా మౌనిక, కార్యదర్శిగా సాయి కిరణ్, కోశాధికారిగా స్వర్ణ ఎన్నికయ్యారు. కార్యకర్తలుగా రాహుల్ కుమార్, సురేష్, అభిలాష్, అభినవ శంకర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు ఐక్యంగా ఉండటం వల్ల నాయకత్వ లక్షణాలతో పాటు సమస్యలపై పోరాడే తత్వం పెంపొందుతుందన్నారు. ప్రిన్సిపాల్ డా. ఆర్ లోకనాథం మాట్లాడుతూ విద్యార్థులందరూ కళాశాల దశ నుంచి తమకు ఎదురయ్యే సమస్యల మీద ఐక్యంగా పోరాడటానికి, నాయకత్వ లక్షణం పెంచుకోవడంతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు, తమ హక్కుల సాధనకు ఉపయోగపడుతుందన్నారు. ప్రొ. ఎం. అశోక్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి అసోసియేషన్లు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరగడంతో పాటు వారి వికాసానికి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి జె. త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డా. ఏ. మోహన్ బాబు, పలు విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారేపల్లి బాధితులకు వెంటనే రూ.50లక్షల నష్టపరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-మేడ్చల్



ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడులో జరిగిన ప్రమాదం చాలా విచారకరమైందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ గువ్వ రవి ముదిరాజ్ అన్నారు. ఈ విషయంపై గురువారం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బాధితులకు రూ.2 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకోవడం బాధాకరమన్నారు. చనిపోయిన కుటుంబ సభ్యులకు రూ.50లక్షలు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాయపడి శాశ్వత అంగవైకల్యం కలిగిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సినిమా స్టార్ లకు వేలకు వేల కోట్లు ప్రకటించే కేసీఆర్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో నష్టపోయిన బాధితులకు ఎందుకు సరైన న్యాయం చేయడానికి ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఈ ఘటన పట్ల సీఎం కేసీఆర్ ఇంతవరకు విచారణ వ్యక్తం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధి తులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

'ఇంటింటికీ సీపీఐ' పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-దుండిగల్

సీపీఐ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఏప్రిల్ 14వ నుంచి మే 14వ వరకు 'బీజేపీ కో హటావో దేశ్ కు బచావో' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా 'ఇంటింటికీ సీపీఐ' నినాదంతో సీపీఐ మండల నాయకత్వం ఆధ్వర్యంలో గురువారం గోడ పత్రిక విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ హాజరై నెల రోజులు నిర్వహించే కార్యక్రమాల వివరాలు వివరించాడు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, కార్మిక, రైతు, సైనిక విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా సీపీఐ



చేస్తున్న పోరాటాలను ఎదుర్కోలేక బీజేపీ విష ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకుని, అధికారులపై ఒత్తిడి పెట్టి, నిజాంపేట్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాలు, కుంటలు, చెరువులు కబ్జా చేస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి కబ్జాలే చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అశీ, యాదయ్య, దుర్గన్న, అంజయ్య రామస్వామి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మైనారిటీల సంక్షేమానికి బిఆర్ఎస్ ప్రభుత్వం కషి చేస్తుందని రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ బి. విజయ శేఖర్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదరులకు అందజేస్తున్న రంజాన్ దుస్తులను (కిట్ల)ను గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ మజీద్, గురుమూర్తి నగర్ మజీద్‌ల ఆవరణలో మత పెద్దలతో కలిసి ముస్లిం సోదరులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని మైనారిటీ అభ్యున్నతికి ఎల్లవేళలా కషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటానని



తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జల్ల రాఘవులు, డివిజన్ నాయకులు, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, సీనియర్ నాయకులు, మాజీ వార్డు మెంబర్లు, కార్యకర్తలు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఐదేండ్లలో రూ.2.5లక్షల కోట్ల లక్ష్యంతో నువామా

నవతెలంగాణ-హైదరాబాద్

హెచ్ఎన్ 1, సంపన్నవర్గాల ఆర్థిక అవసరాలను తీర్చే నువామ వెల్త్ మేనేజ్మెంట్ వ్యక్తిగత సంపద విభాగం నువామ వెల్త్ తన ఏయూఏని 5ఎక్స్ మేర, అంటే రూ.2.5 లక్షల కోట్లకు చేర్చే లక్ష్యంతో ఒక ప్రతిష్టాత్మక ప్రణాళికను ప్రకటించింది. ఈసందర్భంగా నువామా వెల్త్ హెడ్, అధ్యక్షుడు రాహుల్ జైన్ ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ, ప్రపంచ బ్యాంకు, సీఎంఐఈ నివేదిక ప్రకారం భారతదేశం ఈ దశాబ్దం చివరికి 10 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారేందుకు సిద్ధంగా ఉందన్నారు. టైర్ 1నగరాల వెలుపల మనం చూస్తున్న వ్యవస్థాపక గ్రోత్ ఇంజిన్ దీనికి ప్రధానంగా దోహదపడుతుందన్నారు. ఈ ప్రయాణంలో నువామా వెల్త్ వ్యాపారాలు, ప్రమోటర్లు, వినియోగదారులకు సంపద సృష్టి, ఉత్పాదక అవకాశాలను నిజంగా ఊహించడానికి సరైన తెలివితేటలు, దృక్పథాన్ని అందించగలదన్నారు. భారతదేశం లోని టైర్ 2, టైర్ 3 పట్టణాలు తమ క్లయింట్లతో భాగస్వామిగా ఉండేందుకు, వారితో కలిసి ఎదగాలని కోరుకుంటున్నామన్నారు. వారు తమ వ్యాపార విస్తరణ ప్రయాణాల్లో పురోగమిస్తున్నప్పుడు భారీ ఉపాధిని, గణనీయమైన సంపదను సృష్టించడం ప్రారంభిస్తారని వివరించారు.

ఓయూ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో క్యాపిటల్ విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాల్లో కుత్బుల్లాపూర్ నియోజక వర్గం షాపూర్ నగర్‌కు చెందిన క్యాపిటల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సష్టించారు. బీఎస్సీ న్యూట్రీషియన్, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ స్టాటిస్టిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బి.బి.ఏ.తో పాటు బీకాం గ్రూపులలో అన్ని సబ్జెక్టులలో (10/10) గ్రేడ్ పాయింట్ సాధించా రు. బీకాంలో ఆయేషా బేగం ఎస్.జి.పి.ఏ. (9.8/10) సాధించి విజయ బావుటా ఎగరవేశారు. 9.68, 9.32, 9.16 వంటి గ్రేడ్‌లు సాధించడంతో కళాశాల కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గురువారం కళాశాల క్యాంపస్ హాల్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రతిభ కనబరచిన వారందరికీ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి కళాశాల కరస్పాండెంట్ హమిదుల్లా మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. గడిచిన పది సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో కూడా కళాశాల గుర్తింపు పొందుతోందని గుర్తు చేశారు. 2023 -24 సంవత్సరానికి గాను కళాశాలలో అడ్మిషన్ల కొరకు 8008502103 ఫోన్ నెంబర్ నందు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బందం తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా ఉంటా



నవతెలంగాణ - జగద్గిరిగుట్ట

నిరాధారణకు గురైన అభాగ్యులకు అండగా ఉంటూ తన వంతు సహాయ సహకారాలు అందజేస్తారని ఐల గాంధీనగర్ అధ్యక్షులు పవర్ టెక్ ట్రాన్స్‌ఫార్మర్ అధినేత ప్రముఖ సంఘ సేవకులు,పైడిపల్లి స్వామి గౌడ్ తెలిపారు. రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీ నగర్ నివాసిఆటో డ్రైవర్ సత్యనారాయణ సంవత్సరం క్రితం పక్షవాతం రావడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు జల్దా లక్ష్మి నాథ్ స్వామి గౌడ్ దష్టికి తీసుకువెళ్ళారు. గురువారం స్వామిగౌడ్ సత్యనారాయణ పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించేందుకు రూ పది వేలను అందించారు. ఈ సందర్భంగా నిరాదరణకు వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఫుడ్స్ బ్రాండ్ 'యు' లో హార్దిక్ పాండ్యా పెట్టుబడులు

నవతెలంగాణ-హైదరాబాద్

చెఫ్ క్రాఫ్టెడ్ ఇన్స్టంట్ ఫుడ్స్ బ్రాండ్ యు హార్దిక్ పాండ్యాను తన పెట్టుబడిదారునిగా, బ్రాండ్ అంబాసిడర్గా ప్రకటిం చింది. హార్దిక్, యు భారతదేశంతో పాటు విదేశాలలో బ్రాండ్ను ప్రమోట్ చేసేందుకు దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నారు. ఐపీఎల్ 2023 సీజన్లో యు తన తొలి బ్రాండ్ ప్రచారాన్ని ప్రారంభించనుంది. ఈ క్యాంపెయిను భారత దిగ్గజ క్రికెట ర్ హార్దిక్ పాండ్యా నాయకత్వం వహిస్తారు. ఈసందర్భంగా హార్దిక్ పాండ్యా మాట్లాడుతూ... ఎటువంటి రసాయనాలు లేదా ప్రిజర్వేటివ్ల లేకుండా ప్యాక్ చేసిన ఆహారాన్ని తయారు చేయడం, అది కూడా తాజా రుచిని కలిగి ఉండటం విశేషమన్నారు. యు అనేది అధిక ప్రయోజనంతో నడిచే బ్రాండ్ కాగా, ఇది విభిన్న ఉత్పత్తుల వర్గాల ద్వారా ప్యాకేజ్డ్ ఫుడ్ స్పేస్లో విప్లవాన్ని తీసుకువస్తోందన్నారు. యు తో అనుబంధాన్ని కలిగి ఉండటం, దాని ఆరోగ్యకరమైన, పోషకమైన, సరళమైన ఆహారం గురించి అవగాహన కల్పించేందుకు అవకాశం దక్కడం పట్ల తాను చాలా సంతోషిస్తున్నానన్నారు. ఈ 100శాతం స్వదేశీ బ్రాండ్- మేక్ ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్లో భాగమైనందుకు గర్వంగా ఉందన్నారు. వ్యవస్థాపకులు భరత్ భల్లా, వరుణ్ కపూర్ మాట్లాడుతూ... తక్షణ ఆహార విభాగంలో చక్కని ప్రభావాన్ని చూపించే వినియోగదారుల బ్రాండ్ను నిర్మించే తమ ప్రయత్నంలో హార్దిక్తో భాగస్వామ్యం అయినందుకు తాము సంతోషిస్తున్నామన్నారు.

సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ సమావేశం

నవతెలంగాణ-కూకట్ పల్లి

కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు ఆదేశాలమేరకు, మూసాపేట్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఉన్న సమస్యలు తెలుసుకునేందుకు గాను, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ అవంతి నగర్ తోట అసోసియేషన్ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు సమస్యలను అసోసియేషన్ సభ్యులు తూము శ్రావణ్ కుమార్ కి వివరించి, వినతి పత్రం అందజేశారు. కాలనీలో అల్యూమినియం విద్యుత్ వైర్లు ఇళ్ళ ముందు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని వాటి స్థానంలో బంచ్ కేబుల్ వైరు ఏర్పాటు చేయాలని కోరారు. కమ్యూనిటీ హాలు షెడ్ నిర్మాణం చేపట్టాలని, రోడ్ల పునర్నిర్మాణం చేపట్టాలని, సాయి బాబా గుడి వెనుక నిరుపయోగంగా ఉన్న స్థలంలో సుందరీకరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శ్రావణ్ కుమార్ స్పందిస్తూ కాలనీ సమస్యలను ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారమయ్యే విధంగా కషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సి.హెచ్ సత్యనారాయణ, సత్యం, అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, కాలనీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



'బీజేపీ హటావ్-దేశ్ బచావ్' పాదయాత్రను విజయవంతం చేయండి'

నవతెలంగాణ-హిమాయత్ నగర్



సాధారణ ప్రజల సమస్యలు పట్టించుకోకుండా స్వేచ్ఛా ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తూ దేశంలో భయం, ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్న బీజేపీ సర్కార్ నిరంకుశ విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ నెల 14వ తేదీ నుండి వచ్చే నెల 15వ తేదీ వరకు సిపిఐ నిర్వహించే 'బీజేపీ హటావ్-దేశ్ బచావ్' పాదయాత్రను విజయవంతం చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ గురువారం ఒక ప్రకటనలో కోరారు.వేలాది మంది రెడ్ షర్ట్స్ సిపిఐ శ్రేణులు ఈ నెల 14వ తేదీన ట్యాంక్ బండ్ బాబా సాహెబ్ అంబేద్కర్ కు ఘన నివాళులు అర్పించిన అనంతరం అక్కడ నుండి ఇందిరా పార్క్ వరకు ప్రదర్శనగా చేరుకున్న అనంతరం భారీ బహిరంగ సభ జరుగుతుందని ఆయన తెలిపారు. భారీ బహిరంగ సభ తరువాత 'బీజేపీ హటావ్-దేశ్ బచావ్' పాదయాత్ర ప్రారంభమౌతుందని చెప్పారు.సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో జరిగే ఈ పాదయాత్రను సిపిఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ ప్రారంభిస్తారని, నారాయణతో పాటు సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బహిరంగ సభలో ప్రసంగిస్తారని పేర్కొన్నారు.రాష్ట్రంలోని ప్రతి పట్టణం, పల్లెలో ఇంటింటికి తిరిగి ఫాసిస్ట్ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామని, నిరంకుశ మోడీ ప్రభుత్వాన్ని పడగొట్టి భారతదేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకిక, సమగ్రతను కాపాడాలని ప్రజలను కోరుతామని ఈ.టి.నరసింహ వెల్లడించారు.

అభివృద్ధి పనులను వేగవంతం పూర్తి చేయాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పెండింగ్‌లో ఉన్న అభివద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు అన్నారు. గురువారం బాలాజీనగర్ పరిధిలోని కె.పి.హెచ్.బి కాలనీ ధనలక్ష్మి సెంటర్ పార్క్ పనులను ఆయన జి.హెచ్.ఎం.సి అధికారులు డిఈ ఆనంద్, ఏఈ శ్రీనివాస్ లతో కలిసి పరిశీలించారు. పక్కనే కల్వర్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివద్ధి పనులలో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు దినేష్, రావెల్, జాన్, మహేష్, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

హై కోర్టు వద్ద చిన్నపాటి వర్షానికే విరిగిన భారీ వృక్షం

నవతెలంగాణ-హైదరాబాద్



నగరంలో సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి భారీ వృక్షం పెరిగి రోడ్డుపై అడ్డంగా పడింది.

పాత నగరంలో గురువారం ఉన్నటువంటి సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం లో మార్పులు ఏర్పడ్డాయి. కురిసిన ఐదు నిమిషాల పాటు గాలివానకు రోడ్లపై నీరు నిలిచింది. వర్షంతో పాటు గాలివీచడంతో హైకోర్టు పోస్ట్ ఆఫీస్ వద్ద ప్రధాన రహదారిపై ఆ గాలివానకు పెద్ద వృక్షం కూలి పడింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆ మార్గం గుండా వెళ్లే రైచూర్ కర్నూల్ నారాయణపేట తిరుపతి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను వాహనాలను ట్రాఫిక్ పోలీసులు చుడి బజార్ ముస్లిం జంగ్ పూల్ మీదుగా దారి మళ్ళించారు. అనంతరం క్రేన్ సహాయంతో చెట్టును తొలగించారు.

జిల్లా గ్రంథాలయంను విద్యార్థుల సందర్శన

నవతెలంగాణ-మేడ్చల్



విద్యార్థులకు చిన్నతనం నుంచే నైపుణ్యాలను అందివ్వాలని ఎస్ఎస్ జీ స్కూలు కరస్పాండెంట్ సామ రాధాకష్ణ అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా గ్రంథాలయానికి ప్రీ ప్రైమరీ విద్యార్థులను సందర్శనకు తీసుకువెళ్లారు. అక్కడ విద్యార్థులు వివిధ రంగాలకు చెందిన గొప్ప గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు,వారి జీవిత పుస్తకాల గురించి వివరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే జ్ఞాపక శక్తిని కలిగి ఉండేలా విజ్ఞాన యాత్రలు, గ్రంథాలయాల సందర్శన వంటివి చేయించాలన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థి గడ్డం వర్ధన్ ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సనత్‌నగర్ డివిజన్‌లో మంత్రి తలసాని పర్యటన

నవతెలంగాణ-సనత్‌నగర్



సనత్ నగర్ డివిజన్‌లో గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ కొలన్ లక్ష్మి బాల్ రెడ్డిలు పలు అభివద్ధి పనులను ప్రారంభించారు. సనత్ నగర్‌లోని స్వామి టాకీస్ వద్ద రోడ్డు, వాటర్ పైపు లైన్‌కు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా జెక్ కాలనీలో వాటర్ పైపు లైన్ ను ప్రారంభించారు. అనంతరం డివిజన్ లోని దాసారం బస్తి బాలయ్య నగర్ కాలనీ వాసులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న అగ్ని మాపక వారోత్సవాల పోస్టర్‌ను గోషామహల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రాజాసింగ్, ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులను స్మరించుకున్నారు. అనంతరం గౌలిగూడ అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. వేసవికాలంలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు, వ్యాపార సముదాయాలు నిర్వహిస్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారోత్సవాల సందర్భంగా అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజల వద్దకే..

- అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజా సమస్యలను నేరుగా ప్రజల వద్దనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామనీ, సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలని నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి తెలిపారు. గురువారం మేయర్ కమ్యూనిటీ ఎంగేజ్మెంట్, సిటిజన్ గ్రీవెన్స్ డిస్పోజల్ ప్రారంభ కార్యక్రమంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, నోడల్ టీమ్, సర్కిల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కమ్యూనిటీ ఎంగేజ్మెంట్, సిటిజన్ గ్రీవెన్స్ డిస్పోజల్ ప్రారంభ కార్యక్రమంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల వద్దకు నోడల్ అధికారులు వచ్చి తమ సమస్యలను తెలుసుకుని



వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేస్తారని తెలిపారు. నగరంలో ప్రజా సమస్యలను నేరుగా ప్రజల వద్దనే పరిష్కరించేందుకు కమ్యూనిటీ ఎంగేజ్మెంట్, సిటిజన్ గ్రీవెన్స్ డిస్పోజల్‌ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ శాఖ ద్వారా మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. అన్ని సర్కిల్ పరిధిలో 4,846 కాలనీలు ఉన్నాయని తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు ఈ నోడల్ టీమ్స్ కలిసి అక్కడ ఉన్న సమస్యలను తెలుసుకుని యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తారని తెలిపారు. అసోసియేషన్‌ల ప్రతినిధులు సమస్యలను నోడల్ టీమ్స్‌కు తెలియజేయాలన్నారు. కాలనీల్లో రోడ్లపై ఉన్న గుంతలు, సీ అండ్ డీ వేస్ట్, స్ట్రీట్ లైట్లు, వాటర్, సీవరేజ్, మెడికల్, ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్స్, పోలీస్ లా అండ్ ఆర్డర్ తదితర సమస్యలను నోడల్ టీమ్ పరిష్కరిస్తాయన్నారు. నోడల్ టీమ్ నేటి నుంచి 15 రోజుల పాటు బస్తీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్లమ్ లెవల్ ఫెడరేషన్ ప్రతినిధులను ఈ సందర్భంగా కోరారు.

కేంద్రం వ్యక్తిగత పూజలు మానుకోవాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రజా సంఘాల జేఏసీ చైర్మెన్ గజ్జలకాంతం



నవతెలంగాణ-బంజారాహిల్స్

కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత, వ్యక్తుల పూజలు మానుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రజా సంఘాల జేఏసీ చైర్మెన్ గజ్జల కాంతం హితవు పలికారు. నవతెలంగాణతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

నవతెలంగాణ : ఎప్పుడు మీడియా సమావేశం నిర్వహించినా కేంద్ర ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తారు..? ఎందుకు?

గజ్జెలకాంతం : కేంద్ర ప్రభుత్వం నియంత పాలన చేస్తూ ప్రజల సొమ్మును పూర్తిగా దుర్వినియోగం చేస్తుంది. కేవలం కొందరు వ్యక్తులకు లబ్ది చేకూరే విధంగా చేయడం వల్ల బడుగు, బలహీన, అట్టడుగు వర్గాలు పూర్తిగా ఆర్థికంగా నశించిపోతున్నాయి.

నవతెలంగాణ : రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అవలంభిస్తుందని ప్రతిపక్షాల విమర్శ?

గజ్జెలకాంతం : రాష్ట్ర ప్రభుత్వం ఆ విధానాన్ని ఏ రోజూ అలంభించలేదు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి సహకారం అందిస్తారని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు పలికింది. వారి విధానాలను తెలుసుకున్న సీఎం కేసీఆర్, మంత్రులు వారిని ప్రశ్నించడం మొదలు పెట్టగానే వేధింపులకు పాల్పడుతున్నారని కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీ లాంటి వాటిని కేవలం కక్ష సాధింపులకు వినియోగించుకోవడం దుర్మార్గపు చర్య.

నవతెలంగాణ : రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేసి పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఎందుకు?

గజ్జెలకాంతం : రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే కంద్ర ప్రభుత్వం సహకారం అందించడం లేదు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలి. రాష్ట్రం నుంచి తీసుకుంటున్న పన్నులను సకాలంలో చెల్లించకపోవడంతో పాటు రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వడం లేదు.

నవతెలంగాణ : ఉద్యమ పార్టీ జాతీయ స్థాయిలో నిలబడగలదా?

గజ్జెలకాంతం : ఉద్యమాల పురిటిగడ్డ తెలంగాణ రాష్ట్రం నేటిది కాదు. 1969 నుండి పోరాటం చేస్తే అనేకమంది తమ ప్రాణాలకు తెగించి పోరాటం చేసిన సాధించుకున్నారు. సీఎం కేసీఆర్ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని పథకాలను అమలు పరిచి దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారు.

నవతెలంగాణ : రాష్ట్రంలో కూడా కాలేశ్వరం ఇతర ప్రాజెక్టును కొందరు వ్యక్తులకే కేటాయించారని విమర్శలు ఉన్నాయి?

గజ్జెలకాంతం : కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తే కొందరు వ్యక్తులకు కేటాయించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం టెండర్ల ద్వారా పనులు పూర్తి చేశారు. అనుమానాలు ఏమైనా ఉంటే కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న సంస్థలను ఉపయోగించి ఈ పాటికి తప్పును ప్రజల ముందు పెట్టేవారు. కేంద్ర ప్రభుత్వ తప్పిదాలతో పోలిస్తే రాష్ట్రంలో వందకు ఐదు శాతం కూడా ఉండదు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం ఇద్దరు వ్యక్తులే ఎందుకు అభివృద్ధి చెందారో తెలిపి దేశంలోని వివిధ కంపెనీలు, సంస్థలు సామాన్య ప్రజలు ఎందుకు అభివృద్ధి చెందలేదో ప్రజలకు చెప్పాలి.

నవతెలంగాణ : కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆయుష్మాన్ భారత్ రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదు?

గజ్జెలకాంతం : గతంలో కేంద్రంలో పరిపాలించిన కాంగ్రెస్ అమలు చేసిన పథకాలే తప్ప కొత్తగా బీజేపీ వచ్చాక అమలు చేసిన పథకాలు పేర్లు తెరపాలి. అసలు పేర్లు మార్చి పథకాలు అమలు చేయడంలో బీజేపీ దిట్టా. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన మిషన్ భగీరథ, కళ్యాణ లక్ష్మి, దళిత బంధు ఇతర పథకాల పేర్లు మార్చి వివిధ రాష్ట్రాల్లో అమలు చేసిన కేంద్ర ప్రభుత్వానికి ఇలా అనే నైతిక హక్కు కూడా లేదు. ఆరోగ్యశ్రీ సేవలు ఉండగా ఆయుష్మాన్ భారత్ ఏం అవసరం. అసలు రాష్ట్రానికి రావాల్సిన పన్నుల శాతాన్ని మొదట రాష్ట్రానికి చెల్లించి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడాలి.

ఇఫ్తార్ సోదరభావానికి ప్రతీక : జేటీసీ పాండురంగ నాయక్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హిందూ, ముస్లిం, క్రైస్తవులు సోదరభావంతో ఆత్మీయ ఇఫ్తార్ విందులో పాల్గొనడం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జె.పాండురంగ నాయక్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లింలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరులకు పండ్లు తినిపించి రోజాను విరమింపజేసి మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి గంగా జమున తె హజీబ్ అన్నారు. రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల మధ్య సోదర భావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ రంజాన్ మాసంలో ముస్లింలు కఠినమైన ఉపవాస దీక్ష చేపడుతారనీ, దీక్ష ముగిసే సమయంలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. ప్రతి ఏడాదీ ఆర్టీఏ కార్యాలయంలో అన్ని పండుగలతో పాటు రంజాన్ ఇఫ్తార్ విందును కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి కొత్త దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవోలు ఎల్.రాంచందర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంవీఐ శ్రీనుబాబు, ఏవోలు హనుమంతేశ్వర్ రావు, శ్రీనివాస్ రావు, సీనియర్ అసిస్టెంట్‌లు ఖాన్, కల్యాణ్, పర్వేజ్ ఖాన్, కార్తీక్, రమణ, ఇక్బాల్, పర్వేజ్ అలీ, నవీన్, ముజాహిద్, ఇమ్రాన్, అన్సార్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పేదల శ్రేయస్సు కోసమే సంక్షేమ పథకాలు



నవతెలంగాణ-అంబర్‌పేట

పేదల శ్రేయస్సు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ వెల్లడించారు. గురువారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ఎస్ఆర్‌జీ ఫంక్షన్ హాల్‌లో అంబర్‌పేట ఎమ్మార్వో సీహెచ్ లలిత ఆధ్వర్యంలో షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, ఆసరా పింఛన్లు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కంటి వెలుగు కార్యక్రమాన్ని దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలు కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకుని ఆర్థికంగా లబ్ది పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ పనులు దేశానికి ఆదర్శం : ఓయూ జేఏసీ

నవతెలంగాణ-ఓయూ



డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని నిర్మించడంతో పాటు నూతన సచివాలయానికి ఆయన పేరు పెట్టడం వంటి నిర్ణయాలు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికే ఆదర్శంగా ఉన్నారని ఓయూ జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, అధ్యక్షులు డా.ఎల్చాల దత్తాత్రేయ కొనియాడారు. గురువారం ఓయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి రాష్ట్రంలో అంబేద్కర్ మహా విగ్రహాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఈ దేశంలో అంబేద్కర్‌ని కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకుంటూ, భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగబద్ధ సంస్థలను, దేశంలోని ఇతర రాష్ట్రాలలో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటైన ప్రభుత్వాలను కూల్చడం కోసం, అధికారాన్ని లాక్కోవడం కోసం పావులుగా వాడుతూ అంబేద్కర్‌ను అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఇప్పటికైనా కేసీఆర్‌ని ఆదర్శంగా తీసుకొని దేశ నూతన పార్లమెంటుకు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించే మహా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల విద్యార్థులు,నిరుద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో ఓయూ జేఏసీ ప్రధాన కార్యదర్శి, ఆలిండియా ట్రైబల్ జేఏసీ చైర్మన్ రవీందర్ నాయక్, జేఎన్టీయూ జేఏసీ చైర్మన్ జగన్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు రఘు, అంసా నాయకులు, నామ సైదులు, కొప్పుల అర్జున్, సురేష్ నాయక్, విద్యార్థులు యువకులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



మంచినీటి సమస్య పరిష్కరించాలని జూబిహిల్స్ నియోజకవర్గ పరిధిలోని వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ హరి శంకర్‌కు గురువారం సీపీ(ఐ)ఎం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్, బోరబండ, ఎస్పీఆర్ హిల్స్, సైట్ త్రీ బస్తీలలో మూడు రోజులకు ఒకసారి ఒక గంట మాత్రమే మంచినీరు విడుదల చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో నీటి అవసరం ఎక్కువగా ఉంటోందని, సరఫరా తక్కువగా ఉండటంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను దృష్టిలో ఉంచుకోని నీటి సరఫరా పెంచాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన జనరల్ మేనేజర్, సరిపోయే విధంగా తాగునీటి విడుదల చేసేందుకు కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చినట్టు నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి శేషగిరిరావు, సికిందర్, ప్రకాష్, అబ్రహాం, అనిత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ కానుకల పంపిణీ

నవతెలంగాణ-ఓయూ



రంజాన్ మాసం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం ముస్లింలకు కానుకలు పంపిణీ చేశారు. హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ ఫ్లోర్ సెక్రెటరీ కక్కిరేణి చేతన హరీష్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని క్యాంప్ నెంబర్ 3, 5లతో పాటు ఏక్ మినార్ మసీదులలో ముస్లింల కు రంజాన్ తోఫా అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు కాజా భాయ్, సయ్యద్ ఖలీద్, మహమ్మద్ యూసఫ్, బీజేపీ హబ్సిగూడ ఓబీసీ అధ్యక్షుడు అల్కాపురి సురేష్, హబ్సిగూడ డివిజన్ దళిత మోర్చా ఉపాధ్యక్షులు కట్ట భాస్కర్ పాల్గొన్నారు.

నల్లమలను అదానీకి అప్పగించే కుట్రలో భాగమే లక్ష్మణ్ వ్యాఖ్యలు



నవతెలంగాణ-ముషీరాబాద్

నల్లమల అడవులను ఆదానీకి అప్పగించే పుట్టలో భాగమే ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు అని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. నల్లమల ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలన్న బీజేపీ జాతీయ నాయకులు, రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య పార్కు వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ధర్మనాయక్, ఆర్.శ్రీరాం నాయక్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, పట్నం రాష్ట్ర కార్యదర్శి డిజి నరసింహారావు, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. శోభన్ హాజరై మాట్లాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం యురేనియం తవ్వకాల పేరుతో నల్లమల అడవులను ఆదానీకి కట్టబెట్టేందుకు కుట్రలో భాగంగానే లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాటి నుంచి నల్లమల ప్రాంతంలో యురేనియం తవ్వకాలు జరిపేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నదన్నారు. యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా గిరిజనులు, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తుండటంతో కేంద్రం వెనక్కి వెళ్లిందన్నారు. ప్రజా పోరాటాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి యురేనియం తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదని తెలిపినట్టు చెప్పారు. ఇప్పుడు కేంద్రం మరోసారి యురేనియం తవ్వకాలను ఆదానీ గ్రూపునకు కట్టబెట్టేందుకు సిద్ధపడిందన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపదను లూటీ చేయడానికే ఆదానీ వంటి సంస్థలకు కట్టబెడుతున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో శాంపిల్స్, సర్వేల పేరుతో బోర్లు పాతినట్టు చెప్పారు. అందులో భాగంగానే లక్ష్మణ్ యురేనియం తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడుతున్నదనీ, అనుమతి ఇస్తే ఆ ప్రాంతమంతా అభివృద్ధి అవుతుందని వ్యాఖ్యానించడం దుర్మార్గమైన చర్య అన్నారు. దీన్ని ప్రజాస్వామ్యవాదులు, గిరిజన, ప్రజా సంఘాలు ఖండించాలని కోరారు. నల్లమల ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు అనుమతి ఇవ్వడం అంటే ప్రపంచంలోని విస్తారమైన అడవులను ధ్వంసం చేయడమే అన్నారు. నల్లమల ప్రాంతంలో భారత రాజ్యాంగం ఐదో షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులకు ప్రత్యేక హక్కులతో పాటు లక్షలాదిమంది ప్రజలు, జంతువులు, విలువైన వృక్ష సంపద నాశనం కావడమే కాకుండా నదులు కలుషితం అయిపోయి పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాస నాయకులు బొప్పని పద్మ, ఆంజనేయులు, గిరిజన సంఘం హైదరాబాద్ నాయకులు గోపి, రఘు, నాగు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రతిఫలం అనుభవిస్తున్న కేసీఆర్ కుటుంబం

నవతెలంగాణ-ముషీరాబాద్



సబ్బండ వర్గాల ప్రజలు కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంటే సీఎం కేసీఆర్ కుటుంబమే తెలంగాణ ప్రతి ఫలాలను అనుభవిస్తుందనీ, రాష్ట్రంలో 2023లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా పార్టీ 119 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుందనీ, బీసీలకు 70 అసెంబ్లీ స్థానాలను కేటాయిస్తామని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందే అన్నారు. 75 ఏండ్ల స్వాతంత్ర్య భారత దేశంలో తెలంగాణలో పేదలకు విద్య, వైద్యం, న్యాయం ఉచితంగా అందడం లేదన్నారు. పేదల కష్టాలు తీర్చడానికే ప్రజా పార్టీ ప్రజలకు ముందుకు వచ్చిందన్నారు. ప్రజా పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికీ విద్య వైద్యం, న్యాయంను ఉచితంగానే అందిస్తామన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 70 అసెంబ్లీ స్థానాలు కేటాయిమన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అగ్రవర్ణ నాయకుల ఆధ్వర్యంలో పని చేస్తున్నాయన్నారు. సామాజిక తెలంగాణ ప్రజా పార్టీతోనే సాధ్యం అవుతుందన్నారు. జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాల ప్రజలకు అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు కేటాయిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా పార్టీ అధికారంలోకి వస్తే మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెంట రమేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంజి యాదవ్, సత్యనారయణ, భిక్షపతి యాదవ్, నాగేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు భాగ్యలక్ష్మి మహేష్ యాదవ్, అనిల్, రవి కుమార్, పలువురు ప్రజా పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

జంతువుల సంరక్షణపై అధికారులు దృష్టి సారించాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



వేసవిలో నీటి దాహానికి జంతువులు ఇబ్బంది పడకుండా అధికారులు దృష్టి సాధించాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మ వెంకటరెడ్డి అన్నారు. గురువారం బాగ్ అంబర్ పేట డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ పద్మ వెంకట్ రెడ్డి జీహెచ్ఎంసీ జంతు సంరక్షణ శాఖ అధికారులు సద్గుణ రెడ్డి, వనజతో కలిసి జీహెచ్ఎంసీ వారు ఏర్పాటు చేసిన నీళ్ల తొట్టిలలో నీళ్లను పోశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తీవ్రమైన ఎండలకు జంతువులకు, పక్షులకు దాహాన్ని తీర్చడానికి జీహెచ్ఎంసీ వారు ఏర్పాటు చేస్తున్న నీళ్ల తొట్టిలను అన్ని బస్తీలు, కాలనీల్లో అక్కడక్కడ ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక ప్రజలు వాటిల్లో నీళ్లు పోసే విధంగా చూడాలని అన్నారు. ఎండల తీవ్రతకు నోరులేని జీవాలైనా జంతువులు, పక్షులకు దాహార్తి తీర్చడంలో ప్రజలు ముందుండి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిర్యాల శ్రీనివాస్, బాలకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యమానికి అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-అంబర్‌పేట



బీసీ ఉద్యమానికి అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలనీ, అన్ని రాజకీయ పార్టీల్లో యున్న బీసీ నాయకులు కలిసి రావాలి అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. గురువారం కాచిగూడ అభినందన్ హోటల్లో జాతీయ బీసీ సంక్షేమం జాతీయ కన్వీనర్ గుజ్జా కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి ఏటా రూ.2లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. కంద్ర స్థాయిలో కాలేజీ విద్యార్థులకు, పాఠశాల విద్యార్థులకు స్కాలర్ షిప్ స్కీం ప్రవేశపెట్టాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీం పెట్టాలనీ, హాస్టళ్ళు, గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలనీ, కులవృత్తులు కోల్పోయిన వారికి ప్రతి కుటుంబానికీ రూ.20 లక్షలు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని తదితర 16 డిమాండ్లతో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీష్ దనకర్, హోంశాఖ మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, సమాజ్ వాద్ పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్, బీఎస్పీ, డీఎంకే, అన్నా డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, జనతాధల్, బీజూ జనతాధల్, సీపీఐ తదితర పార్టీల నేతలను 96 మంది పార్లమెంట్ సభ్యులను కలిసి బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. నెల రోజులు బీసీ సంక్షేమ సంఘం నేతలు పార్లమెంట్ వద్ద భారీ ధర్నాలు, ప్రదర్శనలు జరిపి అన్ని పార్టీల నాయకులను కలిసి చర్చించారు. అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేయడానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వాలు గత 75 ఏండ్లుగా బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో కనీస ప్రాతినిధ్యం లభించలేదు. ఈ కార్యక్రమంలో కోల జనార్దన్, నీలం వెంకటేష్, బుపేష్ సాగర్, సుధాకర్, అంజి, వేముల రామకృష్ణ, నారని రవీందర్, శివమ్మ, శ్రీదేవి, నిఖిల్, రాహుల్, రాకేష్, దత్తు తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం బషీర్ బాగ్‌లోని ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ఉద్యమ నేత ఆర్వి మహేందర్ కుమార్ గ్యాలరీ మధ్యలోకి వెళ్లి అభివాదం చేశారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

హెగ్డే ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో



హెగ్డే ఫెర్టిలిటీ సెంటర్‌ను గురువారం అత్తాపూర్‌లో మరో సంతాన సాఫల్య కేంద్రాన్ని ప్రారంభించింది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, టిసిఓజీఎస్, ప్రెసిడెంట్ ఎఫ్ఓజీఎస్ఐ మాజీ ప్రెసిడెంట్, డాక్టర్ శాంత కుమారి లాంఛనంగా ప్రారంభించారు. అత్తాపూర్ కార్పొరేటర్ మొంద్ర సంగీత హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హెగ్డే ఫెర్టిలిటీ, క్లినికల్ డైరెక్టర్ చీఫ్ ఐవిఎఫ్, కన్సల్టెంట్, డాక్టర్ వందనా హెగ్డే, అత్తాపూర్ శాఖ, ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, క్లినికల్ హెడ్, డాక్టర్ షాలిని సింగ్ పాల్గొన్నారు.



మన చేనేతకు చేయుతగా నిలిచి, పర్యావరణ ప్రేమికగా, మన దేశ వస్త్రాల ప్రాముఖ్యాన్ని, ప్రాభావాన్ని ప్రపంచానికి చాటుతున్న వ్యాపారవేత్త... నేటి మహిళ మేటి మహిళ అని నిరూపిస్తున్నారు **మృణాళిని శాస్త్రి**. సిక్స్ యార్డ్స్ ప్లస్ అనే సంస్థ ద్వారా చీరకు మెరుగులు దిద్ది నేటి ఆధునిక మహిళకు కూడా చీర సొబగులను నేర్పి, వారు సులభంగా చీరను కట్టుకునే ట్రిక్‌ను చెబుతున్న వీరి అంతరం నేటి **మానవి**లో...

చీరకు మెరుగులు దిద్దుతూ...
చేనేతకు చేయూతనిస్తూ...

మృణాళిని తల్లిదండ్రులిద్దరూ ప్రైవేట్ డాక్టర్స్. మధ్యతరగతి కుటుంబం. తల్లికి సంగీత జ్ఞానం కూడా ఉండేది. మొదటి నుంచి పుస్తకాలు బాగా చదవడమన్నా, సినిమాలు చూడడమన్నా మృణాళినికి చాలా ఇష్టం. అలాంటి అందమైన కుటుంబ వ్యవస్థలో ఆమె పెరిగారు. టాప్ స్టూడెంట్‌గా ఉండి కూడా సైన్స్‌కి బదులుగా కామర్స్ ఎంచుకున్నారు. ఇది చాలా మందిని ఆశ్చర్యపరిచినప్పటికీ ఇదే తనలో ఉన్నటువంటి కళకు, సృజనాత్మకతకు పదును పెట్టిందంటున్నారు. అంతేకాదు తనను ఓ అడ్మినిస్ట్రేటివ్‌గా ఎదగడానికి దోహద పడిందని అన్నారు. "కష్టపడుతున్నానని అందరూ అంటున్నారు, కానీ ఈ కష్టపడే తత్వం నాకు నా తల్లిదండ్రుల నుండి వచ్చింది' అంటారు ఆమె.

సిక్స్ యార్డ్స్ ప్లస్ ఆవిర్భావం

ఏదో సాధించాలని తపన తనలో బాగా ఉండేది. బీకాం చేసి ఎంబీఏ పూర్తి చేశారు. ఫ్రెంచ్ భాషను కూడా నేర్చుకున్నారు. ఎంబీఏ పూర్తి చేశాక 16 ఏండ్లు కొన్ని ఎన్జీఓలలో పనిచేశారు. అక్కడ చేనేత కళాకారుల నేత పనితనాన్ని బాగా గమనించేవారు. చీరలపై వాళ్ళు చేస్తున్న వర్క్‌ని చూసి ఇంప్రెస్ అయ్యారు. అలా చీరనే తనకు ఆధారమయింది. ఆ చీరనే తన కెరీర్‌గా మలచుకున్నారు. అందులోంచే ఆవిర్భవించిందే సిక్స్ యార్డ్స్ ప్లస్. నేడు హైదరబాద్, శ్రీనగర్ కాలనీలో వైభవోపేతంగా కొలువుదీరి ఉంది.

కళాకారులకు గుర్తింపు కోసం...

చేనేత రంగానికి, చేనేత కార్మికులకు, కళాకారులకు గుర్తింపు రావాలి. తమకంటూ ఒక విలువ లభించాలి వాళ్ళ పనితనానికి, నైపుణ్యానికి సమాజంలో ఒక మహోన్నతమైన స్థానం లభించాలి. అలా జరగాలంటే ముందు చీర వైభవాన్ని తిరిగి తీసుకురావాలి. ఆధునిక మహిళ చీర కట్టును ఆస్వాదించగలగాలి. చీర కట్టుకోవడంలో మెళకువలు తెలుసుకోవాలి. ఆ దిశగా చేనేత కార్మికులకు తోడుగా సాగుతుంది సిక్స్ యార్డ్స్ ప్లస్. చేనేత కళాకారుల పనితనం కేవలం వారి కళ మాత్రమే కాదు. అది వాళ్ళ జీవన భృతి.

సిక్స్ యార్డ్స్ ప్లస్ ఏం చేస్తుంది..?

కేవలం 11 వేల రూపాయలతో, కొన్ని జాకెట్ ముక్కలతో మృణాళిని పూర్తి ఆత్మవిశ్వాసంతో ఈ వ్యాపారాన్ని ప్రారంభించారు. భర్త సూర్య, పిల్లలు, తల్లిదండ్రుల అందరి ప్రోద్బలంతో నిర్దిష్టమైన సమయాన్ని పెట్టుకొని అంచలంచలుగా కష్టపడుతూ ఈరోజు 12 రాష్ట్రాలలో చేనేత కళాకారులతో పని చేస్తున్నారు. అన్ని రాష్ట్రాలలో 65శాతం మహిళలు, 80శాతం రూరల్ ప్రాంత చేనేత కళాకారులు ఇందులో పనిచేయడం తనకు చాలా గర్వకారణంగా ఉందని ఆమె అంటున్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి గొల్లభామ, గోవా నుంచి కుంది, బీహార్ నుంచి బావన్ బూటీ శారీస్, హంబుల్ వీవింగ్ పద్ధతిలో తక్కువ ధరలోనే హాయిగా కట్టుకునే విధంగా చీరలు రూపొందిస్తున్నారు.

చేనేత మన వారసత్వ సంపద

శ్రీనగర్ ఆఫీసులో కేవలం ఐదుగురు మాత్రమే ఉండి పని చేస్తారు. తనతో పాటుగా మరో నలుగురు ఆపరేషన్ సిస్టం, అడ్మిన్ ప్రొడక్షన్ అండ్ సేల్ వారు ఉంటారు. మిగిలిన వారంతా లూమ్స్ మీద పని చేస్తుంటారు. వారికి అవసరమైన లూమ్స్, డిజైన్స్ అందజేస్తుంటారు. ఇలా మగ్గాల పైన 300 మంది కళాకారులు చేనేత వస్త్రాలను సిక్స్ యార్డ్స్ ప్లస్ కోసం నేస్తున్నారని ఆమె చెప్పారు.

చేనేతకు చేయూతగా...

చేనేత కార్మికులకు పని కల్పించడం, సాంకేతిక విజ్ఞానాన్ని అందించి దాని ద్వారా చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడం, టెక్నాలజీని చేనేతను కలపడం వల్ల మార్కెటింగ్ చేయడం చాలా సులభవుతోంది. చేనేత వస్త్రాలు ప్రజల వరకు సులభంగా అందుబాటులోకి రాగలుగుతాయి. వారి పనితనానికి తగినంత మూల్యం ఇవ్వడంలో ప్రజలకు అవగాహన ఏర్పడుతుంది. కళాకారుల నైపుణ్యానికి సరైన గుర్తింపు, వాళ్ళ జీవితానికి సరిపడినంత సంపద ఏర్పడడానికి అవకాశం కల్పిస్తోంది సిక్స్ యార్డ్స్ ప్లస్.

ఇన్‌స్టెంట్ చీరలు

"ఆధునిక అమ్మాయిలో కొందరికి చీర కట్టుకోవడం నిజంగా ఒక సవాలే. మార్కెట్లో సైజులవారిగా కుట్టినటువంటి చీరలు కొంతవరకు దొరుకుతాయి. కానీ నాకు ఇలాంటి అప్రోచ్ నచ్చదు. చీరలకు సైజులతో సంబంధం లేదు. కుట్టిన చీరలు సైజుతో సంబంధం లేకుండా ఎవ్వరైనా కేవలం అర నిమిషంలో కట్టుకునేలా అందరికోసం రూపొందించాం. రాప్, హుక్, ఫ్లిప్ ఇంతే కేవలం మూడే మూడు స్టెప్స్ అంతే..! మూడే మూడు చిటికల్లో చీర కట్టుకునే విధంగా ఇన్‌స్టెంట్ చీరను రూపొందించాను. పర్యావరణానికి హితాన్నిచ్చే కుట్టిన ఇన్‌స్టెంట్ సిక్స్ యార్డ్స్ ప్లస్ చీరలో ఒదిగిన సెలెబ్రిటీలు కూడా ఉన్నారు" అంటున్నారు మృణాళిని.

అవార్డులు గుర్తింపు

మృణాళిని తాను చేస్తున్న ఈ సృజనాత్మక వ్యాపారానికి ఎన్నో అవార్డులు అందుకున్నారు. అందులో ఇనార్బిట్ పింక్ పవర్ అవార్డ్ - 2019, షీ ద పీపుల్ టీవీ డిజిటల్ మార్కెటింగ్ అవార్డ్ - 2021, కోవిడ్ వారియర్ అవార్డ్ - 2020, స్త్రీ శక్తి అవార్డ్ - 2022 ఉన్నాయి.

వి హబ్ సహకారంతో

"వి హబ్ మా ఆశయానికి తోడుగా నిలిచింది. చేనేతకు చేయూత అయిన మా సిక్స్ యార్డ్స్ ప్లస్ ఆశయం నెరవేరడానికి మార్కెటింగ్ చేయడంలో మాకు పూర్తి సహకారాన్ని అందించారు" అంటున్నారు ఆమె. "ముదితల్ నేర్వగరాదే ముద్దార నేర్పించినన్" అంటారు. మహిళలు నేర్పే స్థాయికి ఎదిగారు. వాణిజ్య వేత్తలుగా ఎదిగి వ్యాపారరంగంలో తమదైన ముద్రను వేస్తున్నారు. తనకెంతో ఇష్టమైన చీరకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు ఇవ్వడానికి, చేనేత, కలంకారి కళాకారులకు సమాజం గుర్తించేలా తమ వంతు కృషిని అందిస్తూ మున్ముందుకు సాగుతున్నారు మృణాళిని.

- రమాదేవి కులకర్ణి, 8985613123



అవసరాలకు అనుగుణంగా

"ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషానికి ఒక ట్రక్కు లోడు బట్టలను భూమిలో పాతి పెడుతున్నారు. ఎంత వ్యర్థం ఇది? అనవసరంగా ఇంత సరుకును వ్యర్థ పరుస్తున్నారు. దీని మీద అవగాహన రావాలి. వినియోగదారులకు ఎంత అవసరమో అంతే తయారు చేయాలి అనే ఆలోచన ఉండాలి. తయారు చేసేవారు, వినియోగదారులు ఇద్దరూ కూడా అవగాహన కలిగి ఉండాలి. ఎంత అవసరమో అంతవరకే చేయాలంటే డిమాండ్ ఎంతుందో అంతే సప్లై చేయాలి. అనవసరంగా గుట్టలు గుట్టలుగా వస్త్రాలను తయారు చేసి భూమిలో పాతి పెట్టడం వల్ల ఎంత ధనం, ఎంత మూలధనం నాశనం అవుతుంది. ఇది విన్నప్పుడు నేను చాలా బాధపడ్డాను. ఉత్పత్తి చేసేవారు, కొనేవారు ఇద్దరూ సంతోషంగా ఉండాలి. అంటే చేనేత వస్త్రాలకు ఆదరణ లభించాలి. బట్టలు ఎలా కొనాలి? చీరలు ఎలా వాడాలి? పాత వాటిని కూడా కొత్తవాటిగా ఎలా మలుచుకోవాలి అనే అవగాహన వినియోదారులకు కచ్చితంగా ఉండాలి" అంటారు ఆమె.



ఆ పాత మధురాలు

అమ్మ పాత చీరను కొత్తగా మలచడం, అమ్మమ్మ చీరలకు కొత్త అందాలద్ది వాటి బోర్డర్స్‌తో మళ్ళీ తిరిగి కొత్త చీరలుగా మలచడం పాత చేనేత పట్టు, మరేదైనా వస్త్రాలకు తిరిగి పెయింటింగ్స్ వేయడం, కలంకారి డిజైన్లను వాటిలో అద్ది... అమ్మ, అమ్మమ్మల చీరల జ్ఞాపకాలను ఈనాటి తరానికి అందించేలాగా తిరిగి వాటికి కొత్త కళను తీసుకొస్తాం. బీరువాలలో దాచేసిన వాటిని మళ్ళీ ఈనాటి యువతకు న్యూ లుక్‌లో కనిపించేలాగా పాత చీరలను కొత్తగా మలచడం మేము చేస్తున్నటువంటి మరో చక్కనైనటువంటి కార్యక్రమం. ఇదంతా చీరంటే ఉన్న ఇష్టం వల్ల చేస్తున్నాను. దీనినే వృత్తిగా, ప్రవృత్తిగా ఎంచుకొని ఎంతో శ్రమతో ఒక్కో అడుగు వేస్తూ ఈ రోజు ఈ స్థాయికి వచ్చి 12 రాష్ట్రాలలో ఉన్న చేనేత కళాకారులకు చేయూత నివ్వగలిగాం. వారితో కలిసి నడుస్తున్నాం. మొదట్లో కష్టానష్టాలను, ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్నాను. "చీరలమ్ముకుంటావా.. ఏంటి?" అంటూ కొందరు చిన్నచూపు చూశారు. ప్రతి సవాలును ఒక పరీక్షలా, నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి నాకు వచ్చినటువంటి ఒక అవకాశంగా భావించుకుంటూ ముందుకు నడిచాను.

బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలకూడదు

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. గరిష్టంగా బీజేపీ వ్యతిరేక ఓట్లు పోల్ అవ్వాలనీ, రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటుకు అంగీకరించాలని సీపీఐ(ఎం) కోరుకుంటుందని తెలిపారు. ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులను బట్టి సీట్ల కేటాయింపు జరగాలనీ, ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న చోట కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలు అవసరమైన రాజీలు చేసుకోవాలని సూచించారు. ప్రతిపక్షాల ఐక్య ఉద్యమాన్ని వేగవంతం చేసేందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గురువారం నాడిక్కడ సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు ఇతర నేతలను కలిశారు. సమావేశానంతరం సీతారాం ఏచూరి విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షాల ఐక్యత కోసం ప్రయత్నాలు ఊపందుకున్నాయనీ, లౌకిక ప్రత్యామ్నాయం కోసం చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రాజకీయ పరిస్థితులు ఉన్నాయని, ఆయా రాష్ట్రాల పరిస్థితులకనుగుణంగా సీపీఐ(ఎం) రాజకీయ పొత్తుపై నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి బీజేపీ గరిష్టంగా మత విభజనను సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజల జీవన సమస్యల పరిష్కారానికి బీజేపీ ప్రభుత్వం వద్ద ఎలాంటి ప్రణాళిక లేదని, బతుకుదెరువు కష్టాల నుంచి దృష్టి మరల్చి విభజనను సద్వినియోగం చేసుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. అయితే దీనికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకతాటిపై నిలబడాలని, ఇలాంటి కార్యక్రమాలకు సీపీఐ(ఎం) ముందుంటుందని తెలిపారు.ప్రతిపక్షాల ఓట్లను ఏకీకృతం చేయడం వల్ల కేవలం 37 శాతం ఓట్లు వచ్చిన పార్టీ (బీజేపీ) అధికారంలోకి వచ్చే పరిస్థితి రాదని అన్నారు. ప్రతిపక్షాల ఐక్యత ఇప్పుడు గణనీయంగా ఊపందుకున్నదనీ, వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య పార్టీల ఐక్యతతోనే బీజేపీని ఓడించవచ్చని పేర్కొన్నారు. 1996, 1998, 2004 మాదిరిగానే ఎన్నికల తరువాతే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే కూటమి ఏర్పడుతుందని స్పష్టం చేశారు. త్వరలో ప్రతిపక్ష పార్టీల సమావేశం నిర్వహించి వ్యూహాలు రచించనున్నట్లు తెలిపారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని పరిరక్షించేందుకు, ప్రజల జీవనోపాధిని కాపాడుకునేందు బీజేపీని ఓడించాలని పిలుపు నిచ్చారు. కేరళలో కాంగ్రెస్, తమ పార్టీ ప్రత్యర్థులనీ, బీజేపీ అక్కడ ప్రధాన పోటీలో లేదని ఒక ప్రశ్నకు బదులిచ్చారు.అనంతరం సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో కూడా నితీశ్ సమావేశమయ్యారు. ప్రతిపక్షాల మధ్య రాజకీయంగా ఏకాభిప్రాయం కుదిరిన తరువాతే మిగతా విషయాలపై నిర్ణయం తీసుకుంటామని కూడా రాజా స్పష్టం చేశారు.. "ఆర్ఎస్ఎస్-బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష ఐక్యతపై చర్చించాం. దేశం గందరగోళంలో ఉంది. సమాజంలోని అన్ని వర్గాలు బీజేపీ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా గళం విప్పుతున్నాయి. లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతగా ప్రజాస్వామ్యాన్ని, ప్రజలను రక్షించడం తప్పనిసరి" అని అన్నారు. నితీశ్ కుమార్ ఐక్య ప్రయత్నాలకు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా పూర్తి మద్దతునిస్తుందని హామీ ఇచ్చింది. కేంద్ర ఏజెన్సీల వేటలో మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా జైలు పాలైన తరువాత కేజ్రీవాల్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అంతకుముందు, ప్రతిపక్షాల ఐక్య ప్రయత్నాలకు దూరంగా ఉండటమే ఆప్ విధానంగా ఉండేది. ఒడిశాలో బీజేపీ విధ్వంసక ప్రయోగాలను ప్రారంభించినందున బీజేడీ కూడా ప్రతిపక్ష కూటమిలో చేరవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మూడు రోజుల ఢిల్లీ పర్యటనలో ఉన్న నితీశ్ కుమార్ శుక్రవారం ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్‌తో భేటీ కానున్నారు.

మత విభజనకు బీజేపీ పదును

- ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో కాషాయ పార్టీ చర్యలు : సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ : దేశంలో 2024 సాధారణ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బీజేపీ మత విభజన రాజకీయాలకు పదును పెడుతున్నదని సీపీఐ(ఎం) జనరల్ సెక్రెటరీ సీతారాం ఏచూరి ఆరోపించారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రామ నవమి వేడుకల్లో భాగంగా పలు వర్గాల ప్రజల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయని ఆయన చెప్పారు. " 2024 (లోక్‌సభ ఎన్నికలు) సమీపిస్తున్నందున, ఎన్నికలు, రాజకీయ సమీకరణ కోసం మత విభజనకు పదును పెట్టడం బీజేపీకి ప్రధానంశంగా మారింది" అని ఒక పత్రికా సమావేశంలో ఏచూరి అన్నారు. ప్రస్తుతం ఘర్షణలు చోటు చేసుకున్న అనేక ప్రాంతాల్లో గతంలో రామనవమి వేడుకల సందర్భంలో ఎన్నడూ అల్లర్లు జరగలేదని తెలిపారు. బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకం కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది సాధారణ ఎన్నికల తర్వాత వాస్తవ బీజేపీ వ్యతిరేక కూటమికి ఒక రూపం ఏర్పడుతుందన్నారు. ఈ కూటమి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే స్థానంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేక రాజకీయ కూటమి ఉంటుందనీ, అయితే బీజేపీ వ్యతిరేక శక్తుల సమూహాన్ని పెంచుకోవాలన్నదే ఆలోచన అని ఏచూరి చెప్పారు. 1996, 2004లో రెండు సందర్భాల్లో కూటములు ఎన్నికల తర్వాతే ఏర్పడ్డాయని తెలిపారు. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో పోటీ పడినప్పటికీ.. 2004లో కేంద్రంలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి సీపీఐ(ఎం) మద్దతిచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అన్ని లౌకిక, ప్రజస్వామిక ప్రతిపక్షపార్టీలతో చర్చలు కొనసాగించాలని సీపీఐ(ఎం) నిర్ణయించిందని ఏచూరి తెలిపారు. " రాబోయే 2024 ఎన్నికల్లో ప్రతి రాష్ట్రంలో దేశభక్తి, లౌకిక ప్రతిపక్ష శక్తులను పెంచడానికి ఈ ప్రయత్నం ఉంటుంది. తద్వారా ప్రతిపక్షంలో విభజనను బీజేపీ అనుకూలంగా మార్చుకోలేదు" అని ఆయన అన్నారు.

బీజేపీ వ్యతిరేక శక్తిగా పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ విశ్వసనీయత ఎప్పుడూ ప్రశ్నార్థకంగానే ఉన్నదని తెలిపారు. రాజకీయాలు అంటే కేవలం నంబర్ల గురించి కాదనీ, స్థిరమైన మిత్రుడు ఎవరన్న కోణంలో దానిని చూడాలన్నారు. లెఫ్ట్, కాంగ్రెస్, ఇతర లౌకిక శక్తులను ఒంటరి చేయడమే తృణమూల్, బీజేపీల ఉద్దేశమైతే, భవిష్యత్తులో వారిద్దరు కలిసి ఏమి చేస్తారన్నదే ఇక్కడ అసలు విషయమని తెలిపారు. ఇటీవల భారత ముస్లింలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలు విచిత్రంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఆమె వాదన పూర్తిగా ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. దేశంలో మోడీ పాలనలో గత ఎనిమిదేండ్లకు పైగా వాస్తవ వేతనాలు స్తబ్దుగా ఉన్నాయని చెప్పారు. ద్రవ్యోల్బణం పెరుగుదలతో ఒకవేళ వాస్తవ వేతనాలు స్తబ్దుగా ఉంటే ప్రజల వినియోగం తగ్గిందనీ, దానర్థం పేదరిక స్థాయిలు పెరుగుతున్నాయని ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు. గత పదేండ్లలో మెరుస్తున్న భారత్, బాధపడుతున్న భారత్ అనే రెండు భారత్‌లు ఏర్పడ్డాయనీ, ధనవంతులు ధనవంతులుగా.. పేదలు పేదలుగానే ఉంటున్నారని ఆయన తెలిపారు. కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), గవర్నర్ వ్యవస్థ వంటివి దుర్వినియోగం అవుతున్నాయని ఏచూరి ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ నాశనమవుతున్నదని తెలిపారు.

నింగినంటిన స్మరణం భారతరత్నావిష్కరణం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్..ఈ పేరు తెలియని వారుండరు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాత. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు. మనువాద ప్రమాదాన్ని ఆ నాడే గుర్తించి ..దాని ప్రతుల్ని దగ్ధం చేసిన దార్శనీకుడు. ఆ మహనీయుని ఆశయాలకు, ఆయన అందించిన రాజ్యాంగ విలువలకు విఘాతం ఏర్పడిన నేటి పరిస్థితుల్లో అంబేద్కర్ భావజాలానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ విగ్రహావి ష్కరణ ఒక స్ఫూర్తిదాయకమైన సందర్భం..

విగ్రహా విశేషాలు..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం (ఏప్రిల్ 14న) ఆవిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ట్యాంక్‌బండ్ సమీపంలోని ఎన్టీఆర్ గార్డెన్ పక్కనున్న 11 ఎకరాల విస్తీర్ణంలో ఆయన విగ్రహాన్ని భారీఎత్తున ఏర్పాటు చేయాలని ప్రభుత్వం 2016లో నిర్ణయించింది. దాని రూపకల్పన బాధ్యతను కేపీసీ ప్రయివేటు లిమిటెడ్ నిర్మాణ సంస్థకు అప్పగించింది. ప్రధాన శిల్పిగా పద్మభూషణ్ రామ్ వన్‌జీ సుతార్ వ్యవహరించారు. ఆయన కుమారుడు అనిల్ సుతార్ కూడా ఆ ప్రక్రియలో పాలుపంచుకున్నారు. విగ్రహం తయారీకి 353 టన్నుల ఉక్కు, 112 టన్నుల కాంస్యాన్ని ఉపయోగించారు. ఎండలకు,వానలకు సైతం చెక్కుచెదరకుండా ఎక్కువ కాలం మన్నిక కలిగి ఉండే విధంగా విగ్రహాన్ని అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో నిర్మించారు. విగ్రహం కింది భాగం (బేస్‌మెంట్) ఢిల్లీలోని ప్రస్తుత పార్లమెంటును పోలి ఉంటుంది. విగ్రహం ఎత్తు 125 అడుగులు కాగా, బేస్‌మెంట్ ఎత్తు 50 అడుగులు. విగ్రహం బరువు 465 టన్నులు. వెడల్పు 45 అడుగులు. ప్రాంగణ విస్తీర్ణం విశాలమైన 11 ఎకరాలతో ఉంది. విగ్రహం చుట్టుపక్కల 2.93 ఎకరాల విస్తీర్ణం పచ్చటి మొక్కలతో, గడ్డి మైదానంతో ఆహ్లాదకరంగా ఉండబోతున్నది. విగ్రహం నిర్మాణం ఖర్చు రూ.145 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వమే ఈ వ్యయాన్ని భరించింది. విగ్రహం సమీపంలో 27,556 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల విశాల భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో అంబేద్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన మ్యూజియం, గ్రంథాలయం, ఆయన రచనలు ఉంటాయి. సభలు సమావేశాలు నిర్వహించుకోవటానికి ఒక కాన్ఫరెన్స్ హాల్‌ను కూడా ఏర్పాటు చేశారు.

స్మృతివనంలో..

మరో వైపు అంబేద్కర్ విగ్రహంతోపాటు స్మృతివనాన్ని సైతం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విగ్రహం చుట్టూ రాక్ గార్డెన్, ల్యాండ్ స్కేప్ ఏరియా, ప్లాంటేషన్, మెయిన్ ద్వారం, ర్యాంప్, వాటర్ ఫౌంటెయిన్, శాండ్ స్టోన్ ఆర్ట్ వర్క్స్, జీఆర్సీ, ఫాల్స్ సీలింగ్, లిఫ్ట్, పార్లమెంట్ బిల్డింగ్ ఆకృతిలో బేస్ మెంట్, మెయిన్ బిల్డింగ్ లోపల ఆడియో, విజువల్ కాన్ఫరెన్స్ హాల్, మ్యూజియం, లైబ్రరీతోపాటు విగ్రహం వద్దకు చేరుకునేందుకు మెట్లదారి వంటివి ఉన్నాయి. అంబేద్కర్ జీవితానికి సంబంధించిన అన్ని విశేషాలను ఇక్కడ తెలుసుకోవచ్చు.

ఏడాది అనుకుంటే.. ఏడేళ్లు పట్టింది!

2016లో అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా హైదారాబాద్ నగరంలో 125 అడుగులతో కూడిన ఈ ప్రతిష్టాత్మక నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. అదే ఏడాది ఏప్రిల్ 14 (అంబేద్కర్ జయంతి)న ఎన్టీఆర్ గార్డెన్ సమీపంలో శంకుస్థాపన చేశారు. 2017 ఏప్రిల్ 14లోపు విగ్రహ నిర్మాణం పూర్తి కావాలన్నది ప్రభుత్వ లక్ష్యం.కాగా వివిధ కారణాలతో ఆలస్యమవుతూ వచ్చింది.

విశ్వమానవుడు అంబేద్కర్

(మొదటిపేజీ తరువాయి)

వెలుగులు విరజిమ్మిన ప్రపంచ మేధావి ఆయన అని ప్రశంసించారు. కష్టంతో కూడుకున్న ఎంతటి సుదీర్ఘ ప్రయాణమైనా చిత్తశుద్ధి, పట్టుదలతో కొనసాగిస్తే గమ్యాన్ని చేరుకోవడం ఖాయమనీ, జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలనే తాత్వికతకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవితమే నిదర్శనమని పేర్కొన్నారు. వర్ణం, కులం పేరుతో వివక్షను, అంటరానితనం అనే సామాజిక దురాచారాన్ని చిన్నతనం నుంచే ఎదుర్కొన్నా.. ఏనాడూ వెనకడుగు వేయని ధీరోదాత్తుడు అని కొనియాడారు. సమస్త శాస్త్రాలను ఔపోసన పట్టిన అంబేద్కర్.. ప్రజాస్వామ్యం, వర్ణ నిర్మూలన, అంటరానితనం, మతమార్పిడులు, స్త్రీల హక్కులు, మతం, ఆర్థిక సంస్కరణలు, చరిత్ర, ఆర్థికవ్యవస్థ తో పాటు అనేక అంశాలపై చేసిన రచనలు, ప్రసంగాలు, విమర్శలు యావత్ ప్రపంచాన్ని ఆలోచింపచేశాయని వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగానికి రూపమిచ్చిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. నేడు దేశంలో అణగారిన వర్గాలు అనుభవిస్తున్న ఫలాలు అంబేద్కర్ తన మేధస్సుతో మదించి సమకూర్చినవేనని తెలిపారు. ప్రపంచంలోనే మరెక్కడా లేని విధంగా హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ మహా విగ్రహాన్ని ఆయన జయంతి రోజున ప్రతిష్టించడం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా యావత్ దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మూలమైన రాజ్యాంగంలో ఆర్టికల్ 3ను పొందుపరిచిన తెలంగాణ బాంధవుడు అని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాల కొనసాగింపులో భాగంగా దేశంలోనే మరెక్కడా లేని విధంగా రాష్ట్ర నూతన సచివాలయానికి 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం' అనే పేరు పెట్టి ఆయన్ను స్మరించుకుంటున్నామని తెలిపారు. అన్ని పథకాలతో పాటు సామాజిక వివక్షకు గురవుతున్న ఎస్సీ సామాజిక తరగతుల అభ్యున్నతికి ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. దళితుల కోసం గురుకుల పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్య, షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రత్యేక ప్రగతి నిధి, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ ద్వారా 20 లక్షల రూపాయల ఆర్థిక సాయం, ఎస్సీలకు నైపుణ్య శిక్షణ, ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రాయితీలు, దళితులను ఎంటర్ ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో టీఎస్‌ప్రైడ్, దళితులకు మూడెకరాల భూ పంపిణీ, ఎస్సీలకు 101 యూనిట్ల వరకు ఉచిత్ విద్యుత్ వంటి ఎన్నో పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. దళితుల జీవితాల్లో గుణాత్మక మార్పే లక్ష్యంగా తీసుకొచ్చిన దళితబంధు పథకం దేశ చరిత్రలోనే విప్లవాత్మక పథకంగా మారిందని తెలిపారు. తెలంగాణలోని దళిత సమాజం భారతదేశానికే ఆదర్శంగా నిలవబోతున్నదని స్పష్టం చేశారు. అంబేద్కర్ ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్నదని తెలిపారు.

సంక్షోభంలో సమాజం..

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాలు..పోరాడి సాధించుకున్న హక్కులను హరిస్తున్నవి. సంస్థలను, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నవి. "ఒక వర్గాన్ని ఇంకొక వర్గం పైకి ఉసిగొల్పే ధోరణి చాలా ప్రమాదకరం" అంటూ అంబేద్కర్ హెచ్చరించినట్టుగా ప్రస్తుతం దుర్భర పరిస్థితులు దేశంలో నెలకొని ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాస్వామిక హక్కుల కోసం, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి సంఘటితం కావటమొక్కటే మార్గం.

ఇతర దేశాల రాజ్యాంగాల్లోంచి అక్కడ కొన్ని, ఇక్కడ కొన్ని అంశాలు పట్టుకొచ్చిన అతుకుల బొంత రాజ్యాంగమంటూ బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. దీన్ని ఎలా చూడాలి?

భారత రాజ్యాంగం పట్ల బీజేపీ మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ 'బంచ్ఆఫ్ థాట్స్'లోనే రకరకాల ఆలోచనలు చేసింది. వీహెచ్‌పీ నిర్వహించిన ధర్మసంసద్ భారత రాజ్యాంగం హిందువులకు వ్యతిరేకంగా ఉన్నదనీ, దాని స్థానంలో హిందూ రాజ్యాంగాన్ని రూపొందించుకోవాలని తీర్మానించింది. మనుస్మృతిలో గొప్ప సమతా ధర్మమున్నదనీ, భారత రాజ్యాంగం కన్నా అదెంతో ఉన్నతమైందని ప్రకటించింది. ఈ రకంగా మొదటి నుంచీ రాజ్యాంగం పట్ల బీజేపీ వ్యతిరేక వైఖరితోనే ఉంది. వాజ్‌పాయ్ కాలంలో రాజ్యాంగ సమీక్షకు జస్టిస్ వెంకటాచలమయ్య నేతృత్వంలో ఒక కమిటీ వేశారు. రాజ్యాంగాన్ని మార్చటానికి ప్రజాభిప్రాయం వ్యతిరేకంగా ఉందని గుర్తించాకే ఆ ప్రయత్నాన్ని వాయిదా వేసుకున్నారు. కానీ ఎప్పటికైనా రాజ్యాంగాన్ని మార్చటం వాళ్ల లక్ష్యం.తమ మతోన్మాదంలోకి దళితులను కూడా లాగటానికి అంబేద్కర్ మాటలను సందర్భ శుద్ధి లేకుండా ఉటంకిస్తూ సంఘ్ పరివార్ శక్తులు ఆయన్ని కూడా వాడుకోవటానికి ప్రయత్నిస్తున్నాయి.

ప్రస్తుతం మనుస్మృతి బాటలో బీజేపీ నడుస్తున్నదన్న విమర్శ ఉన్నది ఇది సహేతుకమైన విమర్శేనా?

నిజమే..రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులు ఒకటొకటిగా రాలిపోతున్నాయి. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం నలిగిపోతున్నది. పౌరులు ఏ దుస్తులు వేసుకోవాలి, ఏ భాష మాట్లాడాలి, ఏమేం చదవాలి, ఏమేం చదవకూడదు, ఏం తినాలి, ఏం తినకూడదు అనేది కూడా మనువాదులు నిర్ణయించే పాడుకాలం వచ్చింది. మనుస్మృతి విధానాలు ఇప్పటికే ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో అమల్లో ఉన్నాయి. లైంగిక దాడులు చేసినా, హత్యలు చేసినా, కులం పేరుతో వెలివేసినా అడగటానికి వీలు లేదు. ఇది మన ఖర్మ అని సరిపెట్టుకోవాలంటున్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం తదితర అంశాలకు వారి రాజ్యాంగంలో చోటుండదు. ప్రజాస్వామ్యం, లౌకిక విలువలకు తావుండదు. వీటిని ధ్వసం చేయటమే ప్రస్తుతం బీజేపీ కర్తవ్యంగా ఉంది. ఈ నేపథ్యంలో అంబేద్కర్ ఆలోచనలను, రాజ్యాగ విలువలను రక్షించుకునేందుకు కృషి చేయాల్సిన బాధ్యత ఉంది.

విద్యాలయాల అప్పులు విద్యార్థులకు తిప్పలు

(మొదటిపేజీ తరువాయి)

ర్యాలీలతో క్యాంపస్‌ను హోరెత్తించారు. ఫీజుల పెంపుపై యాజమాన్యం తీరు గురించి సోషల్ మీడియాలో తీవ్ర ప్రచారం చేశారు. పెంచిన ఫీజులను విద్యాసంస్థ వెనక్కి తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. అయితే, విద్యార్థుల నిరసనలకు స్పందించామని చెప్పుకోవడానికి యాజమాన్యం ఆగస్టు మొదటి వారంలో కేవలం మెస్ ఫీజులను తగ్గించింది. అయితే, ఈ మెస్ ఫీజుల తగ్గింపుతో తమకు ఒరిగేది ఏమీ ఉండదనీ, పెంచిన సెమిస్టర్, ఇతర ఫీజులను తగ్గించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సంస్థ యాజమాన్యం ఫీజులను పెంచే నిర్ణయం ఏమాత్రమూ సరికాదని, ఇది తమ లాంటి విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, హెచ్ఈఎఫ్ఏ ఏర్పాటే సరికాదని కొందరు విద్యావేత్తలు, నిపుణులు వాదించారు. దీని ఏర్పాటుతో కేంద్రం విద్యాసంస్థల కార్యకలాపాల్లోకి చొరబడేయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ఇందుకు ఐఐటీ బాంబేనే ఒక ఉదాహరణ అంటూ వారు తెలిపారు. దేశంలోని పలు ప్రతిష్టాత్మక ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఇవే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ముఖ్యంగా, ప్రభుత్వ విద్యాసంస్థలకు వచ్చేవారిలో అధికంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఆర్థికంగా వెనబడిన వర్గాల విద్యార్థులే ఉంటారనీ, యూనివర్సిటీల రుణాల భారం వారిపైనే పడుతున్నదని విద్యావేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రలోని మోడీ సర్కారు ఇలాంటి నిర్ణయాలను వెనక్కి తీసుకొని, విద్యార్థులపై భారం పడకుండా చూడాలని వారు కోరుతున్నారు.

మోకాలి గాయంతోనే..!

- ఐపీఎల్‌లో ఆడుతున్న ఎం.ఎస్ ధోని
- సూపర్‌కింగ్స్ కోచ్ ఫ్లెమింగ్ వెల్లడి



చెన్నై : వికెట్ల మధ్య పరుగులో ఎం.ఎస్ ధోని అత్యుత్తమం. డెత్ ఓవర్లలో ఆ వేగం అందుకోవటం నాన్‌స్ట్రయికర్‌కు కష్టంతో కూడుకున్న పని. రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో ధోని పరుగుపై వ్యాఖ్యాత మాథ్యూ హెడెన్ సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. రెండు సిక్సర్లతో మ్యాచ్‌ను చివరి బంతి వరకు తీసుకొచ్చిన ధోని.. మూడో బంతికి సింగిల్‌తో జడేజాకు స్ట్రయిక్ ఇచ్చాడు. నిజానికి ధోని ఇక్కడ రెండు పరుగులు తీసుకునేవాడు. కానీ, ఆ పని చేయలేదు. అందుకు గల కారణాన్ని సూపర్‌కింగ్స్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మ్యాచ్ అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వెల్లడించాడు. ' ధోని మోకాలి నొప్పితో బాధపడుతున్నాడు. ఆ సంగతి అతడి కదలికల్లో గమనించవచ్చు. మోకాలి నొప్పితో అతడు పరుగు తీసేందుకు ఇబ్బంది పడుతున్నాడు. అయినా, రాయల్స్‌తో మ్యాచ్‌లో ధోని గొప్ప ప్రదర్శన చేశాడు. అతడి ఫిట్‌నెస్ స్థాయి ఎల్లప్పుడూ ప్రొఫెషనల్' అని ఫ్లెమింగ్ కితాబిచ్చాడు.

బెన్ స్టోక్స్, దీపక్ చాహర్, శిసింద మంగళ.. ఇలా వరుసగా ఆటగాళ్లు గాయాలతో బెంచ్‌కు పరిమితం కావటం చెన్నై సూపర్‌కింగ్స్ యాజమాన్యానికి ఆందోళన కలిగిస్తోంది. గాయాలతో ఒక్కొరెండు వారాలు ఆటకు దూరం కానున్న ఆటగాళ్లు తుది జట్టుకు ఎంపిక దూరమవుతున్నారు. ఈ సమయంలో ఉత్తమ జట్టును ఎంపిక చేయటం సూపర్‌కింగ్స్‌కు కత్తి మీద సాముగా మారింది.

ఎదురులేని టైటాన్స్

- పంజాబ్‌పై గుజరాత్ గెలుపు
- ఛేదనలో రాణించిన శుభ్‌మన్



నవతెలంగాణ-మొహాలి

ఛేదనలో తనకు తిరుగులేదని గుజరాత్ టైటాన్స్ మరోసారి నిరూపించింది. లక్ష్యాలను ఛేదిస్తూ ఈ సీజన్లో వరుసగా మూడో విజయం నమోదు చేసింది. గురువారం మొహాలిలో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. 154 పరుగుల ఛేదనలో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (67, 49 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీతో రాణించాడు. సాయి సుదర్శన్ (19), హార్దిక్ పాండ్య (8) వికెట్లతో గుజరాత్ టైటాన్స్‌పై పంజాబ్ కింగ్స్ ఒత్తిడి పెంచినా.. డెవిడ్ మిల్లర్ (17 నాటౌట్, 18 బంతుల్లో 1 ఫోర్), గిల్ టైటాన్స్‌ను విజయానికి చేరువ చేశారు. ఆఖరు ఓవర్లో శామ్ కరణ్ సూపర్ బంతితో గిల్‌ను బోల్తా కొట్టించి ఉత్కంఠకు తెరతీశాడు. రాహుల్ తెవాటియ (5 నాటౌట్) ఫైన్ లెగ్ దిశగా బౌండరీతో ఉత్కంఠకు తెరదించాడు. మరో బంతి ఉండగానే టైటాన్స్‌ను విజేతగా నిలిపాడు.అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ తడబాటుకు గురైంది.. టైటాన్స్ బౌలర్లు సమిష్టిగా మెరవటంతో పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 153 పరుగులే చేసింది. మాథ్యూ షార్ట్ (36, 24 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్‌తో కదం తొక్కగా.. భానుక రాజపక్స (20, 26 బంతుల్లో 1 ఫోర్), జితేశ్ శర్మ (25, 23 బంతుల్లో 5 ఫోర్లు) మిడిల్ ఓవర్లలో వేగంగా ఆడలేదు. షారుక్ ఖాన్ (22, 9 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్) చివర్లో మెరుపు సిక్సర్లతో పంజాబ్ కింగ్స్‌కు 153 పరుగుల స్కోరు అందించాడు. 2020 అనంతరం తొలిసారి ఐపీఎల్‌లో ఆడుతున్న మోహిత్ శర్మ టైటాన్స్ తరఫున (2/18) గొప్పగా బౌలింగ్ చేశాడు.

టైటాన్స్ బౌలర్ల జోరు : టాస్ నెగ్గిన గుజరాత్ టైటాన్స్ ఛేదనకు మొగ్గుచూపింది. సొంతగడ్డపై తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన పంజాబ్ కింగ్స్‌కు తొలి ఓవర్లోనే మహ్మద్ షమి షాక్ ఇచ్చాడు. ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ (0)ను డకౌట్ చేశాడు. కెప్టెన్ శిఖర్ ధావన్ (8)ను లిటిల్ వెనక్కి పంపటంతో పవర్‌ప్లేలో పంజాబ్ ఓపెనర్లను కోల్పోయింది. మాథ్యూ షార్ట్ (36) ఎదురుదాడితో పంజాబ్‌ను మళ్లీ రేసులోకి తెచ్చాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్ బాదిన మాథ్యూ.. రన్‌రేట్‌ను ముందుకు నడిపించాడు. కానీ షార్ట్ నిష్క్రమణతో పంజాబ్ కథ మొదటికొచ్చింది. నం.4 బ్యాటర్ భానుక రాజపక్స (20) పంజాబ్‌ను వెనక్కి నెట్టాడు. బౌండరీలు కొట్టలేకపోయిన రాజపక్స.. స్ట్రయిక్ సైతం రొటేట్ చేయలేదు. దీనికి తోడు మిడిల్ ఆర్డర్‌లో మోహిత్ శర్మ గొప్ప లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు సంధించాడు. జితేశ్ శర్మ (25), శామ్ కరణ్ (22) పోరాడినా.. దూకుడుగా పరుగులు సాధించలేకపోయారు. చివర్లో షారుక్ ఖాన్ మెరుపులతో పంజాబ్ గౌరవప్రద స్కోరు సాధించింది. రషీద్ ఖాన్ (1/26), జోశ్ లిటిల్ (1/31) రాణించారు.

స్కోరు వివరాలు :

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్ : 153/8 (మాథ్యూ షార్ట్ 36, జితేశ్ శర్మ 25, షారుక్ ఖాన్ 22, మోహిత్ శర్మ 2/18)

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్ : 154/4 (శుభ్‌మన్ గిల్ 67, సాహా 30, హర్‌ప్రీత్ బరార్ 1/20, శామ్ కరణ్ 1/25)

అంపైర్ల నిర్ణయాలు గందరగోళం

- బంతి మార్పుపై అశ్విన్ విమర్శలు
- 25 శాతం జరిమానా విధించిన రిఫరీ



చెన్నై : రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌లో అంపైర్ల నిర్ణయాలపై రాయల్స్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు గుప్పించారు. చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్ మధ్యలో మంచు కారణంగా బంతి తడిగా ఉందనే కారణంతో అంపైర్లు మరో బంతిని తీసుకున్నారు. దీనిపై అశ్విన్ తీవ్ర అభ్యంతరం తెలిపాడు. ఫీల్డింగ్ జట్టు ఫిర్యాదు చేయకుండా అంపైర్లు బంతి మార్చటం గందరగోళంలో పడేసిందని విమర్శించాడు. ' అంపైర్లు తమంతట తామే బంతిని మార్చటం ఆశ్చర్యానికి గురి చేసింది. ఇది గతంలో ఎన్నడూ జరుగలేదు. ఆ నిర్ణయం నన్ను గందరగోళంలో పడేసింది. అది మంచికైనా, చెడుకైనా కొంచెంత సమతుల్యత అవసరం. బౌలింగ్ జట్టు నుంచి బంతిపై ఏ ఫిర్యాదు లేదు. అంపైర్లు తమకు తాముగా బంతిని మార్చారు. బంతిని ఎందుకు మార్చారని అడుగగా.. మేము (అంపైర్లు) మార్చవచ్చని బదులిచ్చారు. అయితే, ప్రతి మ్యాచ్‌లో మంచు కురిసిన ప్రతిసారి బంతిని మార్చాలి. ఐపీఎల్‌లో ప్రతి మ్యాచ్‌కు ఇది వర్తించాలి. అంపైర్లు ఏదైనా చేయవచ్చు కానీ అది ప్రామాణికంగా ఉండాలని' అశ్విన్ అన్నాడు. కాగా, ఐపీఎల్, ఐసీసీ నిబంధనల ప్రకారం అంపైర్లకు బంతిని మార్పు చేసే అధికారం ఉంటుంది.

ఇక మ్యాచ్‌లో జరిగిన సంఘటనలపై అధికారులను, ఆటగాళ్లను, ఇతరులపై బహిరంగ విమర్శలు చేసినందుకు రవిచంద్రన్ అశ్విన్‌కు మ్యాచ్ రిఫరీ జరిమానా విధించాడు. మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించారు. రిఫరీ జరిమానాను అశ్విన్ అంగీకరించాడు. దీంతో ఈ విషయంలో ఎటువంటి అప్పీల్‌కు అవకాశం ఉండదు.

రైడర్స్‌తో రైజర్స్ ఢీ

- కోల్‌కత, హైదరాబాద్ పోరు నేడు
- ఆరెంజ్ ఆర్మీకి మరో కఠిన సవాల్



రసెల్‌ను ఆపగలరా..! : సన్‌రైజర్స్ కోచ్ లారాతో ఆండ్రీ రసెల్

నవతెలంగాణ-కోల్‌కత

రెండు మ్యాచులు.. రెండు 200 ప్లస్ స్కోర్లు. ఓ మ్యాచ్‌లో ఆ స్కోరు కాపాడుకుంటే.. మరో మ్యాచ్‌లో ఛేదించారు. సీజన్ తొలి మ్యాచ్ వైఫల్యం అనంతరం కోల్‌కత నైట్‌రైడర్స్ శిబిరంలో నైరాశ్యం ఆవహించగా.. నెగ్గిన రెండు మ్యాచుల్లోనూ అనూహ్య ప్రదర్శనలు నమోదయ్యాయి. శార్దుల్ ఠాకూర్ మెరుపులే అద్భుతం అనుకుంటే.. రింకూ సింగ్ అద్భుతానికి మించిన ప్రదర్శన చేశాడు. అతడి సంచలన ముగింపు క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించింది. మరోవైపు, తొలి రెండు మ్యాచుల్లో పేలవ ప్రదర్శనతో పరాజయాలు చవిచూసిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. మూడో మ్యాచ్‌లో మెరిసింది. బౌలర్లు అదరగొట్టడంతో తొలి విజయం ఖాతాలో వేసుకుంది. అటు కోల్‌కత, ఇటు హైదరాబాద్ విజయోత్సాహంలో కనిపిస్తున్నాయి. అసమాన ప్రదర్శనలతో కోల్‌కత జోరుమీదుంది. సఫారీ క్రికెటర్ల చేరితో సన్‌రైజర్స్ శిబిరం సైతం ఉత్సాహంగా కనిపిస్తుంది. దీంతో నేడు రైడర్స్, రైజర్స్ పోరులో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి.

ఆ ఇద్దరు కీలకం! : పంజాబ్ కింగ్స్‌తో స్వల్ప లక్ష్యాన్ని సన్‌రైజర్స్ ఛేదించింది. కానీ టాప్ ఆర్డర్ నుంచి ఆశించిన దూకుడు కనిపించలేదు. మూడు మ్యాచుల్లో మూడు ఓపెనింగ్ కాంబినేషన్లను ప్రయోగించిన సన్‌రైజర్స్ నేడు ఏం చేస్తుందో ఆసక్తికరం. ఇంగ్లాండ్ యువ కెరటం హ్యారీ బ్రూక్, కెప్టెన్ ఎడెన్ మార్క్‌రామ్‌లు హైదరాబాద్‌కు అత్యంత కీలకం. ధనాధన్ క్రికెట్ ఆడటంలో బ్రూక్ దిట్ట. కానీ భారత పిచ్‌లపై అతడు లయ అందుకోలేకపోతున్నాడు. బ్రూక్ ఫామ్‌లోకి వస్తే సన్‌రైజర్స్ బ్యాటింగ్ కష్టాలు తీరినట్టే. కెప్టెన్ ఎడెన్ మార్క్‌రామ్ పంజాబ్‌తో మ్యాచ్‌లో ఆకట్టుకున్నాడు. రాహుల్ త్రిపాఠికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో చూడచక్కని బౌండరీలతో అలరించాడు. మయాంక్ అగర్వాల్, వాషింగ్టన్ సుందర్, భువనేశ్వర్ కుమార్‌లు అంచనాలను అందుకోవటం లేదు. స్పిన్నర్ మయాంక్ మార్కండె పంజాబ్‌పై నాలుగు వికెట్లు పడగొట్టాడు. నేడు నైట్‌రైడర్స్‌తో మ్యాచ్‌లోనూ మార్కండె మాయజాలంపై ఆరెంజ్ ఆర్మీ భారీ ఆశలు పెట్టుకుంది. మార్కో జాన్సెన్, నటరాజన్ కొత్త బంతితో కీలకం కానున్నారు. హెన్రిచ్ క్లాసెన్‌ను తుది జట్టులోకి తీసుకోవటంతో బ్యాటింగ్ లైనప్ మరింత బలోపేతం కానుంది.



ఇక మొదలెడదామా.. !: ప్రాక్టీస్‌లో మార్క్‌రామ్, బ్రూక్ చిట్‌చాట్

ఐపీఎల్‌లో నేడు
హైదరాబాద్ X కోల్‌కత
వేదిక : కోల్‌కత, సమయం : రా: 7.30
స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రసారం

ఎదురుందా? : రెండు వరుస సంచలన విజయాల ఊపులో ఉన్న కోల్‌కత నైట్‌రైడర్స్‌ను నిలువరించటం హైదరాబాద్ సన్‌రైజర్స్‌కు కఠిన సవాల్. కీలక ఆటగాళ్లు తేలిపోతున్నా.. జట్టులోని ఇతర ఆటగాళ్లు అసాధారణ ప్రదర్శనలతో రెచ్చిపోవటంతో నైట్‌రైడర్స్‌కు ఎదురులేకుండా పోయింది!. ఆ ప్రదర్శనల స్ఫూర్తి ఇతర ఆటగాళ్లలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. సొంతగడ్డపై ఆడుతున్న అదనపు అనుకూలత కోల్‌కతకు ఉంది. వెంకటేశ్ అయ్యర్, రెహ్మనుల్లా గుర్బాజ్, నితీశ్ రానా ఫామ్‌లో ఉన్నారు. ఆండ్రీ రసెల్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉంది. శార్దుల్ ఠాకూర్, రింకూ సింగ్‌లు ప్రత్యర్థుల ప్రణాళికల్లో ఇక నుంచి కీలకం కానున్నారు. సునీల్ నరైన్, ఫెర్గుసన్, వరుణ్ చక్రవర్తికి తోడు మిస్టరీ స్పిన్నర్ సుయాశ్ శర్మ బౌలింగ్ విభాగాన్ని నడిపించనున్నారు.

జాతీయ పోటీలకు ధన్వాడ రెజ్లర్లు



హైదరాబాద్ : ఇటీవల హైదరాబాద్‌లోని యాకత్‌పురాలో తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో ధన్వాడ గిరిజన బిడ్డలు సత్తా చాటారు. బాలికల 49 కిలోల విభాగంలో గీత, బాలికల 57 కిలోల విభాగంలో నాగలక్ష్మి బంగారు పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరిసి ఏప్రిల్ 16-18న ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో జరిగే జాతీయ రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన ధన్వాడ గిరిజన బిడ్డలను మాజీ మంత్రి డి.కె అరుణ అభినందించారు. జాతీయ పోటీలకు వెళ్లేందుకు గీత, నాగలక్ష్మీలకు ఈ సందర్భంగా అవసరమైన సహాయం అందజేశారు.

నవచిత్రం

మంచి కథతో నాతో నేను



రచయిత విజయేంద్రప్రసాద్‌తో 'నాతో నేను' చిత్ర బృందం

సాయికుమార్, శ్రీనివాస్ సాయి, ఆదిత్య ఓం, దీపాలి రాజపుత్, ఐశ్వర్య రాజీవ్ కనకాల కీలక పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'నాతో నేను'. శాంతి కుమార్ తూర్లపాటి (జబర్దస్త్ ఫేం) దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రాజ్యసభ సభ్యులు, రచయిత విజయేంద్రప్రసాద్ ఇటీవల ఫిల్మ్ ఛాంబర్‌లో విడుదల చేశారు. "టైటిల్ బావుంది. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీలా అనిపిస్తుంది. కొత్త నిర్మాతలు చేస్తున్న ఈ ప్రయత్నం చక్కని విజయం సాధించాలి' ఆయన చెప్పారు.

సాయికుమార్ మాట్లాడుతూ, "మంచి కథతో శాంతికుమార్ ఈ చిత్రం చేస్తున్నారు. ఇందులో నేను భాగం కావడం ఆనందంగా ఉంది' అని అన్నారు. 'ఓ మంచి కథ రాసి మొదట నిర్మాతల్ని వెతుక్కున్నాను. నా కథ నచ్చి వెంటనే అంగీకరించారు. నా తొలి ప్రయత్నానికి సాయికుమార్ అండగా ఉన్నారు. చక్కని సలహాలు, సూచనలు అందిస్తున్నారు. రాసిన కథని, చక్కగా తెరపై చూపిస్తానని, ఆ దిశగా కృషి చేస్తున్నాను' అని దర్శకుడు శాంతికుమార్ అన్నారు. నిర్మాత మాట్లాడుతూ, 'దర్శకుడు చెప్పిన కథనచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. బిజీగా ఉండి కూడా మా ఆహ్వానం మేరకు విచ్చేసిన విజయేంద్రప్రసాద్‌కి కృతజ్ఞతలు. ప్రేక్షకులకు మంచి సినిమా చూపించబోతున్నాం' అని తెలిపారు.సమీర్, సి.వి.ఎల్ నరసింహారావు, గౌతమ్ రాజు ఎమ్మెస్ చౌదరి, భద్రం, సుమన్ శెట్టి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: యూహ్, మురళి మోహన్ రెడ్డి, సంగీతం: సత్య కశ్యప్, బ్యాక్‌గ్రౌండ్ : ఎస్ చిన్న, ఎడిటింగ్: నందమూరి హరి, ఆర్ట్: పెద్దిరాజు అడ్డాల, పాటలు: రామజోగయ్య శాస్త్రి, శాంతికుమార్, కొరియోగ్రాఫర్: భాను, చంద్ర కిరణ్, ఫైట్స్: నందు, సమర్పణ: ఎల్లలు బాబు టంగుటూరి.


9 పాటలతో ఫేమస్..

'రైటర్ పద్మభూషణ్' విజయం తర్వాత లహరి ఫిల్మ్స్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ కలిసి చేస్తున్న మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ 'మేమ్ ఫేమస్'. సుమంత్ ప్రభాస్ ప్రధాన పాత్ర పోషించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. మణి ఏగుర్ల, మౌర్య చౌదరి, సార్య , సిరి రాసి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర బృందం నేటి (శుక్రవారం) నుంచి మ్యూజికల్ జర్నీ ప్రారంభించనుంది. ఇందులో భాగంగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ని విడుదల చేయనున్నారు. రైటర్ పద్మభూషణ్‌కి అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించిన కళ్యాణ్ నాయక్ ఈ సినిమా కోసం 9 పాటలను కంపోజ్ చేశారు. కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ ఒక్కో పాటను పాడగా, గాయని మంగ్లీ మరో పాటని ఆలపించారు. మిగిలిన పాటలను ప్రముఖ సింగర్స్ పాడారు. ఫేమస్ సింగర్స్ పాడిన మేమ్ ఫేమస్ ఆల్బమ్ చార్ట్‌బస్టర్‌గా మారబోతోంది. ఈ చిత్రం ఫస్ట్ సింగిల్ 'అయ్యయ్యో..' పాటని నేడు విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు మేకర్స్.



సుమంత్ ప్రభాస్, సార్య

బ్రేకప్ అయినా హ్యాపీనే..



అఖిల్

అఖిల్ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'ఏజెంట్'. ఈనెల 28న బిగ్ స్క్రీన్స్ పైకి రానుంది. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొల్పింది. అలాగే టీజర్ నేషనల్‌వైడ్ ట్రెండ్ అవ్వగా, ఇప్పటికే విడుదలైన పాటలు కూడా మ్యూజిక్ చార్ట్‌లలో అగ్రస్థానంలో ఉన్నాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి బాయ్స్ సెలబ్రేట్ చేసుకునే బ్రేక్-అప్ సాంగ్ 'రామా కృష్ణ' పాటని విడుదల చేశారు. ఇది బ్రేక్-అప్ సాంగ్ అయినప్పటికీ, హీరో జీవితాన్ని బ్రేకప్ ప్రభావితం చేయలేదని చాలా ఆసక్తికరంగా వినోదాత్మకంగా చెప్పారు. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటకు హిప్ హాప్ తమిళ పెప్పీ నంబర్‌ని స్కోర్ చేయగా, రామ్ మిర్యాల ఈ పాటని ఎనర్జిటిక్‌గా పాడారు. అఖిల్ ఒక సాధువులా కాషాయ దుస్తులతో కనిపించడం సర్‌ప్రైజింగ్‌గా ఉంది. కలర్‌ఫుల్ సెట్‌లో చిత్రీకరించిన పాటలో సాక్షి వైద్య కూడా కాషాయం ధరించి మెరిసింది. దీనికి శేఖర్ మాస్టర్ అద్భుతమైన కొరియోగ్రఫీ అందించారు. ఈ పాట అందర్నీ అలరిస్తోంది.

అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు

జీఏ2 పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న కొత్త సినిమా 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'. బన్నీ వాసు, దర్శకుడు వెంకటేష్ మహా ఈ సినిమాను ప్రెజెంట్ చేస్తున్నారు. 'భలే భలే మగాడివోయ్, గీత గోవిందం, టాక్సీవాలా, ప్రతిరోజూ పండగే, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, 18 పేజెస్' లాంటి అద్భుతమైన చిత్రాల తర్వాత జీఏ 2 పిక్చర్స్ బ్యానర్లో వస్తున్న సినిమా ఇది. సుహాస్ హీరోగా చేస్తున్న ఈ మూవీ షూటింగ్ పనులను ముగించుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతుంది. జీఏ2 పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్మెంట్స్, వెంకటేశ్ మహా నిర్మాణంలో దుశ్యంత్ కటికనేనిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ధీరజ్ మొగిలినేని ఈ సినిమాను నిర్మించారు.



గోపరాజు రమణ, సుహాస్, జగదీశ్

మ్యారేజ్ బ్యాండ్‌లో పనిచేసే మల్లి అనే కుర్రాడిగా సుహాస్ ఈ సినిమాలో నటిస్తున్నాడు. తాజాగా చిత్ర యూనిట్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.రిలీజ్ చేసిన పోస్టర్‌లో మల్లికార్జున సెలూన్ షాప్‌ను చూపిస్తూ, సెలూన్ షాప్ ముందు 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' మెంబర్స్‌ను రివీల్ చేసారు. సుహాస్‌తో పాటు గోపరాజు రమణ, పుష్ప ఫేమ్ జగదీశ్ డప్పులు, సన్నాయితో పాటు పలురకమైన మంగళవాయిద్యాలతో ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. సినిమాకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్‌ను త్వరలో అధికారికంగా ప్రకటించనుంది చిత్ర బృందం.ఈ చిత్రానికి దర్శకుడు: దుష్యంత్ కటికనేని, డివోపి : వాజిద్ బేగ్, సంగీతం: శేఖర్ చంద్ర, ఎడిటర్: కోదాటి పవన్ కళ్యాణ్, కళ: ఆశిష్ తేజ పుల్లల్లా.

మెప్పించే యమ డ్రామా

సోసియో ఫాంటసీ థ్రిల్లర్ సినిమాలు ట్రెండ్‌తో నిమిత్తం లేకుండా ఎప్పుడొచ్చినా ప్రేక్షకుల ఆదరణ చూరగొన్నాయి. అలాగే యముడిని సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ చేసుకుని రూపొందిన సినిమాలు సైతం ఎంతగానో అలరించాయి. ఇప్పుడు ఆ కోవలోనే 'యమ డ్రామా' చిత్రాన్ని మలచడం విజయానికి సంకేతమని తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కె.ఎల్.దామోదర ప్రసాద్, నిర్మాత డి.ఎస్.రావు అన్నారు ఫిల్మీ మెజీషియన్స్ పతాకంపై యువచంద్ర, శివకుమార్, కౌటిల్య, సుదర్శన్ రెడ్డి హీరోలుగా, ప్రియాంక శర్మ (సవారి ఫేమ్), నేహాదేశ్ పాండే, హమీద హీరోయిన్లుగా నటించారు. టి.హర్షచౌదరి దర్శకత్వంలో తోటకూర శివరామకృష్ణారావు నిర్మించిన ఈ సినిమా విడుదలకు సన్నద్ధమవుతోంది. ఈ సినిమాలోని 'నిను చూసినాకనే...' అనే మొదటి పాటకు కరుణాకర్ సాహిత్యం అందించగా, సునీల్ కశ్యప్ బాణీలు సమకూర్చారు. ఈ వీడియో సాంగ్‌ను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కె.ఎల్.దామోదర ప్రసాద్ విడుదల చేశారు.



ప్రియాంక శర్మ

ఈ సందర్భంగా దర్శకుడు టి.హర్షచౌదరి మాట్లాడుతూ, 'సాయికుమార్ మొదటి సారి ఈ సినిమాలో యముడి పాత్రలో నటించడం ఓ హైలైట్. మంచి వినోదం, భావోద్వేగాలను రంగరించి, ఆద్యంతం ఆకట్టుకునేలా రూపొందించిన ఈ సినిమాలో యూత్‌కు ఓ మంచి సందేశం కూడా ఉంది. ఫ్యామిలీస్, ఫ్రెండ్స్, లవర్స్ వంటి అన్ని వర్గాల వారు మెచ్చేలా దీనిని మలిచాం' అని చెప్పారు. 'అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమాను ఇదే నెలలో విడుదల చేస్తాం' అని తెలిపారు.

లవర్స్ ఫీలింగ్స్‌తో తు..మేరా పాట

దర్శకుడు కె దశరథ్ అందిస్తున్న కథతో తెరకెక్కుతున్న చిత్రం 'లవ్ యూ రామ్'. ఈ చిత్రానికి డివై చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు. డివై చౌదరి, కె దశరథ్ కలిసి మన ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ చక్ర ఫిలింస్ బ్యానర్‌లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ జంటగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్ వీడియోతో పాటు 'ఉండా లని ఉందీ నీతో' పాటకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి 'తు మేరా' పాటని విడుదల చేశారు. కె వేద ఈ పాటని బ్యుటీఫుల్ మెలోడీగా కంపోజ్ చేయగా, లిప్సిక మరింత అందంగా ఆలపించారు. సరస్వతి కార్తీక అందించిన సాహిత్యం కథానాయికల మనసులోని ఫీలింగ్స్‌ని లవ్లీగా ప్రజంట్ చేసింది. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్‌ల కెమిస్ట్రీ చూడముచ్చటగా ఉంది. ఈ చిత్రానికి సుధాకర్ బొర్రా (టేనస్సీ), డి నాగేశ్వర్‌రావు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.



జాడలేని వన్‌ధన్ స్కీం

అటకెక్కిన అటవీ ఉత్పత్తుల కొనుగోలు

- చేతులెత్తేసిన కేంద్ర ప్రభుత్వం
- కష్టపడి సేకరించినా.. కొనేవారేరి?
- దళారుల చేతిలో మోసపోతున్న గిరిజనులు



నవతెలంగాణ-నసురుల్లాబాద్

అటవీ ఉత్పత్తులు సేకరించి పొట్ట పోసుకునే జీవితాలు నేడు దుర్భరంగా మారాయి. అటవీ ఉత్పత్తులను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకుండా చేతులెత్తేయడంతో అటవీ ఉత్పత్తుల సేకరణ తప్ప మరో పని తెలీని గిరిజనులు, కూలీలు కుటుంబపోషణ భారంగా మారింది. దాంతో దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా దళారులు సగానికి సగం ధర చెల్లిస్తూ నిలువునా దోచుకుంటున్నారు. దాంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జన్ ధన్ యోజన పథకం నీరుగారిపోయింది.

పొట్ట కోసం 'లక్క' తిప్పలు..

అటవీ ఉత్పత్తుల సేకరణ, సేకరించిన ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు తీసుకొచ్చిన వన్ ధన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. మూడేండ్ల నుంచి పథకాన్ని అమలు చేయకుండా నిలుపుదల చేసింది. ఉత్పత్తులను సేకరించేవారు లేక కొనుగోలు చేయక పోవడంతో గిరిజనులు దళారులను ఆశ్రయిస్తున్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నుంచి బోధన్ వెళ్లే రహదారి పక్కనున్న పెద్ద పెద్ద చెట్ల నుంచి గిరిజనులు లక్కను సేకరిస్తుంటారు. బాన్సువాడ, నసురుల్లాబాద్ మండల అటవీ ప్రాంతంలో ఎండిపోయిన చెట్ల నుంచి కొన్నేండ్లుగా రైతుకూలీలు లక్కను సేకరిస్తున్నారు. లక్క ఉత్పత్తులను సేకరించడం అంత సులువైందేమీ కాదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. అంత కష్టపడి లక్కను సేకరించినా దక్కేది మాత్రం అంతంతే. ఇతర రాష్ట్రాల్లో లక్క కేజీ రూ.800 నుంచి రూ.1000 ఉండగా మన రాష్ట్రంలో దళారులు కేజీ లక్కకు రూ. 200 నుంచి రూ.300 మాత్రమే చెలిస్తున్నారు. లక్కను ప్రభుత్వం కొనుగోలు చేస్తే రూ.800 వస్తాయని కూలీలు చెబుతున్నారు. మహారాష్ట్ర, కర్నాటక, ఒడిశా, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి లక్కను కొనుగోలు చేస్తుంటారు.

లక్కతో ఉపయోగాలు

మనం వాడే మాత్రలు ఎక్స్‌పెయిరీ డేట్‌లోగా పాడవకుండా, ఫంగస్ ఏర్పడ కుండా కాపాడటంలో లక్క పూత కీలకం. నాణ్యమైన లక్కను మాత్రలపై పూతగా వేస్తారు. కొన్ని దేశాల్లో ఆహారపదార్థాలను ఎక్కువ కాలం నిల్వ ఉంచి తింటారు. అవి పాడవకుండా లక్క రంగు కలిపి పూత వేస్తారు. గోళ్ల రంగు, బూటు పాలిష్‌లోనూ వాడతారు. సిల్క్ వస్త్రాల తయారీ లోనూ లక్క వినియోగిస్తారు. రెడీమేడ్ బంగారు ఆభరణాలు, బాడీ స్ప్రేల్లోనూ వినియోగిస్తున్నారు.

వ్యవసాయం లేక లక్క సేకరణ

వివిధ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ కూలీలకు వ్యవసాయం పనులు లేకపోవడంతో వారూ లక్కను సేకరిస్తున్నారు. అటవీ ప్రాంతంలో లభించే ఆటవీ సంపదతతో రైతు కూలీలకు ఉపాధి లభిస్తుంది. గతంలో అటవీ సంపదపై వారికి అవగాహన కల్పిస్తూ, వారు సేకరించిన అటవీ సంపదను ప్రభుత్వమే ఐకేపీ ద్వారా కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించేది. దాంతో గిరిజన, గ్రామీణ ప్రాంతాల వాసులు గానుగ, వేప, ఇప్ప గింజలు, ఇప్ప పువ్వు, రబ్బరును సేకరించి ఉపాధి పొందారు. కాగా, మూడేండ్లుగా రైతుకూలీలు సేకరించిన అటవీ ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయడం నిలిపేసింది. దాంతో దళారులను ఆశ్రయించి వారు చెప్పిన ధరకు అమ్ముకుంటున్నామని కూలీలు ఆవేదన చెందుతున్నారు.

కష్టపడి లక్క సేకరిస్తున్నం



మేము కొన్నేండ్లుగా లక్క సేకరిస్తున్నం. సేకరించిన లక్కకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నాం. గతంలో బాన్సువాడలో కొనుగోలు కేంద్రాలు ఉండేవి. ఇప్పుడు అవి లేకపోవడంతో దళారులే కొంటున్నారు. కిలోకు రూ.150 మాత్రమే ఇస్తున్నారు. వారు శుద్ధి చేసి తులాల చొప్పున విక్రయించి లాభం పొందుతున్నారు. ప్రభుత్వమే లక్కను కొనుగోలు చేస్తే మాకు ఉపాధి లభిస్తుంది.

- కడవాత్ అశోక్. మొగులన్‌పల్లి, బాన్సువాడ.

ఔషధ మొక్కలపై చిన్నచూపా..?

గ్రామీణ ప్రాంతాల్లో పెరటి తోటలో, ఇంటి ఆవరణంలో ఔషధ గుణాలు కలిగిన మొక్కలు పెంచినా కొనే వారు ఎక్కడ అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఔషధ మొక్కల కొనుగోలు చేయడానికి జిల్లాస్థాయిలో ప్రత్యేక మార్కెట్లు ఉన్నాయి. జిల్లాలో మాత్రం ఔషధ మొక్కలు కొనే వారే కరువయ్యారు. ఇంటి వద్ద కలబంద, వేపగింజలు, నేల ఉసిరి, తెల్ల ఆముదం, కానుగ, గన్నేరు, గోరింట, తంగేడు, తురక వేప, సరస్వతి ఆకు, తదితర ఔషధ గుణలు ఉన్న మొక్కలు పెంచినా కొందరికి వాటి విలువ తెలియక కత్తిరించి పారేస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో అధికంగా అటవీ ప్రాంతం ఉంది. ఇక్కడ కానుగ, వేప, ఉసిరి, చింత, నేరేడు, లక్క, మారేడు, కర క్కాయ, తానికాయ తదితర అటవీ ఉత్పత్తులు లభిస్తాయి.

పరిహారమివ్వాలని ఎంపీడీఓ కార్యాలయానికి తాళం

- లప్పనాయక్ తండావాసుల ధర్నా



నవతెలంగాణ -యాదగిరిగుట్ట రూరల్

తమకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లప్పనాయక్ తండా వాసులు గురువారం యాదగిరిగుట్ట మండల సర్వసభ్య సమావేశం జరుగుతుండగా ఎంపీడీఓ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. సమావేశం ప్రారంభమైనప్పుడు తండా సర్పంచ్ బుజ్జి శంకర్‌నాయక్ పోడియం ముందు కూర్చొని నిరసన తెలిపింది. అక్కడ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సర్పంచ్ బయటికి వచ్చిన తర్వాత గ్రామస్తులు కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పరిహారం, పునరావాసానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. 28 రోజులుగా బస్వాపూర్ రిజర్వాయర్ కట్టపై ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో 250 యూనిట్లను గుర్తించారని, అర్హులైన 50 యూనిట్లను చేర్చి మొత్తం 300 యూనిట్లకు ప్యాకేజీ, 205 ఎకరాల భూమికి నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాతరపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని 294 సర్వే నెంబర్‌లో లేఅవుట్ చేసి, మౌలిక సదుపాయలు కల్పించి ఇండ్ల స్థలాలు వెంటనే కేటాయించాలని కోరారు. గ్రామకంతం భూమి 8ఎకరాల 08 గుంటల్లో ప్లాట్ల కేటాయింపు, ఇండ్లకు పరిహారం ఒకే దఫాలో అందించాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు బస్వాపూర్ రిజర్వాయర్ కట్టపై ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ శోభన్ బాబు మాట్లాడుతూ.. అన్ని విషయాలపై ఉన్నతాధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు నిరసన విరమించారు. ఈ సమావేశంలో లపనాయక్ తండావాసులకు మద్దతు తెలుపుతూ తీర్మానం చేశారు. నిరసన, మండల సమావేశాల్లో ఎంపీపీ చీర శ్రీశైలం, జెడ్పీటీసీ తోటకూర అనురాధ, ఎంపీడీవో ప్రభాకర్ రెడ్డి, వైటీడీఏ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పురుషోత్తంరావు ఎంపీటీసీలు సర్పంచులు, లప్పనాయక్‌తండా ఉపసర్పంచ్ మంక్యా నాయక్, మోహన్, దసిరం నాయక్, బాధితులు పాల్గొన్నారు.

'భగీరథ' సిబ్బందికి జీతాలు వచ్చాయి..

- 'నవతెలంగాణ' కథనానికి స్పందన

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి


భగీరథలో బతుకు భారం

'మిషన్ భగీరథ' శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ల్యాబ్ సిబ్బందికి జీతాలు వచ్చాయి. అయితే, ఏడాదిగా జీతాలు రాక అవస్థలు పడ్డారు. ఎన్నిమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న సుమారు 400 మంది ఏడాది పొడవునా వేతనాలు రాక అప్పులపాలయ్యారు. వారి బాధలు వివరిస్తూ 'భగీరథ'లో బతుకు భారం అనే శీర్షికతో 'నవతెలంగాణ' పత్రిక మెయిన్ పేజీలో ఈనెల 7న కథనాన్ని ప్రచురించింది. దాంతో స్పందించిన ప్రభుత్వం మిషన్ భగీరథలోని ల్యాబ్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, తమ బాధలు పత్రికలో ప్రచురించిన 'నవ తెలంగాణ' యాజమాన్యానికి భగీరథ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా వాక్ ఫర్ సోషల్ జస్టిస్

- మనువాదానికి గోరీకడదాం..
- ఆర్థిక దోపిడీ.. సామాజిక అణచివేతపై జమిలి పోరాటం
- సీఐటీయూ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ పాదయాత్రలు



నవతెలంగాణ- విలేకరులు

దేశంలో సామాజిక న్యాయాన్ని కాపాడాలని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం వాక్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమాలు జరిగాయి. నిజామాబాద్, వికారాబాద్, భూపాలపల్లి జిల్లా మినహా మిగతా అన్ని జిల్లాల్లో పాదయాత్రలు నిర్వహించినట్టు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తెలిపారు.

మనువాదానికి గోరీకట్టేందుకు కార్మిక, కర్షకులు సంఘటితంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలో 10కె, వాక్ ఫర్ సోషల్ జస్టిస్ పాదయాత్ర నిర్వహించారు. కంది మండల కేంద్రం నుంచి సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వరకు మండుటెండల్ని సైతం లెక్క చేయకుండా కార్మికులు కదం తొక్కారు. కంది కేంద్రంలో చుక్క రాములు డాక్టర్ బీఆర్ అంబేదర్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఆయన పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించి నడిచారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి కాలం చెల్లిన మూడు వేల సంవత్సరాల నాటి మనువాదాన్ని రాజ్యాంగంగా గుర్తించేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు కుట్రలు చేస్తున్నామన్నారు. మతోన్మాదాన్ని అడ్డుకోకపోతే లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలకు తీవ్ర నష్టం వాటిల్లతుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లా కేంద్రాల్లో సామాజిక న్యాయ పాదయాత్రలు నిర్వహించారు.

ఖమ్మం నగరంలో ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి పాత కలెక్టరేట్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా నుంచి జలగం నగర్ వరకు పాదయాత్ర సాగింది.

కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కరీంనగర్‌లో కళాభారతి నుంచి కలెక్టరేట్ వరకు, సిరిసిల్ల జిల్లాలో ధార్మిక క్షేత్రమైన వేములవాడ నుంచి కార్మిక క్షేత్రం సిరిసిల్ల కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు.

10కె వాక్ ఫర్ సోషల్ జస్టిస్ నినాదంతో హనుమకొండ జిల్లా గోపాల్ పూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర కలెక్టరేట్ వరకు వందలాది మందితో సాగింది. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జనగామ జిల్లాలో రైల్వే స్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకు సామాజిక న్యాయ పాదయాత్ర కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవో మన్సూర్‌కు అందజేశారు. ములుగు జిల్లా తాడ్వాయ మండలం కాటాపూర్‌లో పాదయాత్ర నిర్వహించారు.



ఎన్నికలు ఒక్కటే ప్రజాస్వామ్యం కాదు

- పద్మశ్రీ, రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత ఆచార్య శాంతా సిన్హా

నవతెలంగాణ-కేయూ క్యాంపస్

ఎన్నికలు ఒక్కటే ప్రజాస్వామ్యం కాదని, నిరంతర జాతి నిర్మాణానికి కృషి జరగాలని పద్మశ్రీ, రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత ఆచార్య శాంతాసిన్హా అన్నారు. గురువారం కాకతీయ విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన ఆచార్య బి.జనార్ధన్‌రావు మెమోరియల్ ఫౌండేషన్ 21వ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు దూరవిద్యా కూడలిలో ఉన్న జనార్ధన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గొప్ప మేధావి ఆచార్య జనార్దన్‌రావు అని కొనియాడారు. ప్రభుత్వ పథకాల్లో అట్టడుగు వర్గాలకు న్యాయం చేకూరేందుకు పాటుపడ్డారని చెప్పారు. ప్రభుత్వ విధానాల్లో మార్పులు చట్ట సభల ద్వారా రాలేదని, ఉద్యమాల వల్ల వచ్చాయని అన్నారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే ఎన్నికల విధానం అత్యంత ఆందోళనకరం అన్నారు. యువత ప్రజాస్వామ్య పరిరక్షణ దిశగా అడుగులు వేయాలని కోరారు. విద్యార్థుల నుంచి నాయకులుగా రావాలన్నారు. ఆచార్య తాటికొండ రమేష్ మాట్లాడుతూ.. ప్రజలు, ఆదివాసీల సమస్యలు తెలిసిన వ్యక్తి జనార్ధన్‌రావు అని కొనియాడారు. అనంతరం ఆచార్య శాంతా సిన్హాను ఘనంగా సన్మానించారు. విశ్రాంత ఆచార్యులు ఆచార్య కె.మురళి మనోహర్, ఫౌండేషన్ సెక్రటరీ ఆచార్య ఇ.రేవతి, ఆచార్య నరేంద్ర బాబు, టి.బుచ్చిబాబు, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసీఆర్ ముందడుగుతోనే కేంద్రం వెనక్కి

- బయ్యారానికి మొండిచేయి
- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం
- వికారాబాద్‌కు కృష్ణా జలాలు తీసుకొస్తాం..: వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- వికారాబాద్‌లో మెడికల్ కాలేజీ, ఆయుష్ ఆస్పత్రికి శంకుస్థాపన



నవతెలంగాణ వికారాబాద్ ప్రతినిధి, మర్పల్లి

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ విషయంలో సీఎం కేసీఆర్ ముందడుగు వేయడంతోనే కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర మంత్రి ప్రకటన చేశారన్నారు. ఇది కార్మికుల, ప్రజల విజయంగా అభివర్ణించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను బలోపేతం చేసే వరకూ పోరాడుతామన్నారు. గురువారం వికారాబాద్ జిల్లాలో మంత్రి పర్యటించారు. వికారాబాద్ పట్టణంలోని అనంతగిరిలో రూ.7.50 కోట్లతో 50 పడకల ఆయుష్ ఆస్పత్రి, రూ.3.6 కోట్లతో కేంద్రీయ ఔషధ గిడ్డంగి నిర్మాణానికి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డితో కలిసి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో 280 అదనపు పడకల విస్తీర్ణపు నిర్మాణ పనులను పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. వికారాబాద్‌కు కృష్ణా జలాలను రప్పించి ప్రజల రుణం తీర్చుకుంటామని చెప్పారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమకు మొండిచేయి చూపిందన్నారు. అన్ని విషయాల్లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి గిరిజన యూనివర్సిటీని మంజూరు చేయలేదన్నారు. వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయింపులో వివక్ష చూపిస్తోందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి నిధుల కేటాయింపు ఆశించిన స్థాయిలో జరగలేదన్నారు. చివరకు సబ్సిడీ బియ్యంలోనూ కోత విధించినట్టు వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయం, వైద్యం, విద్యుత్, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వ సంక్షేమాల పట్ల ప్రజల్లో చర్చ పెట్టాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఎండగడుతూ ఆ పార్టీల నాయకులు గ్రామాల్లోకి వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. మూడోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. అంతకుముందు మంత్రులు అనంతగిరి గుట్టలోని అనంత పద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మర్పల్లి మండల కేంద్రంలో వికారాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇండ్లస్థలాల కోసం

ప్రత్యక్ష కార్యాచరణ

- నాలుగు దశలుగా రాష్ట్రవ్యాప్త ఆందోళన
- మే 15న హైదరాబాద్‌లో మహాధర్నా
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర విస్తృత సమావేశం తీర్మానం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని జర్నలిస్టుల ఇండ్లస్థలాల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రత్యక్ష కార్యాచరణను ప్రకటించింది. వచ్చే రెండు నెలల పాటు ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ప్రభుత్వం స్థలాలు ఇచ్చేవరకు ఉద్యమాన్ని కొనసాగించాలని తీర్మానించింది. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. దీనికి రాష్ట్ర ఫెడరేషన్ రాష్ట్ర ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఆయా జిల్లాల అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండ్ల స్థలాలపై సుదీర్ఘంగా చర్చించిన సమావేశం, పలు నిర్ణయాలు తీసుకుంది. ఏప్రిల్ 17, 18 తేదీల్లో నియోజకవర్గం, జిల్లా స్థాయిల్లో జర్నలిస్టుల సంతకాలు సేకరణకు పిలుపునిచ్చింది. ఏప్రిల్ 25, 26 తేదీల్లో ఇండ్ల స్థలాలు ఇవ్వాలంటూ స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించాలని తీర్మానించింది. మే 2, 3 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో దీక్షలు చేయాలని కోరింది. అలాగే మే 15న హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించాలని సమాశం నిర్ణయించింది.

ఫెడరేషన్ సీనియర్ ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ ఇండ్లస్థలాల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. గత 35 ఏండ్లుగా ఇండ్లస్థలాల కోసం జర్నలిస్టులు ఎదురుచూస్తున్నారని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తరువాత కూడా రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని ప్రకటించకపోవడం అన్యాయమని అభిప్రాయపడ్డారు. విస్తృతస్థాయి సమావేశం నిర్ణయాలను కచ్చితంగా అమలు చేయాలని ఫెడరేషన్ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు పి.ఆనందం, ఎల్గోయి ప్రభాకర్, బండి విజయ్ కుమార్, గుడిగ రఘు, పి.రాధిక, వి.జగన్, బి.విజయానంద్, బి.రాజశేఖర్, కార్యదర్శులు ఎర్రం నర్సింగరావు, ఎస్‌కె సలీమ, ఇ. చంద్రశేఖర్, గంద్ర నవీన్, బి.దామోదర్, బి. జగదీశ్వర్, కొప్పు నిరంజన్, పి.బిక్షపతి, కె.అనిల్‌రెడ్డి, తన్నీరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పండి

- కరీంనగర్ సీఐకి హైకోర్టు నోటీసులు

నవతెలంగాణ -హైదరాబాద్

కోర్టుధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలని కరీంనగర్ సీఐ(కరీంగనర్-2) లక్ష్మీబాబుకి హైకోర్టు నోటీసులిచ్చింది. ఈ నెల 21న జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ కేసు విచారణ జరిగిన అన్ని వాయిదాలకు గైర్హాజరు అవ్వడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. 2022, ఆగస్టు 10న ఉదయం 11 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు తనను చట్టవిరుద్ధంగా కరీంనగర్ సీఐ స్టేషన్‌లో ఉంచారనీ, చేయి చేసుకున్నారనీ, అసభ్యకరంగా మాట్లాడారంటూ నూగూరి వంశీకృష్ణ వేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ వినోద్‌కుమార్ విచారించారు. తాను చెప్పిన ఆ విషయాలన్నీ పీఎస్‌లోని సీసీ కెమెరాల్లో రికార్డయిందని పిటిషనర్ న్యాయవాది చెప్పారు. అలాగే ఎలాంటి వారెంట్ ఇవ్వకుండా పోలీసులు పిటిషనర్ ఇంటిపై దాడి చేసి ఆస్తుల పత్రాలు తీసుకున్నారని తెలిపారు. పంచనామా, సీజ్ ప్రక్రియను పాటించలేదన్నారు. డాక్యుమెంట్లను కాల్చేస్తానని బెదిరించారన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఆయా తేదీలకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీని సమర్పించాలని గతంలో ఆదేశించింది. అయినా సీఐ సమర్పించక పోవడంతో పిటిషనర్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. కరీంనగర్-2 పోలీస్ స్టేషన్‌లో సీసీటీవీలను నవంబర్‌లో ఏర్పాటు చేశా రని జీపీ వాదించారు. అయితే 2018లో సీసీ టీవీలు ఉన్న స్టేషన్‌గా కరీంనగర్-2ను పేర్కొం టూ మోడల్ స్టేషన్ ప్రకటించారన్న విష యాన్ని పిటిషనర్ తరుపు లాయర్ హైకోర్టు దృష్టికి తెచ్చారు. వాదనల తర్వాత హైకోర్టు, సీఐని వ్యక్తి గతంగా హాజరుకావాలని ఆదేశించింది. సీసీ కెమె రాల తీరుతెన్నులపై నివేదిక ఇవ్వాలని ఆదేశిం చింది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

మార్గదర్శి కేసులో మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రధాన కార్యాలయ ఉద్యోగులపై ఏపీ సీఐడీ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవద్దనీ, ఆ ఉద్యోగులు పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మార్గదర్శి కార్పొరేట్ ఆఫీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రామకృష్ణారావు ఇతర జీఎంలు, డీజీఎంలు వేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌ను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారించారు. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీ, ఇతర ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది, విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

జస్టిస్ వెంకటేశ్వర్‌రెడ్డికి వీడ్కోలు

రిటైర్ అయిన జస్టిస్ ఎ.వెంకటేశ్వర్‌రెడ్డికి హైకోర్టు వీడ్కోలు చెప్పింది. చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అధ్యక్షతన గురువారం ఫుల్ కోర్టు సమావేశమైంది. అనంతరం జడ్జీల చాంబర్‌లో వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులకు సీజే దంపతులు జ్ఞాపికను అందజేశారు. హైకోర్టు బార్ అసోసియేషన్ కూడా జస్టిస్ వెంకటేశ్వర్‌రెడ్డిని సత్కరించింది.

సత్వర దర్యాప్తు చేయండి

ఏపీకి చెందిన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తును వేగవంతం చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ గురువారం ఆదేశించారు. వివేకా హత్య కేసులో దస్తగిరి అప్రూవర్‌గా మారిన నేపథ్యంలో ఆతను చెప్పిన వాటిని పట్టుకుని సీబీఐ విచారణ చేయడం అన్యాయమని, ఆయనకు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలంటూ వైఎస్ భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించారు. అనంతరం కేసు విచారణను 17 వ తేదీకి వాయిదా వేశారు.

ఐమాక్స్, నెక్లెస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ..

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరం నడిబొడ్డున నిర్మించిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ నేపథ్యంలో శుక్రవారం పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. హుస్సేన్ సాగర్ తీరంలో 125 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించనున్నారు. నగరవాసులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు, అభిమానులు, అధికారులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఐమాక్స్, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్, హుస్సేన్ సాగర్, మింట్ కంపౌండ్ మార్గాల్లో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ సీపీ సుధీర్ బాబు గురువారం తెలిపారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



- వీవీ విగ్రహం(ఖైరతాబాద్), ఓల్డ్ సైఫాబాద్ పోలీసు స్టేషన్ జంక్షన్, రవీంద్ర భారతీ జంక్షన్, మింట్ కంపౌండ్ రోడ్డు, నెక్లెస్ రోడ్, నల్లగుట్ట జంక్షన్, కట్ట మైసమ్మ టెంపుల్(లోయర్ ట్యాంక్ బండ్), ట్యాంక్ బండ్, లిబర్టీ జంక్షన్ వైపు వచ్చే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలి.
- అఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే ఆర్టీసీ బస్సులను ట్యాంక్‌బండ్ వైపునకు అనుమతించరు. ఈ మార్గంలో వచ్చే ఆర్టీసీ బస్సులను రవీంద్ర భారతి, తెలుగుతల్లి ఫ్లై ఓవర్, కట్ట మైసమ్మ టెంపుల్, లోయర్ ట్యాంక్ బండ్, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ మార్గాల్లో అనుమతించనున్నారు.

కేసీఆర్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకే నాపై దాడి

- ఫేక్ చాట్‌లతో దుష్ప్రచారం
- సుఖేశ్ తో ఎలాంటి పరిచయము లేదు : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకే బీజేపీ నాయకులు తనపై దాడి చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఫేక్ చాట్‌లతో వారు దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సుఖేశ్‌తో తనకు ఎలాంటి పరిచయమూ లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. "గత కొన్ని రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం మీద, బీఆర్ఎస్ మీద, మరీ ముఖ్యంగా నా మీద ఉద్దేశపూర్వకంగా కొన్ని మీడియా సంస్థలు తప్పుడు వార్తలు, తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయి. బీఆర్ఎస్ పొందుతున్న ప్రజాదరణను, కేసీఆర్ జాతీయ స్థాయి కార్యాచరణను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక. తెలంగాణ వ్యతిరేకులు మీడియా సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకొని పేపర్లు, టీవీ ఛానెళ్ల, యూ ట్యూబ్ మీడియాల ద్వారా పనిగట్టుకొని ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నాయి. ఒక ఆర్థిక నేరగాడు, ఒక అనామక లేఖను విడుదల చేయడం, దానిపై బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు వెంటనే కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయడం, దాని తదనంతరమే ఎంపీ అరవింద్ బీజేపీ టూల్ కిట్‌లో భాగంగా పనిగట్టుకుని సామాజిక మాధ్యమాల్లో బురదజల్లే కార్యక్రమాన్ని ఒక ప్రణాళిక ప్రకారం చేస్తున్నారు. అసలు సుఖేష్ చంద్రశేఖర్ అనే వ్యక్తితో నాకు పరిచయం కూడా లేదు. అతనెవరో కూడా నాకు తెలియదు. కానీ ఇలాంటి వాస్తవాలను పట్టించుకోకుండా, కొన్ని మీడియా సంస్థలు అత్యుత్సాహంతో, పనిగట్టుకొని తప్పుడు వార్తలు ప్రచురించాయి. ఇదివరకు నా మొబైల్ ఫోన్ల విషయంలో కూడా ఇలాగే తొందరపడి వార్తలు రాసి తరువాత తోక ముడిచారు. మళ్లీ ఇప్పుడు క్రిమినల్ సుఖేష్‌ను పావుగా వాడుకుని రాష్ట్ర ప్రభుత్వాన్ని, బీఆర్ఎస్‌ను, కేసీఆర్ కుటుంబ సభ్యులను బద్నాం చేయాలని ప్రయత్నిస్తున్నారు. దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయమన్న చందంగా, అదుగో పులి అంటే ఇదిగో తోక అన్నట్టు కొన్ని మీడియా సంస్థల తీరు తయారైంది. ఇది అత్యంత దురదృష్టకరం. పాత్రికేయులు కనీస విలువలు పాటించకపోవడం అత్యంత బాధాకరం. రాజకీయ ఎజెండాలో మీడియా సంస్థలు కూడా పావుగా మారడం, బీఆర్ఎస్‌పై అడ్డగోలుగా తప్పుడు ప్రచారం చేయడం చూస్తే ఎన్నికల ఏడాదిలో మరెంత దిగజారి వార్తలు ప్రసారం చేస్తారో అని తెలంగాణ సమాజం గ్రహించాలి..జాగ్రత్త పడాలి..... " అని కవిత ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజలు విజ్ఞులు.. పాలేంటో, నీళ్లేంటో తెలిసిన చైతన్య జీవులు. అందువల్ల నిజం నిలకడ మీద తెలుస్తుందని ఈ సందర్భంగా కవిత తెలిపారు. కేసీఆర్ మీద కక్షతో, అన్ని రంగాల్లో తెలంగాణను దేశంలో ముందు వరుసలో నిలిపిన బీఆర్ఎస్ ప్రభుత్వం మీద ఈర్ష్యతో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని తెలంగాణ సమాజం తప్పకుండా తరిమి కొడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై బురద జల్లే వార్తలకు ప్రాధాన్యతనిచ్చిన కొన్ని మీడియా సంస్థలకు దమ్ము, నిజాయితీ ఉంటే తన వివరణకి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని సవాల్ చేశారు. తలవంచేది లేదనీ, తెగించి కొట్లాడుతామని ఆమె స్పష్టం చేశారు.

భగ్గుమంటున్న భానుడు

- వడ్డేమానులో 44.2 డిగ్రీలు
- ఉక్కపోత తీవ్రతరం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భానుడు భగభగ మండిపోతూ తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. దీంతో రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పెరుగుతూ పోతున్నాయి. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేమానులో అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇదే అత్యధికం. 28 జిల్లాల్లో 41 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీనికితోడు గాలిలో తేమ శాతం తగ్గడంతో ఉక్కపోత తీవ్రతరమైంది. మధ్యాహ్నం పూట ఫ్యాన్లు తిరుగుతున్నా ఇంట్లో ఎండవేడిమికి సామాన్యులు తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో వీలైనంత మేరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు అత్యవసరం అయితేగానీ బయటకు వెళ్లవద్దనీ, పిల్లలు, వృద్ధుల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తగు జాగ్రత్తలు తీసుకుని, వాటర్ బాటిళ్లు తీసుకుని బయటకు వెళ్లాలని చెబుతున్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఆకాశం మేఘావృతమైంది. పలుచోట్ల ఉరుములతో కూడిన తేలికపాటి జల్లులు పడ్డాయి. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో అత్యధికంగా 1.93 సెంటీమీటర్ల వర్షం కురిసింది. రాష్ట్రంలో గురువారం 22 చోట్ల(గురువారం రాత్రి 9 గంటల వరకు) 22 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది.

ప్రభుత్వ విద్యను ధ్వంసం చేసే ఎన్ఈపీని రద్దు చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో నేతల డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ విద్యారంగాన్ని ధ్వంసం చేసే జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)-2020ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. ఎన్ఈపీ అమలు పేరుతో పాఠ్యపుస్తకాల్లోని చరిత్ర పాఠ్యాంశాల తొలగింపు, తరగతి గదుల్లో ఉపాధ్యాయులు నిలబడే బోధించాలనటం సరైంది కాదన్నారు. ఈ చర్యలన్నీ ప్రభుత్వ విద్యారంగం విధ్వంసానికి, కేంద్ర పాలకుల రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశించిన వేనని విమర్శించారు. టీఎస్‌యూటీఎఫ్ పదో ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ లక్ష్యాలను విస్మరించి కేంద్రీకరణ, ప్రయివేటీకరణ, కాషాయీకరణల దిశగా సాగుతున్న ఎన్ఈపీ-2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లోని కింగ్స్ అండ్ క్రానికల్స్, మొఘల్ కోర్ట్స్, మహాత్మాగాంధీ హత్య, గుజరాత్ అల్లర్లు వంటి పాఠ్యాంశాలను తొలగించటం చరిత్రను మరుగుపరచటానికేనని విమర్శించారు. ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉద్యోగులు ఉద్యమాలు చేస్తుంటే సాధారణ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేయటం మభ్యపెట్టటానికేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జీతాలు, సప్లిమెంటరీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లో ఉద్యోగులు, అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ సింహాచలం, పత్రిక సంపాదకులు పి మాణిక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు శారద, వెంకటప్ప, రాజారావు, నరసింహారెడ్డి, నాయకులు మస్తాన్‌రావు, రామకృష్ణ, మాజిద్, విఠలాచార్య, వెంకటేశ్వర్లు, కవిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- విద్యాశాఖ కార్యదర్శికి తపస్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేసవి కాలంలోనే ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులను చేపట్టేలా ప్రత్యేక చొరవ చూపాలని తపస్ కోరింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ ఏవీఎన్‌తో తపస్ అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, ఏబీఆర్ఎస్ఎం ప్రతినిధి సూరం విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య కలిసి వినతిపత్రం సమర్పించారు. విద్యారంగంలో నెలకొన్న దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పాఠశాల నిర్వహణ కోసం వచ్చే గ్రాంటులను బడుల ప్రారంభం నాటికి విడుదల చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు తప్పకుండా ఉండాలని, లేదంటే పాఠశాలలను మంచి వాతావరణంలో నడపడం ఇబ్బందికరంగా ఉంటుందని పేర్కొన్నారు. మన ఊరు మన బడి అన్ని పాఠశాలల్లో రెండో విడత ప్రారంభం చేసి సత్వరం పని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి పాఠశాలలో కంప్యూటర్ విద్య బోధకున్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆ తర్వాత నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఈ కుబేర్ ద్వారా మంజూరు చేయాలని కోరుతూ ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావును వారు కలిశారు.

చీమలపాడు ప్రమాద బాధితులకు మంత్రుల పరామర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చీమలపాడు ఘటనలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిని మంత్రులు కేటీఆర్, పువ్వాడ, ఎంపీలు వద్దిరాజు, నామా నాగేశ్వర్‌రావు గురువారం పరామర్శిం చారు. మరింత శ్రద్ధతో మెరుగైన సేవలు అందించాల్సిందిగా అధికారులు,వైద్యులను ఈ సందర్భంగా కేటీఆర్ ఆదేశించారు. ప్రభుత్వం,పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. గాయపడిన వారిని అనుక్షణం కంటికి రెప్పలా చూసుకోవాలని,వీరి సహాయ కులు, కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉండాల్సిందిగా నిమ్స్ ఓఎస్డీ డాక్టర్ గంగాధర్, డైరెక్టర్ డాక్టర్ బీరప్పలకు కేటీఆర్ పలు సూచనలు చేశారు.సలహాలిచ్చారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వం,పార్టీ కొండంత అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

ఏపీ మంత్రులపై ఎర్రోళ్ల ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏపీ మంత్రులపై టీఎస్ఎంఐడీసీ చైర్మెన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ మంత్రులు అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి హరీశ్ రావు మాట్లాడినదాన్ని వక్రీకరించి పిచ్చి పిచ్చి కూతలు కూస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

ఆత్మగౌరవంపై దాడి : ఎమ్మెల్యే సైదిరెడ్డి

మంత్రి హరీష్ రావు పై ఏపీ మంత్రుల వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవం మీద దాడి అని ఎమ్మెల్యే సైదిరెడ్డి విమర్శించారు. హరీష్ రావు దేశం లో అందరు మంత్రులకు ఆదర్శమని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడరు. ఏపీ లో అన్ని పార్టీలు మోడీ పార్టీలుగా మారాయని విమర్శించారు. హరీష్‌రావు లాంటి వారి మీద మాట్లాడేపుడు వంద సార్లు ఆలోచించుకోవాలని హెచ్చరించారు.

అతి పిన్నవయస్కుడికి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స

- నిమ్స్ వైద్యులకు హరీశ్ రావు అభినందనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిమ్స్ వైద్యులు అరుదైన మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్న 12 ఏండ్ల చిన్నారికి విజయవంతంగా మూత్రపిండ మార్పిడి చేశారు. నిమ్స్ యురాలజిస్టులు మూత్రపిండాలు పూర్తిగా పనిచేయని దశకు చేరుకున్న సమయంలో బాలుడికి భవిష్యత్‌కు మెరుగైన జీవితం అందించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన బాలుడు ఆరవ తరగతి చదువుతున్నాడు. ఈ బాలుడి తల్లిదండ్రులు పేదవారు. తండ్రి కూలీ పనులు చేసుకుంటుండగా తల్లి కొడుకు ఆరోగ్యం చూసుకుంటూ ఇంటిపట్టునే ఉండేది. ఈ చిన్నారి బైలేటరల్ వెసికోర్టెరిక్ రిఫ్లక్స్ అనే మూత్రనాళ సమస్యతో బాధపడుతున్నాడు. ఇది పుట్టుకతో వచ్చే సమస్య. దీంతో కిడ్నీ ఫెయిల్యూర్ అయి ఏడాది క్రితం నుంచి డయాలసిస్ మీదే బతుకుతున్నాడు. నిమ్స్ డాక్టర్లు పూర్తిగా బాలుడి పరిస్థితిని పరిశీలించి రెండు దశల్లో చేయాల్సిన ప్రొసీజర్‌కు ప్రణాళిక రూపొందించారు. మొదట ఎడమ నెఫ్రోక్టమీని తర్వాత కుడి నెఫ్రోక్టమిని లాప్రోస్కోపిక్ ద్వారా శస్త్రచికిత్స చేశారు. ఆ తర్వాత రెండో దశలోనే మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సని విజయవంతంగా చేశారు. ఆపరేషన్ తర్వాత బాలుడి ఆరోగ్యం పూర్తిగా కుదుటపడింది. మూత్రపిండాల పనితీరు సాధారణ స్థితికి చేరుకుంది. సీరమ్ క్రిటినైన్ స్థాయిలు కూడా 7 నుంచి 0.4కు తగ్గినట్టు డాక్టర్లు తెలిపారు. ఇక కొడుకుకు కిడ్నీని దానం చేసిన బాలుడి తల్లి ఆరోగ్యం కూడా బాగుందని డాక్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా నిమ్స్ యురాలజి విభాగాధిపతి ప్రొఫెసర్, డాక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంత చిన్న వయసు బాలుడికి ఇలాంటి సర్జరీ జరగడం ఇదే మొదటిసారని తెలిపారు. బాలుడి చికిత్స ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేసినట్టు చెప్పారు. తమకు ప్రోత్సాహాన్నందిస్తున్న వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్ రావు, నిమ్స్ డైరక్టర్ డాక్టర్ బీరప్పకు వైద్యులు ధన్యవాదాలు తెలిపారు. బాలునికి విజయవంతంగా మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స చేసిన వైద్యులను మంత్రి హరీశ్ రావు అభినందనలు తెలిపారు.

డాక్టర్ దేవరాజ్‌తో పాటు యూరాలజిస్టులు డాక్టర్ రామ్ రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ రామచంద్రయ్య, డాక్టర్ చరణ్, డాక్టర్ ధీరజ్, డాక్టర్ వినయ్, డాక్టర్ సునిల్, డాక్టర్ అరుణ్, డాక్టర్ విష్ణు, డాక్టర్ హర్ష, డాక్టర్ జానకి, డాక్టర్ పవన్, డాక్టర్ సూరజ్, డాక్టర్ పూవర్సన్, డాక్టర్ అనంత్, డాక్టర్ షారూక్ లు విజయవంతంగా బాలుడి శస్త్రచికిత్సను పూర్తి చేశారు. వీరికి అనస్తీసియాలజీ నిపుణులైన డాక్టర్ నిర్మల, డాక్టర్ ఇందిర, డాక్టర్ కిరణ్, షిబానీతో పాటు నెఫ్రాలజిస్ట్‌లైన డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ గంగాధర్, డాక్టర్ భూషన్ రాజులు సాయమందించారు.

అదీ కేసీఆర్ దెబ్బంటే....

- విశాఖ ఉక్కుపై కేంద్రం నిర్ణయాన్ని ఉద్దేశించి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వానికి కేసీఆర్ దెబ్బంటే ఏంటో ఇప్పుడు తెలిసిందని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ లో నిర్వహించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణపై కేంద్రం వెనక్కి తగ్గటాన్ని ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటామనీ, అందులో భాగంగా బిడ్ వేస్తామంటూ సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. అందులో భాగంగా ఒక ఉన్నతాధికారుల బందాన్ని విశాఖకు పంపిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. దాంతో ఖంగుతిన్న కేంద్ర ప్రభుత్వం ఇప్పడప్పుడే స్టీల్ ప్లాంట్ ను ప్రయివేటీకరించబోమంటూ వెనక్కి తగ్గిందనీ, ఇది ముమ్మాటికి బీఆర్ఎస్ ఘనతేనని ఆయన వివరించారు.

మంత్రి హరీశ్‌రావు మాటల్లో తప్పేమీ లేదు

- శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి విషయంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు మాట్లాడిన దాంట్లో తప్పేమీ లేదని శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్ తెలిపారు. గురువారం శాసనమండలిలోని తన చాంబర్‌లో ఇష్టాగోష్టిగా ఆయన మాట్లాడారు. ఏపీ మంత్రులు చిల్లరగా మాట్లాడుతున్నారని విమర్శించారు. హరీశ్‌రావుకు ఉద్యమ నేపథ్యం ఉందన్నారు. ఏపీ మంత్రులకు ఏం ఉందని ప్రశ్నించారు. హరీశ్‌రావుకు పాలనా అనుభవం ఉందనీ, ఏదీ మాట్లాడినా విషయం ఉంటుందని తెలిపారు. చిల్లర వేషాలు...చిల్లర చేష్టలు మానుకోవాలని హెచ్చరించారు. మంత్రులు హైదరాబాద్‌కు రావాల్సి ఉంటుందని మరిచిపోవద్దన్నారు. పిచ్చి మాటలు మాట్లాడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు.

10,158 కొత్త కేసులు పెరుగుతున్న కోవిడ్ పాజిటివిటీ రేటు

ఢిల్లీ : దేశంలో కరోనా కేసుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. 10,158 కోవిడ్ కేసులు నమోదైనట్టు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం ఉదయం విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. గత ఎనిమిది నెలల్లో ఇవే అత్యధికం. కొత్తగా 2,29,958 మందికి పరీక్షలు నిర్వహించామని తెలిపింది. ముందురోజుతో పోల్చితే 30శాతం కేసులు పెరగడం ఆందోళన కలిగించే అంశం. దేశంలో ఇప్పుడు యాక్టివ్ కేసుల సంఖ్య 44,998కి పెరిగింది. మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 4,42,10,127కి చేరింది. రికవరీ రేటు 98.71 శాతంగా నమోదైంది. ఇప్పటివరకూ 220.66 కోవిడ్ వ్యాక్సిన్ డోసులు దేశవ్యాప్తంగా ప్రజలు వినియోగించినట్టు కేంద్రం తెలిపింది. రాబోయే 10-12 రోజుల్లో కేసులు మరింతగా పెరుగుతాయని సంబంధిత వర్గాలు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

భగ్గుమంటున్న భానుడు

- వడ్డేమానులో 44.2 డిగ్రీలు
- ఉక్కపోత తీవ్రతరం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భానుడు భగభగ మండిపోతూ తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. దీంతో రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పెరుగుతూ పోతున్నాయి. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేమానులో అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇదే అత్యధికం. 28 జిల్లాల్లో 41 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీనికితోడు గాలిలో తేమ శాతం తగ్గడంతో ఉక్కపోత తీవ్రతరమైంది. మధ్యాహ్నం పూట ఫ్యాన్లు తిరుగుతున్నా ఇంట్లో ఎండవేడిమికి సామాన్యులు తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో వీలైనంత మేరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు అత్యవసరం అయితేగానీ బయటకు వెళ్లవద్దనీ, పిల్లలు, వృద్ధుల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తగు జాగ్రత్తలు తీసుకుని, వాటర్ బాటిళ్లు తీసుకుని బయటకు వెళ్లాలని చెబుతున్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఆకాశం మేఘావృతమైంది. పలుచోట్ల ఉరుములతో కూడిన తేలికపాటి జల్లులు పడ్డాయి. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో అత్యధికంగా 1.93 సెంటీమీటర్ల వర్షం కురిసింది. రాష్ట్రంలో గురువారం 22 చోట్ల(గురువారం రాత్రి 9 గంటల వరకు) 22 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది.

ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌లో నలుగురు సభ్యులు

- ఎంపిక చేయనున్న కేంద్రం
- మంత్రిత్వ శాఖల నుంచి నోడల్ ఆఫీసర్లు

న్యూఢిల్లీ : సమాచార సాంకేతిక నిబంధనలు, 2021లో ప్రతిపాదించిన ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్‌లో నలుగురు సభ్యులు ఉండే అవకాశం కనిపిస్తున్నది. ఇందులోకి సభ్యులను కేంద్రం తీసుకోనున్నది. ఐటీ మంత్రిత్వ శాఖ నుంచి ఒక ప్రతినిధి, గణాంకాలు మరియు కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ నుంచి ఒకరు, ఒక 'మీడియా నిపుణులు', ఒక 'న్యాయ నిపుణులు' ఇందులో ఉండనున్నారు. అయితే, ఈ కూర్పు అనేది విమర్శకుల నుంచి వస్తున్న ఆందోళనలు, అనుమానాలకు ఉపశమనం కలిగిస్తుందని సీనియర్ ప్రభుత్వాధికారి ఒకరు అన్నారు. ఈ యూనిట్‌లో వివిధ మంత్రిత్వ శాఖల నుంచి నోడల్ ఆఫీసర్లు ఉండనున్నట్టు తెలిపారు. దాదాపు పదిరోజుల్లో ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్, దాని సంబంధ వివరాలను తెలియజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. తప్పుదారి పట్టించే, నకిలీ వార్తలను గుర్తించడంలో విశ్వసనీయత, తటస్థతను నిర్ధారించడానికి యూనిట్ అత్యున్నత స్థాయి వృత్తిపరమైన, నైతిక ప్రమాణాలను సమర్థిస్తుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన నకిలీ, తప్పుడు, తప్పుదారి పట్టించే వార్తలను గుర్తించేందుకు ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్ ఏర్పాటుకు ఐటీ నిబంధనల్లో మోడీ సర్కారు ఇటీవల సవరణలు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీనిపై దేశవ్యాప్తంగా ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, పలు ప్రముఖ మీడియా సంస్థలు, డిజిటల్ హక్కుల సంస్థలు, ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆన్‌లైన్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛకు ఇది అడ్డుగా ఉంటుందని పలువురు ఆందోళన వెలిబుచ్చారు.

సంబల్‌పూర్ జిల్లాలో ఇంటర్నెట్ సేవలు రద్దు

- 43 మంది అరెస్టు

భువనేశ్వర్ : సంబల్‌పూర్ జిల్లాలో ఇంటర్నెట్ సేవలను గురువారం ఉదయం 10 గంటల నుంచి 48 గంటల పాటు ఒడిషా ప్రభుత్వం రద్దు చేసింది. శుక్రవారం హనుమాన్ జయంతి సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరగకుండా నిరోధించడానికే ఒడిషా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఒడిషాలో మహా విసుభ సంక్రాతి రోజున హనుమాన్ జయంతి నిర్వహిస్తారు. అది ఈ ఏడాది శుక్రవారం వచ్చింది. నకిలీ వార్తలు వ్యాప్తితో అల్లర్లు జరుగుతాయనే సందేహంతో ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా రద్దు చేసింది. గత నెలలో శ్రీరామనవమికి ముందు రోజున నకిలీ వార్తలు వ్యాప్తి చేయడంతో జిల్లాలో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లులో 10 మంది పోలీసులతో సహా అనేక మంది సాధారణ పౌరులు గాయపడ్డారు. కాగా, ఈ అల్లర్లుకు సంబంధించి బుధవారం సాయంత్రం వరకూ 43 మందిని అరెస్టు చేసినట్లు సంబల్‌పూర్ జిల్లా ఎస్‌పి బి గంగాధర్ తెలిపారు. ఇంటర్నెట్ సేవలను నిషేధిస్తున్నట్లు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి (హోం శాఖ) డికె సింగ్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇంటర్నెట్ సేవలను బంద్ చేయడంతో పాటు ఆరు పోలీస్ స్టేషన్లు సంబల్‌పూర్ టౌన్, ధనుపాళి, ఖేత్రాజ్‌పుర్, అయింతపలి, బరైపాలి, సదార్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 144 సెక్షన్ విధించినట్టు ఎస్‌పి తెలిపారు. శ్రీరామనవమి రోజున జరిగిన అల్లర్లులో కుట్ర కోణం ఉందా అనే ప్రశ్నకు 'ఈ విషయంపై దర్యాప్తు జరుగుతుంది' అని ఎస్‌పి సమాధానం ఇచ్చారు.

గూగుల్‌లో మరిన్ని తొలగింపులు

వాషింగ్టన్ : గూగుల్ మరికొందరు ఉద్యోగులపై వేటు వేసే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది జనవరిలో మొత్తం ఉద్యోగుల్లో ఆరు శాతం అంటే 12,000 మంది ఉద్యోగులను తొలగించిన సంగతి తెలిసిందే. తాజాగా మరికొందరిని తొలగించే అవకాశం ఉన్నట్లు గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. జాతీయ మీడియాతో ఆయన మాట్లాడుతూ... కృత్రిమ మేధస్సు (ఎఐ), చాట్‌బాట్ బార్డ్, జీమెయిల్, గూగుల్ డాక్స్ వంటి ఇతర కీలక ప్రాజెక్టులు కొనసాగుతున్నట్లు పిచాయ్ తెలిపారు. వాటిపై ఇంకా దృష్టి సారించాల్సి వుందని, వాటిలో ఉన్న అవకాశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే తమ సిబ్బందిని అధిక ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టుల్లోకి తరలిస్తున్నామని పేర్కొన్నారు. కంపెనీలో జరుగుతున్న ప్రతి పనిని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి జరిగినా మరిన్ని పనులు చేపట్టాల్సి వుందని అన్నారు. కంపెనీ సామర్థ్యాన్ని మరో 20 శాతం పెంచాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరిలోనూ భారత్‌లో వివిధ విభాగాలకు చెందిన సుమారు 450 మంది ఉద్యోగులను తొలగించినట్లు గూగుల్ ప్రకటించింది. అయితే ఈ 450 మంది 12,000 తొలగింపుల్లో భాగమా.. కాదా.. అనే విషయంపై మాత్రం గూగుల్ ఎలాంటి ప్రకటన చేయలేదు.

టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ కేసులో...

- శంకరలక్ష్మి,సత్యనారాయణలను విచారించిన ఈడీ
- సిట్ నుంచి దర్యాప్తు పత్రాలు ఇప్పించాలని కోర్టును కోరిన ఈడీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి



రాష్ట్రంలో సంచలనం రేపిన టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ కేసులో ఆ విభాగం కాన్ఫిడెన్షియల్ సెట్ ఇంచార్జ్ శంకరలక్ష్మి, అడ్మిన్ సూపరింటెండెంట్ సత్య నారాయణలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం విచారించారు. దాదాపు నాలుగు గంటల పాటు వీరిద్దరిని వేర్వేరుగా ఒకసారి, ఇద్దరిని కలిపి ఒకసారి ఈడీ అధికారులు విచారించినట్టు తెలిసింది.

ముఖ్యంగా, ప్రశ్నా పత్రాలకు కస్టోడియన్‌గా ఉన్న శంకర్‌లక్ష్మి వద్ద రహస్యంగా ఉండాల్సిన కంప్యూటర్ పాస్‌వర్డ్ ఏ విధంగా మూడో చేతికి మారిందనే విషయమై ఆమెను నిశితంగా ఈడీ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. అలాగే, ఈ లీక్‌పై మొదట బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సత్యనారాయణను ఈ పేపర్‌లీక్ అంశం ఏ విధంగా మొదట బయటపడిందనే కోణంలో ఈడీ అధికారులు ప్రశ్నించారని సమాచారం.

అలాగే, ఈ కేసులో నిందితులైన టీఎస్పీఎస్సీ చైర్మెన్ పీఏ ప్రవీణ్, ఈ విభాగం కంప్యూటర్లను పర్యవేక్షించే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రాజశేఖర్‌ల ప్రవర్తన గురించి కూడా ఈడీ ఇద్దరు అధికారులను ప్రశ్నించినట్టు తెలిసింది. ముఖ్యంగా, ఈ కేసు దర్యా ప్తులో శంకరలక్ష్మి, సత్య నారాయణల సహకారం ఎంతగానో అవసరమనీ, విచారణకు తామెప్పుడు పిలిచినా హాజరు కావాలని ఈడీ అధికారులు కోరి నట్టు తెలిసింది.

ఈ కేసుపై ఇప్పటి వరకు రాష్ట్ర సిట్ అధికారులు జరిపిన దర్యాప్తునకు సంబంధిం చిన పత్రాలను ఆ విభాగం తమకు ఇవ్వడం లేదనీ, ఈ విషయంలో ఆ విభాగం సానుకూలంగా స్పందించే లా ఆదేశాలివ్వాలని కోరుతూ గురువారం నాంపల్లి కోర్టును ఈడీ అధికారులు ఆశ్రయించారు. అయితే, తాము జరుపుతున్న దర్యాప్తునకు సంబం ధించిన అంశాలతో కూడిన పత్రాలను హైకోర్టుకు అందజేశా మనీ, ఈ నేపథ్యంలో హైకోర్టు పరిశీలనలో ఈ అంశం ఉన్న కారణంగా ఈడీకి పత్రాలివ్వలేమని సిట్ అధికారులు నాంపల్లి కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు.

ఉక్కుపై కేంద్రం వంచన

కొద్ది గంటల్లోనే మాట మార్చిన కేంద్ర సహాయ మంత్రి కులస్తే

ఉదయం : విశాఖ స్టీల్ ప్రైవేటీకరణపై ముందుకెళ్లడం లేదు • **సాయంత్రం :** అది నా ఒక్కడి చేతిలోనే లేదు

ఉద్యమం కొనసాగుతుంది : ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

విశాఖ: వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం తన వంచనను కొనసాగిస్తోంది. పూటకో మాట.. రోజుకో ప్రకటనతో ప్రజలను, కార్మికులను బిజెపి సర్కారు మరింత గందరగోళానికి గురిచేస్తోంది. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే గురువారం ఉదయం వైజాగ్ పోర్టు కళావాణిలో జరిగిన రోజ్‌గార్ మేళా కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'ప్రైవేటీకరణపై ముందుకెళ్లడం లేదు' అని ప్రకటించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలతో నగరంలోని నోవాటెల్‌లో సాయంత్రం జరిగిన చర్చల్లో ప్రైవేటీకరణ చేయబోవడం లేదన్న స్పష్టమైన హామీ మంత్రి ఇవ్వలేదు. కొద్ది గంటల వ్యవధిలోనే ఆయన మాటల్లో మార్పు కనిపించడం బిజెపి అసలు నైజాన్ని వెల్లడించిందని పరిశీలకులంటున్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై వెనక్కి తగ్గేది లేదని, ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించిన విషయం తెలిసిందే.



కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తేతో మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

విశాఖలో మంత్రి పర్యటన సాగిందిలా...

ప్రధాన మంత్రి రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం పోర్టు కళావాణి ఆడిటోరియంలో కేంద్ర సంస్థల్లో ఉద్యోగులుగా ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేసేందుకు గురువారం కేంద్ర సహాయ మంత్రి కులస్తే విశాఖకు వచ్చారు. పత్రాల పంపిణీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ఇప్పటికిప్పుడే ముందుకెళ్లడం లేదు. విభాగాలను బలోపేతం చేస్తాం' అంటూ ప్రకటించారు. దీంతో స్టీల్ ప్లాంట్ కార్మికవర్గం, రెండు తెలుగు రాష్ట్రాల్లోకీ ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా వెళ్లింది. కేంద్ర మంత్రి ప్రకటన ఎంతో కొంత ఉపశమనం కలిగించింది అనుకునేలోపే 'అంతా నా చేతిలో లేదు. నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉంది' అని సాయంత్రానికి మాట మార్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలతో జరిగిన చర్చల సందర్భంగా కొన్ని ప్రతిపాదనలను పోరాట కమిటీ నేత జె.అయోధ్యరామ్ తదితరులు ఆయన ముందుంచగా పై విధంగా స్పందించారు. దీంతో కార్మికవర్గంలో మళ్లీ అలజడి నెలకొంది.

అసలేం జరిగింది ?

గురువారం మధ్యాహ్నం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, స్టీల్ యూనియన్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మంత్రి మాట మార్చేశారు. ఈ సమావేశంలో విశాఖపట్నం ఎంపీ ఎంవివి సత్యనారాయణ కూడా ఉన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు మాట్లాడుతూ.. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం స్ట్రాటజిక్ సేల్ కింద పెట్టడాన్ని నిలిపివేయాలని, ఇదివరకే ప్లాంట్‌ను అమ్మివేసే దిశగా వేసిన లీగల్ అడ్వైజరీ, ఆస్తుల మదింపు, ట్రాన్సాక్షన్ కమిటీలను రద్దు చేయాలని ప్రతిపాదన చేశారు. ఈ విషయమై మంత్రి 'అంతా నా చేతిలో ఏమీ లేదు. ఢిల్లీలో నేను మాట్లాడతాను. మీరు చేసిన ప్రతిపాదనలు తెలియజేస్తాను' అంటూ చెప్పుకొచ్చారు. కనుక ప్రైవేటీకరణ నుంచి కేంద్రం వెనక్కి వెళ్లడం లేదని స్పష్టమైంది.

తమ పోరాటం కొనసాగుతుందని, కేంద్రం ప్రైవేటీకరణను ఉపసంహరిస్తూ స్పష్టమైన ప్రకటన చేసే వరకూ తమ నిరసనలు కొనసాగుతాయని చర్చల అనంతరం కార్మిక నేతలు స్పష్టం చేశారు. మరోవైపు ప్రజా వంచన ఆపి, స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలుపుతున్నట్లు కేంద్రం స్పష్టంగా ప్రకటించాలని సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.



డాక్టర్ అనిల్ కుమార్



పి తంగరాజు



నంజేగౌడ



పాండురంగ మవినాకర్

కర్ణాటకలో నాలుగు స్థానాలకు సిపిఎం పోటీ


బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం నాలుగు స్థానాలకు పోటీ చేయనుంది. ఈ మేరకు అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ రాష్ట్ర కమిటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. బాగేపల్లి స్థానం నుంచి డాక్టర్ అనిల్ కుమార్, కెఆర్ పురం నుంచి నంజేగౌడ, కెజిఎఫ్ నుంచి పి.తంగరాజు, కల్బుర్గి నుంచి పాండురంగ మవినాకర్‌ను పోటీ చేయనున్నారు.



15న బాగేపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి డాక్టర్ అనిల్ కుమార్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా బాగేపల్లిలో జరిగే సభకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరుకానున్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకం నుంచి జమ్మూకాశ్మీర్ విలీన ప్రకటన ఔట్

- 11వ తరగతి పొలిటికల్ సైన్స్ పుస్తకం నుంచి తొలగింపు
- భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌కు సంబంధించిన రిఫరెన్సులు కూడా..
- చరిత్రకారులు, విద్యావేత్తలు, నిపుణుల ఆందోళన



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశంలోని విద్యా వ్యవస్థను ఉపయోగించుకొని గత చరిత్రను దాచే యత్నం చేస్తున్నది. ఇందులో భాగంగా పాఠ్యపుస్తకాల నుంచి కీలక అంశాలు, భాగాలు, పేరాలు, ప్రకటనలను తొలగిస్తున్నది. ఇప్పటికే అనేక కీలక భాగాలను పుస్తకాల నుంచి తీసివేసిన నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) భారత్‌లో జమ్మూకాశ్మీర్ విలీనానికి సంబంధించిన కీలక ప్రకటననూ తీసివేసింది.

11వ తరగతికి చెందిన పొలిటికల్ సైన్స్ పుస్తకం పదో చాప్టర్ నుంచి నుంచి దీనిని తొలగించింది. జమ్మూకాశ్మీర్ భారత్‌లో విలీనమైన తర్వాత అది స్వయంప్రతిపత్తిని కలిగి ఉంటుందన్న హామీ మీద ఆధారపడి విలీన ప్రక్రియ జరిగిందన్నది ప్రకటన కీలకాంశం. అయితే, జమ్మూకాశ్మీర్‌కు సంబంధించిన ఈ ప్రత్యేక అంశాన్ని రాబోయే తరం తెలుసుకోకుండా మోడీ సర్కారు పుస్తకాల ప్రక్షాళనకు దిగిందని విద్యావేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.

జమ్మూకాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35(ఏ) లను మోడీ సర్కారు తన రెండో టర్మ్ పాలనలో రద్దు చేసిన విషయం విదితమే. ఈ ఆర్టికల్ల రద్దు తర్వాత ప్రతిపక్షాలు, జమ్మూకాశ్మీర్‌లోని పౌర సంఘాలు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మోడీ సర్కారు నియంతృత్వ ధోరణిని తప్పుబట్టాయి. ఇది జమ్మూకాశ్మీర్ ప్రజల హక్కులను హరించడమేనని ఆందోళన వ్యక్తం చేశాయి. అయినప్పటికీ మోడీ సర్కారు మాత్రం అంతర్జాతీయంగా ఏర్పడే ఒత్తిడిని సైతం లెక్క చేయకుండా ఈ విషయంలో ఏకపక్షంగా ముందుకు వెళ్లడం గమనార్హం.

ఇటు మోడీ ప్రభుత్వం భారత తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి గొప్ప పేరు సంపాదించిన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌కు చెందిన అన్ని రిఫరెన్సులను సైతం తొలగించడం గమనార్హం. పాత 11వ తరగతి పొలిటికల్ సైన్స్ పుస్తకం "ఇండియన్ కానిస్టిట్యూషన్ ఎట్ వర్క్"లోని మొదటి చాప్టర్ నుంచి ఆజాద్‌కు సంబంధించిన అన్ని రిఫరెన్సులు తొలగింపునకు నోచుకోవడం గమనార్హం.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలలో మొఘల్ చరిత్ర, ఆరెస్సెస్‌పై నిషేధం, హిందూ-ముస్లింల ఐక్యతకు గాంధీ చేసిన కృషి వంటి అంశాలతో పాటు తాజాగా పైన పేర్కొన్న విషయాలనూ తొలగించడంపై దేశంలోని చరిత్రకారులు, విద్యానిపుణులు, సామాజికవేత్తల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఆరెస్సెస్ భావజాలాన్ని అమలు చేసే ప్రక్రియలో భాగమే ఇలాంటి వరుస మార్పులని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా చేస్తే భారత దేశ వాస్తవ చరిత్రను విద్యార్థులు తెలుసుకోలేరనీ, ఇది దేశ అస్థిత్వానికే ప్రమాదమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం హేతుబద్ధంగా ముందుకు వెళ్లాలనీ, విద్యా నిపుణుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలని వారు తెలిపారు.

మాట తప్పిన జగన్

- సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మెడలువంచి ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధిస్తానన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పి, మడమ తిప్పడం లేదని సీపీఐ ఏపీ కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. ఆంధ్రాలో అభివృద్ధి లేదన్న తెలంగాణ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలను తప్పు పడుతున్న ఏపీ మంత్రులకు రామకష్ణ గురువారం చురకలంటించారు. ఆంధ్రప్రదేశ్ అప్పుల్లో అభివృద్ధి సాధించిన విషయం హరీశ్‌రావుకు తెలియదా? అంటూ ప్రశ్నించారు.

దేశంలో జగన్‌మోహన్‌రెడ్డి కన్నా ఎక్కువ ఆస్తులున్న ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా?అంటూ అడిగారు.

ఆదానీకి ఏపీలోని పోర్టులు, విద్యుత్ ఒప్పందాలు, వేలాది ఎకరాల భూములు కట్టబెట్టడం కనపడలేదా? అంటూ ఎద్దేవా చేశారు. పైన చెప్పిన ఇన్ని అంశాల్లో అభివృద్ధి కనబడుతున్నా ఏపీలో అభివృద్ధి లేదంటూ హరీశ్‌రావు చెప్పటం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు.

ఏపీలో బతుకు దర్భరం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైఎస్సార్సీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో సామాన్యులు బతకలేని పరిస్థితులు నెలకొన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణకు 30 లక్షల మంది వలస వచ్చారని తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడీ ప్రజావ్యతిరేక విధా నాలను వ్యతిరేకించలేని దద్దమ్మలు అక్కడి పాలకులను ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ఏపీ ప్రజలు బీఆర్ఎస్ పాలన రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడిన దాంట్లో తప్పేముందని ఆయన ప్రశ్నించారు.

భటిండా ఆర్మీ స్టేషన్‌లోజవాన్ ఆత్మహత్య

భటిండా : పంజాబ్‌లో భటిండా ఆర్మీ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఒక జవాన్ ఆత్మహత్య చేసుకుని మరణించాడు. ఈ మేరకు ఇక్కడి కంటోన్మెంట్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. బుధవారం ఉదయం భటిండా ఆర్మీ స్టేషన్‌పై దాడి జరగడంతో నలుగురు జవాన్లు మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే జవాన్ ఆత్మహత్యకు ఉదయం జరిగిన సంఘటనకు ఎలాంటి సంబంధం లేదని సైన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సెంట్రీగా పనిచేస్తున్న ఒక జవాన్ బుధవారం సాయంత్రం 4:30 గంటల సమయంలో తుపాకీతో పేల్చుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు వెల్లడిచింది.

ప్రపంచ గమనం

అమెరికా 20 ఏండ్లలో చెయ్యలేని పనిని తాలిబన్లు ఒకే ఒక్క సంవత్సరంలో చేశారు!

నెల్లూరు నరసింహారావు



మాదక ద్రవ్యాల తయారీలో ఉపయోగించే గంజాయి సాగును తాలిబన్లు నిషేధించి దాదాపు ఒక సంవత్సరం అవుతోంది. దీని ప్రభావం ప్రపంచ మాదక ద్రవ్య మార్కెట్లపై తీవ్రంగా ఉండబోతోంది. దీనితో అనేక దేశాలకు మాదక ద్రవ్యాల నుంచి ఉపశమనాన్ని కాకుండా వాటి విని యోగానికి సంబంధించిన సంక్షోభం మరింతగా తీవ్రతరం అవనుంది. ప్రపంచ మార్కెట్‌లో అఫ్ఘాన్ గంజాయి ఆధారిత హెరాయిన్ అందుబాటులో లేకపోతే ఫెంటానిల్ అనే సింథటిక్ మాదక ద్రవ్య వినియోగం పెరుగుతుంది. పర్యవసానంగా అమెరికా, పశ్చిమ దేశాలతోపాటు అనేక దేశాలలో డ్రగ్ ఓవర్ డోస్ మరణాలు విపరీతంగా పెరుగు తాయి. ఫెంటానిల్ అమెరికా ఆరోగ్య వ్యవస్థలోని మెడికల్ ప్రిస్క్రిప్షన్ల ద్వారా చైనా, మెక్సికో దేశాల నుంచి దిగుమతి అవుతోంది.

అమెరికా అఫ్ఘానిస్తాన్‌పై "టెర్రరిజంపై ప్రపంచ యుద్ధం" అని ప్రకటించిన కాలం (2001) లో అమెరికా తదితర దేశాలలో హెరాయిన్ ఓవర్ డోస్ కేసులు బాగా పెరిగాయి. అఫ్ఘానిస్తాన్ ప్రభు త్వాలపైనా అమెరికాకు పూర్తి నియంత్రణ ఉన్నప్ప టికీ ఆ దేశంలో మాదక ద్రవ్య సంబంధిత ఉత్పత్తు ల సాగును గానీ, వాటి ఎగుమతులను గానీ నియంత్రించలేకపోయింది. నిజానికి అవి అమెరికా కనుసన్నల్లో పెరిగాయి.

అంతర్జాతీయ మాదక ద్రవ్య నియంత్రణ వ్యవహారాల సహాయ కార్యదర్శిగా వున్న రాబర్ట్ చార్లెస్ 2004 ఫిబ్రవరిలో అమెరికా కాంగ్రెస్‌కి "మాదక ద్రవ్య టెర్రరిజం"ను ప్రతిఘటించటానికి ఉద్దేశింపబడిన నూతన విధానాన్ని వివరించాడు. పది సంవత్సరా లలో అమెరికా మద్దతుతో అఫ్ఘాన్ ప్రభుత్వం మాదక ద్రవ్య సాగును నిర్మూలిస్తుందని ఆయన చెప్పాడు. అమెరికా గూఢచార సంస్థ సిఐఏ మద్దతుతో మాదక ద్రవ్యాలకు బదులుగా ప్రత్యా మ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. కానీ వాస్తవం మరోలా ఉంది. అఫ్ఘానిస్తాన్ లో 1991 నుంచి సిఐఏ "మాదక ద్రవ్య వ్యాపారం లో మునిగి తేలుతోంది" అని అమెరికా న్యాయ శాఖ తన విధానపత్రంలో ఆరోపించింది. సిఐఏ రహస్య కార్యకలాపాలతో మాదక ద్రవ్యాల స్వయం సమృద్ధి జోన్‌గా వున్న దక్షిణ ఆసియా ప్రపంచ మార్కెట్‌కు హెరాయిన్ ప్రధాన సరఫరాదారుగా మారింది. మాదక ద్రవ్యాలతో పాటుగా ఇస్లామిస్టు జిహాదీ టెర్రరిస్టు భావజాలాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిన అదృశ్య శక్తి సిఐఏ నే.

మాదక ద్రవ్య సాగును, ఉత్పత్తిని నియంత్రిం చాలనే ఆసక్తి అమెరికాకు, దాని నాటో మిత్ర దేశాలకు లేదనేది సుస్పష్టం. ఈ దేశాలు తిరుగు బాటును అణచివేసే పేరుతో మాదక ద్రవ్య సాగు ను, ఉత్పత్తిని సంరక్షిస్తున్నాయి. నిజానికి 2001లో అమెరికా అఫ్ఘానిస్తాన్‌ను దురాక్రమించటానికి ముందే తాలిబన్లు మాదక ద్రవ్య సాగును అరికట్టా లని ప్రయత్నించారు. ఒకవైపు మాదక ద్రవ్యాల వ్యాపారంతో విదేశాల్లోని కీలుబొమ్మ ప్రభుత్వాలను అవినీతిలోకి దించుతూ మరోవైపు (నికరాగ్వా, హైతీల నుంచి ఆగ్నేయాసియా, ఇండోచైనావంటి దేశాలదాకా) అటువంటి వ్యాపారంతో ఏమాత్రం సంబంధంలేని ప్రతిపక్ష పార్టీలు మాదక ద్రవ్య వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించిన చరిత్ర సిఐఏ కుంది.

వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో కొలంబియాలో ఫార్క్ పేరుతో సాయుధ పోరాటం చేసిన విప్లవకారులతో మిలాఖత్ అయి కొకైన్ అనే మాదక ద్రవ్యాన్ని ఉత్పత్తి చేస్తున్నాడని అమెరికా ఆరోపించింది. నిజానికి 2022లో వామపక్ష అభ్యర్థి అధ్యక్షుడిగా ఎన్నుకోబడేదాకా కొలంబియాలోని నియంతృత్వ ప్రభుత్వానికి ఎటువంటి షరతులు లేకుండా అమెరికా మద్దతు పలికింది. అటువంటి నియంతృత్వ ప్రభుత్వ కనుసన్నల్లో మాదక ద్రవ్యాల వ్యాపారం అనేక సంవత్సరాలు నిరాటంకంగా జరిగింది.

ఆ విధంగా చారిత్రకంగా మాదక ద్రవ్య వ్యాపారాన్ని నియంత్రించటంలోగానీ, వినియో గాన్ని తగ్గించటంలో గానీ అమెరికా నిజాయితీగా వ్యవహరించలేదనేది సుస్పష్టం. అంతిమంగా మాదక ద్రవ్యాల నియంత్రణపై అమెరికన్లు అనుసరించిన అవకాశవాద విధానం విఫలమైన తరువాత తాలిబన్లు తమ దేశంలో మాదక ద్రవ్యాలకు ముడి సరుకైన గంజాయి సాగును విజయవంతంగా నియంత్రించగలిగారు.